రు. 20/-

అక్టోబరు 2025

# చైతన్యం

**సంకల్ప బలం**

సామాజిక విలువల మాసపత్రిక

దసరా శుభాకాంక్షలు




15 వ వసంతంలోకి అడుగిడిన మన పత్రిక


దీపావళి శుభాకాంక్షలు


ఆసియా కప్ గెలిచిన
భారత్



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


# చైతన్యం

సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

అక్టోబర్ 2025

సంపుటి -15 సంచిక - 1


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| రచయితల శుభాకాంక్షలు | 7 |
| దసరాలో దుర్గాదేవి అలంకారాలు | 15 |
| యూరియా కోసం యుద్ధాలు | 16 |
| ప్రేమ పరిణయం | 18 |
| కాశీ మజిలీ కథలు | 20 |
| క్రాంతి వీరుడు శ్యాం జీ క్రిష్ణవర్మ | 21 |
| షడ్దర్శనాలు | 25 |
| వ్యక్తిత్వ వికాసంలో మాతృభాష పాత్ర | 27 |
| బ్రహ్మ ఖండం | 30 |
| జ్ఞాపకాల దొంతరలో | 32 |
| కలియుగ ప్రత్యక్ష దైవం | 35 |
| సింహాచల క్షేత్రం | 37 |
| భాషకు ఎదుగుదల .... | 41 |
| మధురస్వప్నం | 44 |
| గజేంద్రమోక్షము | 45 |
| శ్రీకారం | 46 |
| దసరా విజయదసమి | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

చైతన్యం సంకల్పబలం పాఠకులకు దసరా శుభాకాంక్షలు

బతుకమ్మ శుభాకాంక్షలు --- దీపావళి శుభాకాంక్షలు

మన చైతన్యం సంకల్పబలం పత్రిక 2011 విజయదశమి రోజున ప్రారంభించబడి 15 వ వార్షికోత్సవం జరుపుకుంటోంది. 15 వ వసంతంలోకి అడుగు పెడుతోంది అంటే దానికి ముఖ్య కారకులు పాఠకులు, రచయితలు, మన పత్రికను ఎప్పటికప్పుడు ప్రోత్సహించడమే కాక, సమాజానికి ఉపయోగకరమైన సూచనలు చేస్తున్న రచయితలకు, పాఠకులకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు, అభినందనలు. విజయ దశమి శుభాకాంక్షలు.

విజయదశమి

విజయదశమి (దసరా ) అనేది చెడుపై మంచి సాధించిన విజయాన్ని సూచించే హిందూ పండుగ. ఇది ఆశ్వయుజ మాసంలో శుక్లపక్షం పదవ రోజున వస్తుంది. ఈ పండుగను రెండు ప్రధాన సంఘటనల సందర్భంగా జరుపుకుంటారు. 1. రావణాసురుడిపై శ్రీరాముడు గెలుపొందిన రోజు, 2. దుర్గాదేవి మహిషాసురుని సంహరించిన రోజు. ఈ రోజు దేనిలోనైనా విజయం సాధించడానికి శుభసూచకంగా భావిస్తారు.

మన చైతన్యం సంకల్పం పత్రిక విజయదశమి రోజున ప్రారంభించబడింది. మన పత్రిక ఉద్దేశ్యం కూడా మనలో నిక్షిప్తమై ఉన్న చెడు పై విజయం సాధించాలన్నదే పత్రిక ఉద్దేశ్యం. అంతేకాదు మన ముందు తరంలోని మంచి విషయాలు, విలువలు తెలుసుకుంటూ, ప్రస్తుత సామాజిక పరిస్థితులు గ్రహిస్తూ, ఈ తరానికే కాక ముందు తరానికి కూడా పనికొచ్చే పనులు చేస్తూ, మంచిని పదిమందికీ పంచాలన్నదే. "చైతన్యం సంకల్పబలం" ఆశయం కూడా. దీనిని పాఠకులంతా ఆశీర్వదించడం మాకు సంతోషాన్ని, బలాన్ని ఇస్తోంది. 14 సంవత్సరాలుగా రచయితలూ, రచయిత్రులు వారి రచనల ద్వారా చేస్తున్న ప్రయత్నం కూడా అదే. రచయితలు, రచయిత్రులు శ్రమతో ప్రజలకు ఎంతో విలువైన, ఉపయోగకరమైన, సమాచారాన్ని అందివ్వాలని వారు ఎంతో కృషి చేస్తున్నారు. ప్రజలకు పనికొచ్చే సమాచారాన్ని అందివ్వాలనే వారి తాపత్రయం నిజంగా హర్షదాయకం. అందరి ఆశయం నెరవేరుతోందని అనుకుంటున్నాం.

2011 లో ప్రారంభమైన "మన చైతన్యం సంకల్పబలం" పత్రికకు రచయితలు అందిస్తున్న సహాయ సహకారాలు మాటల్లో చెప్పలేను. అప్పటి నుండి సుమారుగా "140 మంది రచయితలు" తమ జ్ఞాన సంపదను మన పత్రిక ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ, విద్యా, వైజ్ఞానిక రంగాలకు సంబంధించిన అంశాలు, అలాగే సైన్స్ కి సంబంధించినవి, భారతదేశంలో విద్యా విధానం గురించి, అమెరికాలోని విద్యా విధానం గురించిన విషయాల గురించినవి కూడా మన ప్రముఖ రచయితలు ప్రజలకు అందిస్తున్నారు. ప్రముఖులైన వ్యక్తుల గురించి, తెలంగాణలో ప్రముఖుల గురించి, అలాగే పండుగలు, వాటి యొక్క విశిష్టత, ప్రస్తుతం దేశంలో జరుగుతున్న అనేక విషయాల గురించి మన సరస్వతీ పుత్రులు ప్రజలకు అందివ్వడం జరిగుతోంది. 15 సంవత్సరాలుగా మన తెలుగు ప్రజలకు ఎన్నో విలువైన సమాచారాన్ని అందించిన రచయితలకు మనమంతా ఋణపడి ఉన్నామనడంలో అతిశయోక్తి లేదు. మన పత్రిక మొదలు పెట్టిన పుటి నుండీ కొందరు ఒక్క నెల కూడా విరామం లేకుండా వ్రాస్తున్నారు. అలాగే ఎంతోమంది కొత్త రచయితలు కూడా వ్రాస్తున్నారు మన పత్రికకు ప్రస్తుతం వ్రాస్తున్న మన సరస్వతీ పుత్రుల పేర్లు... " శ్రీ పోచినపెద్ది మురళి కృష్ణ ,శ్రీ కొత్త రామానందం, శ్రీ వేమూరి వెంకటేశ్వర రావు, శ్రీ తుమ్మూరి రామ్ మోహన్, శ్రీ చిలకమర్తి దుర్గా ప్రసాద్, శ్రీ ఆచార్య డా . శనగవరపు కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీ పాలకుర్తి రామ్మూర్తి,శ్రీ పింగళి వెంకట రమణారావు, శ్రీ ముడుంబై వెంకటాచార్యులు, శ్రీ ఆచార్య కందాళం బదరీ కృష్ణకుమార్, శ్రీమతి ఉషా రాం, శ్రీ మాదిరాజు బ్రహ్మానందరావు, శ్రీమతి మాదిరాజు వాణి, శ్రీమతి సుందరవల్లి శ్రీదేవి, శ్రీమతి వేంకట రమ సోమయాజుల, శ్రీ మైలవరపు మురళి కృష్ణ మొదలైన వారు వ్రాస్తున్నారు. మన రచయితలందరికి పేరు పేరున ప్రతి ఒక్కరికి చైతన్యం సంకల్పబలం తరపున, ప్రేక్షకుల తరపున విజయదశమి శుభాకాంక్షలు, బతుకమ్మ శుభాకాంక్షలు, అభినందనలు, కృతజ్ఞతలు.

అలాగే మన "వీడియో పత్రిక" ద్వారా అందిస్తున్నారు కూడా ఎందరో ఉన్నారు. అమెరికా నుండి కొందరు, ఇండియా నుండి మరి కొందరు. ప్రతి ఒకరికి పేరు పేరున విజయ దశమి శుభాకాంక్షలు, అభినందనలు, ధన్యవాదాలు.

మన "స్వర రాగ ప్రవంతి" ద్వారా ఎంతో మంది గాయనీ గాయకులు ఎంతో మధురమైన పాటలు పాడి, ప్రజలను ఆనంద డోలికల్లో ముంచెత్తున్నారు. ముఖ్యంగా ఈ "స్వర రాగ ప్రవంతి" కి "శ్రీమతి పమ్మి భారతి" గారి

వ్యాఖ్యానం అమోఘం. చాల మంది ప్రేక్షకులు భారతి గారి అందానికి, వ్యాఖ్యానానికి ఫిదా అవుతున్నారు అనడం అతిశయోక్తి కాదు. శ్రీమతి పమ్మి భారతి గారికి మన "చైతన్యం సంకల్పబలం" పత్రిక తరపున వీక్షకుల తరపున ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు. ఇక ఎవరి పాటలైతే విని మంత్ర ముగ్ధులవుతున్నారో ఆ గాన గంధర్వుల పేర్లు కూడా తెలుసుకుందామా! వీరు ...శ్రీ చివటం సుబ్బారావు, శ్రీమతి శ్రీ లక్ష్మి, శ్రీమతి రమా కౌసల్య,శ్రీమతి పాతూరి అనంత లక్ష్మి, శ్రీ హృషీకేష్, శ్రీ కృష్ణ మోహన్, శ్రీమతి మంత్రవాది మహా లక్ష్మి, శ్రీమతి కోరుమిల్లి స్రవంతి, చిరంజీవి పొన్నపల్లి సంహిత, శ్రీమతి సుందరవల్లి రాగ సుధ బృందం బృంద గానాన్ని కూడా వినిపిస్తున్నారు. బృందం లోని గాయనీ మణులు ... 1. T.V. . సుందరవల్లీ శ్రీదేవి 2. M . రాజ్య లక్ష్మి 3. మల్లాది లక్ష్మి 4. మీనాక్షి కొలవెన్ను 5. ఉష వాడపల్లి 6. తబలా .. U . యాదగిరి .
తుమ్మూరి హారిక, శ్రీ ప్రభాకర్,చిరంజీవి ప్రవళిక, డా. మంగళంపల్లి దివ్య లహరి మొదలైన వారు ఎందరో....

మన స్వర రాగ స్రవంతి లో త్యాగరాజ స్వామి కృతులు , అన్నమాచార్య కీర్తనలు , పండుగల సందర్భంగా పాటలు, దేశభక్తి గీతాలు, జానపద గీతాలు, అనేక ఆధ్యాత్మిక గీతాలు పాడి ప్రజల మనస్సులను దోచుకున్నారు. స్వర స్రవంతిని ప్రజల వద్ద అమృత వర్షంలా కురిపించారు మన గాయనీ మణులు. మన స్వర రాగ స్రవంతి గాయనీ గాయకులందరికీ పేరు పేరునా మన చైతన్యం స్సంకల్పబలం పత్రిక తరపున, ప్రేక్షకుల తరపున విజయదశమి శుభా-కాంక్షలు, బతుకమ్మ శుభాకాంక్షలు, అభినందనలు, కృతజ్ఞతలు.

## బతుకమ్మ పండుగ ... తొమ్మిది రోజుల పూల సంబరం

తెలంగాణా ఆడపడుచులంతా బతుకమ్మ పండుగ కోసం ఎంతో ఆనందంగా ఎదురు చూస్తారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ పండుగ. ఇదొక పూల పండుగ. ప్రకృతిని పూజించే పండుగ. తొమిది రోజులూ ఆడి, పాడి, గౌరీ దేవిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించి, ప్రత్యేకమైన పూల సంబరంగా జరుపుకునే పండుగ ఈ బతుకమ్మ పండుగ. ఈ తొమ్మిది రోజులూ మహిళలు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ప్రకృతిలో లభించే అన్ని పువ్వులను తెచ్చి, రంగు రంగుల పువ్వులతో బతుకమ్మలను అందంగా పేర్చి, నిత్యం గౌరీ దేవిని తమ ఆటపాటలతో పూజిస్తారు. అందరూ కలిసి సంతోషంగా పాటలు పాడుతూ, బతుకమ్మ ఆటలు ఆడతారు. ఒకరు పాడుతుంటే మిగిలిన వారంతా వీరికి వంత పాడుతూ ఆటలు ఆడతారు. పితృ అమా-వాస్య రోజున పెద్దలను పూజించుకుంటూ, అదే సమయంలో బతుకమ్మలను పేర్చి మహిళలు సంబరాలు జరుపు-కుంటారు. భాద్రపద అమావాస్య నాడు ఎంగిలి బతుకమ్మగా ప్రారంభమయ్యి, తొమ్మిది రోజుల పాటు సాగి, సద్దుల బతుకమ్మ రోజు గౌరమ్మను సాగనంపడంతో ముగుస్తాయి.

## దీపావళి పండుగ విశిష్టత

మన పురాణాల ప్రకారం లంకలోని రావణాసురుని రాముడు సంహరించి సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు ఆనందోత్సవాలతో దీపాలు వెలిగించారని, అదే దీపావళిగా మారిందని ప్రతీతి.

ఇంకొక పురాణగాథ ప్రకారం, పూర్వం నరకాసురుడు అనే రాక్షసుడు దేవతలను హింసించేవాడు. నరకాసు-రుడు లోకకంటకుడై చేస్తున్న అధర్మ కృత్యాలను అరికట్టడానికి సత్యభామ సమేతంగా తరలి వెళ్ళాడు శ్రీకృష్ణుడు. వారి మధ్య జరిగిన భీకర సంగ్రామంలో భూదేవి అంశ అయిన సత్యభామ శరాఘాతాలకు మరణిస్తాడు నరకుడు. తన పుత్రుని పేరయినా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ కృష్ణుని ప్రార్థించగా, ఆ రోజు నరకచతుర్దశి గా ప్రజలు జరుపుకుంటారని వరం ప్రసాదిస్తాడు శ్రీకృష్ణుడు. నరకుని చెర నుండి సాధు జనులు, పదహారువేల మంది రాజ కన్యలు విడిపించబడ్డారు. ధర్మం సుప్రతిష్టమైంది. నరకాసురుని పీడా విరగడైందన్న సంతోషంతో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుపుకుంటారు. ఈ సుసంబరాలు జరుపుకునే రోజు అమావాస్య కావడంతో చీకటిని పారద్రోలుతూ, ప్రజల దీపాలతో తోరణాలు వెలిగించి, బాణ సంచా కాల్చి వేడుక చేసుకుంటారు. కాల క్రమేణా అది దీపావళి పర్వదినంగా మారింది.

## తెలంగాణాలో మోగిన స్థానిక ఎన్నికల నగారా

తెలంగాణాలో స్థానిక ఎన్నికలకు ఎంపీటీసీ, జడ్పిటీసీ, గ్రామ పంచాయితీ ఎన్నికలకు షెడ్యూల్ ను రాష్ట్ర ఎన్నికల-సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర కమిషనర్ (ఎస్ఈసీ ) 'రాణి కుముది' ని వెల్లడించారు. మొత్తం ఐదు దశల్లో

ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పిటీసీ మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు.

ఎంపీటీసీ, జడ్పి టీసీ లకు అక్టోబర్ 23న తొలి విడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తా-మన్నారు. గ్రామ పంచాయితీ లకు తొలి విడత అక్టోబర్ 31 న, రెండో విడత నవంబర్ 4 న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ పూర్తయిన తరవాత అదే రోజున లెక్కింపు జరుగుతుందని ఎస్ఈ సీ తెలిపారు.

టీవీకే నాయకులపై కేసు

తమిళనాడులోని కరూరులో నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్ ప్రచార సభలో శనివారం జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీవీకే నాయకులు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దుర్ఘటనపై విచారణకు నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని, ముఖ్య మంత్రి ఎం. కె. స్టాలిన్ తెలిపారు. తొక్కిసలాట ఘటనలో మృతుల సంఖ్య సోమవారానికి 40 కి చేరింది. వివిధ ఆసుపత్రుల్లో 80 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో ఐదు గురి పరిస్థితి విషమంగా ఉంది. మరణించిన వారిలో ఒక్క కరూర్ జిల్లాకు చెందిన వారే 32 మంది ఉన్నారు. మృతులకు నివాళిగా ఆదివారం కరూర్ జిల్లాలో 15 వేల దుకాణాలను వ్యాపా-రాలు మూసివేశారు.

ఇంత జరగడానికి కారకులు ఎవరు? మన ఎన్నికల ప్రచార విధానం కాదా? ప్రచారాల కోసం ప్రజలను ఎందుకు రోడ్లపై తిప్పుతారు? ఎన్నికలో నిలబడతాము అనే ఆలోచన వచ్చిన దగ్గర నుండి ప్రజలను ఓట్ల కోసం ఉసి గొల్పి, వారి ప్రాణాల మీదకు ఎందుకు తీసుకు వస్తారు? ఇంతటి ఘాతుకాలు జరిగినా మన రాజకీయనాయకుల్లో, ఎన్నికల్లో ప్రచారం చేసుకునే విధానం లో ఎందుకు మార్పు రావడం లేదు? ఎన్నికల ప్రచారాల కయ్యే సమయం, ఖర్చు ప్రజా నష్టం, ట్రాఫిక్ జామ్ లు, పోలీసుల హడావిడి ... ఎప్పటికి మన విధానాల్లో మార్పు వస్తుంది? ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలలో ఉన్నమంచి మంచి ఎన్నికల విధానాలు మనం ఎందుకు అనుసరించలేకపోతున్నాం? ఒక్కొక్కపా-ర్టీ ఎన్నికల్లో నిలబడిందంటే చాలు... ఎక్కడలేని హడావిడి, ఖర్చు, ప్రజల మనస్సుల్లో ఆశలు రేపడం ... ఈ ఖర్చు అంతా మళ్ళీ ప్రజలదే. వారి డబ్బు ఖర్చు చేస్తూ, వారికే ఏదేదో చేస్తామని ఆశలతో వారిని ఉపన్యాసాలతో ఊదరగొడు-తున్నారు. ఆలోచన లేని ప్రజలు కూడా వారి వెంబడి తండోపతండాలుగా ఊరేగుతారు. ప్రజల ఆలోచనలు కూడా మారాలి. ప్రజల స్వార్ధపూరిత ఆలోచనల వల్ల కూడా వీటికి అవకాశం ఎక్కువగా ఉంటోంది. మన దేశం మిగిలిన దేశాలతో పోటీ పడాలంటే, ఇలాగే ఉంటే, ఎప్పటికి అభివృద్ధి చెందుతుంది? ప్రజలారా ... రాజకీయ నాయకులారా! ఆలోచించండి. మన పద్ధతులు, మన విధానాలు మార్చుకుందాం.

ఒక పక్క ఆర్థిక అసమానతలతో మన దేశం తల్లడిల్లిపోతోంది. కొందరికి లక్షల్లో జీతాలు, లక్షల్లో పెన్షన్లు, మరో పక్క ఎంత పెద్ద పొజిషన్లో, ఎన్ని సంవత్సరాలు ఉద్యోగం చేసి, ఉద్యోగ విరమణ పొందినా, పేదవాడికిచ్చే కనీస పెన్షన్ కూడా లేని బ్రతుకులు. ఇంకా కొందరు అప్పులు చేసి ఆస్తులు అమ్ముకుని, విదేశాలకు పిల్లల్ని పంపుతుంటే, అక్కడ పిల్లల గతి అధ్వాన్నంగా, అయోమయంగా ఉంటోంది. కొందరైతే ఉద్యోగాలు ఊడి, అక్కడ ఉండనివ్వక పోతే, ఇంటి ముఖం పట్టలేక నానా అవస్థ పడుతున్నారు. ఇండియాకి వచ్చినా రికమండేషన్ ఉండాలి లేదా ఇక్కడ కూడా అంతంత మాత్రం ఉద్యోగాలే. అలాగే ఉద్యోగాలు ప్రస్తుతం ఉన్నా, అమెరికా నుండి ట్రంప్ ఎప్పుడు ఎవరిని వెళ్ళగొడతాడో అని ఇటు తల్లిదండ్రులు, పిల్లలు బిక్కుబిక్కు మంటూ ఉంటున్నారు.

మనం అందరం కలిసి గట్టుగా మన ఆర్థిక వ్యవస్థను సరిచేసుకోకపోతే, ఇంకా ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తుంది. మన దేశంలో ప్రజలు కష్టప-డే తత్వం, నిస్వార్థం, సమయ భావన, పనిలో పోటీ తత్వాన్ని పెంచుకుకోవడం ఇలాంటివి అన్నీ మనం నేర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మనలో ఉన్న చెడునంతా చెరిపేసుకుని, మనం జీవించి ఉన్నంతకాలం అందరం కష్టపడి పని చేసుకుంటూ కలిసిమెలిసి దేశాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకువెళ్లాలని మీ చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.



సర్వేజనా సుఖినోభవంతు

తీగవరపు శాంతి

# పత్రిక 15 వ వసంతం లోకి అడుగిడుతున్న సందర్భంగా రచయితల మరియు పాఠకుల శుభాకాంక్షలు

## చైతన్యం సంకల్పబలం తో ఎనిమిదేళ్ల అనుబంధం

*******************************************************



చూస్తుండగానే 8 ఏళ్ల కాలం గడచిపోయింది . చైతన్యం సంకల్పబలం సప్తమ వార్షికోత్సవం నుండి మొదలైతే పంచాదశ వార్షికోత్సవం దాకా అంటే 90కి పైగా సంచికలకు వ్యాసాలు నేనే రాసానా అన్న విస్మయం కలుగుతుంది.
మొదటిసారి తీగవరపు శాంతిగారు నన్ను సమ్మక్క సారలక్క జాతర గురించి రాయమని అడిగారు. ఇక్కడా అక్కడా శోధించి ఓ వ్యాసం రాసాను. ఇంతలో కేసీయార్ తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభలు వచ్చాయి. వాటి గురించి రాయమన్నారు. ప్రత్యక్షసాక్షిని. గనుక నేను చూసిందీ, నాకు తోచిందీ రాసిపంపాను . ఈ లోగా పత్రిక సప్తమ వార్షికోత్సవం వచ్చింది. పాత సంచికలు పరిశీలించి వార్షికోత్సవం గురించి రాయమంటే అభినందనలు వ్యాసరూపంలో పంపపడం జరిగింది
ఈ లోగా చాలసార్లు ఫోనులో సంభాషణల్లో నన్ను ఏదైనా ఒక విషయం మీద ప్రతినెలా వ్యాసం రాయటానికి పురుకొల్పటం జరిగింది. అలా తెలంగాణకు చెందిన సాహితీ వరిష్టులు , ముఖ్యంగా నాకు ఏదో ఒకరకంగా పరిచయమున్న వారి గురించి రాయాలనుకుని ముందుగా ఒద్దిరాజు సోదరులతో మొదలుపెట్టాను.ఇక అప్పటినుండి ఆవిడ ప్రతినెలా వ్యాసం గురించి గుర్తుచేయడం నేను రాసిపంపడం జరుగుతూ వస్తున్నది.

ఆ పరంపరలో ఒద్దిరాజు సోదరులతో మొదలుపెట్టి కాళోజీ, వానమామలై వరదాచార్యులు, జగన్నాథాచార్యులు, పల్లాదుర్గయ్య,వట్టికోట, పి.వి.,సదాశివ,
బి.ఎన్.శాస్త్రి,పెండ్యాలా వామన్ రావు, మాదిరెడ్డి సులోచన, బాపురెడ్డి, ద్వానాశాస్త్రి,నల్లాన్ చక్రవర్తుల రంగనాథ్, కే, నారాయణ గౌడ్ ,మడిపల్లి భద్రయ్య, పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి, తిరుమల శ్రీనివాసాచార్య, ముదిగంటి సుజాతా రెడ్డి, పోల్కంపల్లి శాంతాదేవి, నాగరాజు రామ స్వామి, అల్లం రాజయ్య, అనుమాండ్ల భూమయ్య, బి.ఎస్ .రాము లు, జయధీర్ తిరుమల రావు, ప్రొఫెసర్ .ఎస్వీ రామారావు,ఉడయవర్లు, వడ్డేపల్లి కృష్ణ, నలిమెల భాస్కర్, ఎలనాగ, తాళ్లప ల్లి , పత్తిపాక, జూపాక సుభద్ర , డా. సంగనభట్ల నర్సయ్య అలా ఇటీవల కే.వి. రమణాచార్యులు ,డా. మాదిరాజు బ్రహ్మానంద రావు గారి దాకా ఎవరో ఒక సుప్రసిద్ధ సాహితీ మూర్తుల గురించి రాస్తూ వస్తున్నాను. మధ్యలో ఎవరెస్టు నధిరోహించిన గిరిజన బాలిక పూర్ణా మాలావత్ గురించి రాయటం జరిగింది. మొన్న రెండు సంచికలలో నేను రాసిన గేయకావ్యం క్రాంతివీరుడు అన్నపేరుతో అకలంక దేశభక్తుడు పండిత్ శ్యామకృష్ణజీ వర్మ జీవిత కథా గేయం రెండు భాగాలు

ప్రచురించ బడ్డాయి. మొదలు పెట్టిన నాటినుండి నేటి వరకు ఏనెలా పంపించకుండా ఉండలేదు నాకు తెలిసి.అంటే నా వ్యాసాలు సెంచురీ కొట్టినట్లే .
తీగవరపు శాంతి గారి సంకల్పబలం చాలా గొప్పది. పేరుకు తగ్గట్టు చైతన్యం కలిగించే సంకల్పం . వారి సంకల్పబలం ఎంత గొప్పది అంటే అంత వరకు కేవలం కవిత్వానికి, పద్య,గేయ రచనకు మాత్రమే పరిమితమైన నన్ను ,ఒక కాల మిస్టుగా , వ్యాసరచయితగా నిలబెట్టేంత.
ఈ వ్యాసాలు రాస్తున్న స్ఫూర్తితో ఆ తరువాత, ఫేస్బుక్ మాధ్యమంలో నేను మానేరు ముచ్చట్లు మా ఊరు వెలగందుల వెయ్యేళ్ల చరిత్ర రాసి పుస్తకంగా వేస్తే దానికి తెలంగాణ సారస్వత పరిషత్తు వారి ఉత్తమ గ్రంథ పురస్కారం లభించింది. ఆ ఊపుతోనే కాగజ్ నాగర్ సాంస్కృతిక రంగ విశేషాల సర్సిల్క్ సరిగమలు, నా ఉద్యోగ విశేషాల ఉద్యోగ పర్వం, నా కరీంనగర్ అనుభవాల అరిపిరాల ముచ్చట్లు వంటివి రాయటం జరిగింది.
ఆ తరువాత మూడు జిల్లా సర్వస్వాలకు నా వ్యాసాలు రాసివ్వటం జరిగింది. నా యూరపు యాత్ర విశేషాలు, అమెరికా ముచ్చట్లు ఇవే కాకుండా పలువురి పుస్తకాలకు ముందుమాటలు, పుస్తక సమీక్షలు ఇవన్నీ నా వచనరచనకు సంబంధించినవే. ఇవన్నీ రాయడానికి స్ఫూర్తి శ్రీమతి తీగవరపు శాంతిగార నటం లోసందేహం లేదు.అవన్నీ రాయడానికి కార్యకారణ సంబంధం చైతన్యం సంకల్పబలం కోసం రాసిన వ్యాసాల అనుభవం .
శాంతి గారితో పరిచయం గమ్మత్తుగా జరిగింది. 2017లో అమెరికావెళ్లినపుడు హ్యూస్టన్ లో నెలనెలా తెలుగు వెన్నెల దశమ వార్షికోత్సవం జరుగుతుందని తెలిసింది. సుప్రసిద్ధ సాహితీవేత్త వంగూరి చిట్టెన్ రాజు గారితో మాట్లాడినపుడు వారు కార్యక్రమానికి ఆహ్వానిస్తూ మీ పుస్తకాలేవైనా విడుదల చేసుకోవాలంటే చేసుకోవచ్చు అన్నారు. అప్పటికి నా ఎలకోయిల పాట గేయసంపుటి కారణాంతరాలవల్ల ఆవిష్కరణ కాకుండా ఉంది గనుక అదే చెప్పాను.ఆయన సరేనన్నారు.జూలై మూడోవారంలో ఆదివారం నాడు ఉదయం పూట కార్యక్రమం ఏర్పాటు చేసారు నన్నూ మా ఆవిడనూ మా అమ్మాయి ఆ స్థలానికి తీసుకు వెళ్లింది. చిట్టెన్ రాజుగారి చేతులమీదుగా పుస్తకం ఆవిష్కరించ బడింది.
ఆ తరువాత నా పుస్తకం చదివిన వారు ఎవరూ లేకపోవటంతో నా పుస్తకం గురించి నాలుగు మాటలు నేనే చెప్పవలసి వచ్చింది. ఇదంతా జరుగుతున్నప్పుడు మా ఆవిడ పక్క నే కూర్చున్న ఒక జత కన్నులు నన్ను గమనిస్తూ చెవులు నా మాటలు శ్రద్ధగా వింటున్నట్టు చూసాను. సమావేశం ముగియటం కోసం ఎదురు చూస్తున్నట్టుగా కార్యక్రమం అవగానే అరపై కి అటూ ఇటూగా ఉన్నా ఎంతో చైతన్యవంతంగా ఉన్న ఆవిడ , నా దగ్గరికి వచ్చి చైతన్యం సంకల్పబలం మాస పత్రిక సంపాదకురాలిగా పరిచయం చేసుకున్నారు శ్రీమతి తీగవరపు శాంతిగారు. ఆన్ లైన్ పత్రిక వివరాలు ఇచ్చి పాత సంచికలు చూడ మని, అలాగే వీలైనపుడు మాట్లాడ టానికి వారి చరవాణి నంబరు ఇచ్చి , నా నంబరు తీసుకుని వారు ఎక్కడఉండేదీ , వాళ్ల పిల్లల సంగతులు నాతో మా ఆవిడతో కలిసి మాట్లాడుకున్న తరువాత ఎక్కడి వాళ్లం అక్కడ విడిపోయాం. అది చైతన్యం సంకల్పబలంతో తొలి పరిచయం. ఆ తరువాత ఇండియా రాగానే వ్యాసాలు రాయటం మొదలైంది .
ఏమీ ఆశించకుండా , నిబద్ధతతో విలువలతో కూడిన పత్రికను నెలనెలా తీసుకు రావటం అదీ ఆన్ లైన్లో తీసుకు రావడం ఆషామాషీ వ్యవహారం కాదు. పత్రిక సంపాదకురాలు శ్రీమతి తీగవరపు శాంతి గారు వారి జీవనసహచరులులైన ప్రసాద్ గారు మరియు కొడుకు కూతురు సహాయంతో అందంగా , ఆకర్షణీయంగా పత్రికను రూపొందించటం అభినందనీయం.
దీనికి తోడు ఇటీవల కొంత కాలం నుండి తెలుగు తెలిసి తెలుగు చదువలేని, చదవడానికి సమయొుమ దొరకని పాఠకు లకోసం దృశ్య శ్రవణ మాధ్యమం లో వీడియో మాగజైన్ కూడా తీసుకు వస్తున్నారంటే

శాంతిగారి పాత్రికేయ పిపాస ఎంతటిదో ఊహించవచ్చు.

ఈ విజయదశమి కి పదిహేనవ వార్షికోత్సవం జరుపుకుంటున్న చైతన్యం సంకల్పబలం ఎందరో రచయితలకు స్ఫూర్తిగా నిలుస్తున్నది. ఈ దంపతులు ఇరువురు సప్తతిదాటిన తరువాత కూడా ఏ మాత్రం నిరుత్సాహ పడకుండా పత్రికను నిర్వహిస్తున్నందుకు నా ప్రత్యేక హృదయపూర్వక అభినందనలు. ముఖ్యంగా సంపాదకీయం కోసం ప్రతినెలా కొత్త విషయాలను ఎప్పటికప్పుడు సేకరించి పాఠకులకు తెలియ జేయడానికై శాంతి గారు ఎంత తపన పడతారో నాకు తెలుసు.ప్రతి రచయితను సంప్రదించి వ్యాసాలు రాబట్టుకోవడం లో శాంతిగారు నేర్పరులైన సంపాదకులు. వారి సహనం
అభినందనీయం.విభిన పార్శ్వాలకు చెందిన పలురకాల వ్యాసాలతో పత్రికను అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్ద డానికి వారు పడే ప్రయాస అంతా ఇంతా కాదు. వారిని ఎంత పొగిడినా తక్కువే.

ఈ పంచాదశ వార్షికోత్సవ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ , నన్నొక వచన రచయిత గా తీర్చిదిద్దిన చైతన్యం సంకల్పబలం  సంపాదకులు శ్రీమతి తీగవరపు శాంతిగారికి మరియు వారికి వెనుక వెన్నెముకగా ఉన్న వారి శ్రీవారు ప్రసాద్ గారికి మరియు తోడుగా నిలచిన వారి అమ్మాయి అబ్బాయి తో పాటు,సహరచయితలకు ,సహృదయులైన పాఠకులకు నా హృదయపూర్వక కృతజ్ఞాభివందనాలు.

- తుమ్మూరి రాం మోహనరావు మీ

---



అకుంఠిత సంకల్ప బలముతో పంచదశ శరద్వసంతాల "చైతన్యం" మాసపత్రిక పాఠకుల మనసు దోచుకుంటున్నదనుటలో సందేహంలేదు. శాంతి గారి సంపాదకీయం,  ప్రపంచంలోని వార్తల సమాహారం. వీడియో ప్రసారాలు చాలా హృద్యంగా ఉన్నాయి. సాహిత్య, సాంఘీక, సామాజిక ,ఆధ్యాత్మిక విషయాలతో అందరి మన్ననలను అందుకుంటున్న మీ (మన) పత్రిక లో పాలు పంచుకుంటున్న అందరికి దసరా శుభాకాంక్షలు

- ఆచార్య డా.శనగవరపు కృష్ణమూర్తి    శాస్త్రి

---

చైతన్యం సంకల్పబలం
పదునాలుగేండ్లు పూర్తి చేసుకొని..
పదునైదవ సంవత్సరంలోనికి అడుగిడుతున్న శుభతరుణములో... ప్రశంసాపద్యం.

సాహితీ ప్రాగ్దిశ చైతన్య భానుడై
యుదయించి కవితలు ముదము బంచి
సంగీత వారాశి సంకల్పచంద్రుడై
శోభిల్లి రసరాగ సుధల ముంచి,
లోకకల్యాణమే శ్రీకరమ్మని యెంచి
కార్యక్రమాల సంక్రాంతులిచ్చి
ఆర్షవిధానమ్మునాచరించుచు భక్తి
పథమును సూచించి పరిఢవిల్లి

ధరణి పదునాలుగేండ్ల సంబరమునంది
వరలె చైతన్యసంకల్పవైభవమ్ము!
ఆదరించినవారికి అంజలించి
అడుగులను మోపె పంచదశాబ్ది యందు!!

ప్రవిమలసత్కళావిభవభాసురధీమణులైన రమ్యతీ
గవరపువంశజాతులను కావ్యమనోజ్ఞమరందమాధురీ
నవరసపుణ్యమూర్తుల ఘనమ్ముగ గాచి ప్రసాదశాంతులన్
భువి యశమిచ్చి సంపదల భూరిగనిచ్చి మురారి ప్రోచుతన్!

జయోస్తు

- మైలవరపు మురళీకృష్ణ

---

**Congratulations. Wish you all the best. పత్రిక బాగుంటుంది. మంచి విషయాలు cover చేస్తున్నారు. Once again all the best.**

---

-

రత్నం... అంచలంచెలుగా అడుగులు వేస్తూ ఒక్కొక్క సంవత్సరం వృద్ధి పొందిస్తూ నిరంతరం శ్రమిస్తూ 15 వసంతాల మైలురాయి చేరు కున్న నీ కృషి అనితర సాధ్యం అభినందనీయం.. హృదయపూర్వక శుభాశీస్సులతో.......

ఎం. రత్నాజీ రావు

# అలుపెరుగని అక్షరోపాసకులకు అభ్యుదయాకాంక్షలు



అక్షరం అక్షరమని విశ్వసించి అక్షరోపాసన చేస్తున్న శ్రీమతి శాంతిగారికి.. వారికి పూర్తి సహాయ సహకారాలందిస్తున్న వారి భర్త గారు అయిన ప్రసాదు గారికి ముందుగా విజయదశమి శుభా-కాంక్షలు.. పత్రిక స్థాపించి సమర్ధవంతంగా పదునైదు సంవత్సా-లుగా విలువల ప్రాతిపదికగా నడిపిస్తున్న ఆ దంపతులకు, పత్రిక సంపాదక వర్గానికి, పత్రిక విజయంలో బాధ్యులైన ప్రతి ఒక్కరికీ, ముందుగా అభినందనలు.

శ్రీ తుమ్మూరు రామ్మోహన్ రావు గారి ద్వారా 2021 సం-వత్సరంలో శ్రీమతి శాంతిగారికి పరిచయం కావడం, వారి కోరిక మేరకు వ్రాయగలిగిన అంశాలపై వ్యాసాలను వ్రాసి పంపడం అనేది నాకు అందివచ్చిన ఒక ఉదాత్తమైన అవకాశం. ఎవ-రికైనా సమర్ధత ఉండడం వేరు దానిని ప్రదర్శించుకునే వేదిక లభించడం వేరు. అలా ప్రోత్సహించ గలిగిన సహృదయత కలిగిన వారి చెలిమి లభించి వారు ఇచ్చే అవకాశం వల్లనే ఎవరైనా ప్రతిభకు మెరుగులు దిద్దుకోవడం సాధ్యపడుతుంది. పత్రిక యాజమాన్యం వారి గుర్తింపు లేకపోతే ముందుకు సాగడం ఏ రచయితకూ సాధ్యపడదు. గత నాలుగు సంవత్సరాలుగా పలు వ్యాసాలు ప్రచురితమవడమే కాక నా వ్యాసంగాన్ని పదుగురితో పంచుకునే అవకాశం ఇచ్చిన పత్రిక యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుకునే అవకాశంగా దీనిని భావిస్తున్నాను.

వ్యక్తి విజయం.. ఎదుగదల, వికసన, విస్తరణ, వ్యాప్తంల మీదుగా అభ్యుదయం వైపు సాగాలి. అభ్యుదయంలో సమాజం కూడా భాగస్వామ్యం అవుతుంది. అలా కాని నాడు విజయం లభించినా అది నిరర్ధక విజయమే అవుతుంది. పరస్పరాధారిత సమాజంలో ఎదుగుల ఒంటరిగా ఎంతటి గొప్పవారికైనా అసాధ్యమే. మహాభారతంలో ఒక పద్యం ఉన్నది. దాని భావం.. ధృతరాష్ట్రుడు అతని కుమారులు పెద్ద అడవి కాగా పాండవులు సింహాలు అంటూ.. దట్టమైన అడవి వల్ల సింహాలకు రక్షణ ఉంటుంది.. అలాగే సింహాల వల్ల అడవికీ రక్షణ ఉంటుంది.. కాబట్టి పరస్పరం రక్షణను ఇచ్చుకుంటే ఇరువురూ బాగుపడ-తారు.. అంటారు తిక్కనగారు. అది ప్రతి రంగంలోనూ సరిపోతుంది. Cooperation, Coordination, Collaboration ఉన్న చోట విజయం.. అభ్యుదయంగా పరిణామం చెందుతుంది.

ప్రభావవంతమైన వివిధ అంశాలను సమర్ధత, విజ్ఞత, పాండిత్యం కలిగిన పెద్దల నుండి తెప్పిం-చుకోవడం, వాటిని చక్కగా ఎడిట్ చేసి పాఠకుల అభిరుచి మేరకు సకాలంలో ముద్రించి అందించడం.. సంపాదకులకు కత్తి మీద సాములాంటిదే. ప్రతిభా పాటవాలు, ప్రాజ్ఞత కలిగిన అనుచరుల సహాయ సహకారాలు వారి ఉదాత్తమైన సంకల్పాన్ని సాకారం చేసుకునేందుకు ఉత్ప్రేరకంగా పనిచేయడం వల్ల ఇన్ని సంవత్సరాలుగా పాఠకులకు ఎన్నో విశిష్టమైన అంశాలు చేరువ కాగలుగుతున్నాయి. పాఠకుల ఆద-రణను పత్రిక పొందగలుగుతున్నది.

దేశ భక్తి, జాతీయత, భారతీయ విజ్ఞానం, జాతీయ సంస్కృతి, విద్యా వికాసం, ప్రాచీన భారతీయ విలువలు, ఆధునిక యాజమాన్య నిర్వహణా విశిష్టత, శాస్త్రీయ విజ్ఞానం, సాంకేతిక అభివృద్ధి.. దాని వినియోగం, ఆధ్యాత్మికత, తాత్విక అవగాహన.. మహిళా అభ్యుదయం, కుటుంబ జీవన ఆవశ్యకత, పండుగల ప్రాధాన్యత.. లాంటి పలు అంశాలపై సమగ్రమైన అవగాహన కలిగిన రచయితల నుండి

వచ్చిన రచనలను ప్రచురించడం వల్ల పత్రిక సమకాలీన పత్రికలకు భిన్నంగా ప్రజలకు చేరువయిందని విశ్వసిస్తున్నాను.

పత్రికా రంగంలో వికాసాన్ని విస్తరణగా మార్చుకొని ముందుకు సాగుతున్న శ్రీమతి శాంతిగారికి.. వారి బృందానికి వారి ప్రయత్నం దిగ్విజయంగా ముందుకు సాగాలని కోరుకుంటూ.. ఆ శక్తి యుక్తులను వారికి అనుగ్రహించాలని ఆ పరమేశ్వరిని ప్రార్థిస్తూ..

నమస్సులతో..

పాలకుర్తి రామమూర్తి

## పదిహేను దీప్తిమయ సంవత్సరాల పత్రికా యాత్ర

గత 15 సంవత్సరాలుగా 'చైతన్యం సంకల్పబలం' పత్రికను నిరంతరాయంగా, నిస్వార్థంగా ప్రచురిస్తూ పాఠక లోకానికి ఒక విశిష్టమైన వేదికను అందిస్తున్న అక్కకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

ఈ పత్రికలో భక్తి, రాజకీయాలు, సాహిత్యం, కళలు, సామాజిక అంశాలు మొదలైన ఎన్నో విభాగాలను సమగ్రంగా సమకూర్చి ప్రతి సంచికను ఒక విలువైన గ్రంథంగా తీర్చిదిద్దుతున్నారు. పాఠకుల మనస్సులను ప్రబోధించేలా, సమాజానికి మార్గదర్శకత్వం చూపించేలా, విశాలమైన జ్ఞానాన్ని పంచేలా ప్రతి పేజీని మలచడం నీయొక్క పట్టుదల, చైతన్యం, సంకల్పబలం వలన సాధ్యమైంది.

ఒకే ఒక పత్రికను ఇంత కాలం పాటు ఇంత నిబద్ధతతో కొనసాగించడం అనేది అసాధారణమైన సాధన. ఇది పత్రికా రంగానికి ఒక స్ఫూర్తి దీపిక, రాబోయే తరాలకు మార్గదర్శి.

చైతన్యం వెలుగుల దీప్తి మీరు,
సంకల్పబలానికి ప్రతిరూపం మీరు.
పదిహేనేళ్ల నిబద్ధతయాత్రలో
పత్రికా రూపంలో గాథ రాశారు.

'చైతన్యం సంకల్పబలం' ప్రతి సంచికలో
భక్తి భావం ఉజ్వలమైంది,
రాజకీయ దృక్పథం ప్రతిధ్వనించింది,
సాహిత్య సోయగం పరిమళించింది.

ఒకే పత్రిక – కాని అశేష విశేషాలు,
ప్రతి పేజీ సమాజానికి దీప్తి.
అంకితభావం మీ కృషికి పునాది,
పట్టుదలే మీ విజయానికి మూలం.

ఇలాగే మరిన్ని దశాబ్దాల పాటు పత్రికను మరింత విస్తృత స్థాయిలో తీసుకువెళ్లాలని, సమాజానికి మరిన్ని విలువైన విశేషాలను అందించాలని ఆకాంక్షిస్తూ రత్నంఅక్కకు- హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు

మంగళంపల్లి శ్రీనివాస్
రిటైర్డ్ సీనియిర్ బ్యాంకు మేనేజర్

---

శాంతి గారూ,

మీ నాయకత్వంలో "చైతన్యం సంకల్పబలం" 15వ వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా మీకూ, మీకు వెన్నుదన్నుగా నిలిచి సహకరించిన వారందరికీ నా హృదయ పూర్వక అభినందనలు!

గతంలోని మంచిని వర్తమానానికి అన్వయిస్తూ మారుతున్న సమాజంలో మంచిని పెంచడం అనే సంకల్పంతో మీరు చేసిన కృషి వెనుక వున్న మీ ఆశావహ దృక్పథం అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

ఈ సంక్షుభిత కాలంలో, కుగ్రామంగా మారిన ప్రపంచంలో మీ నాయకత్వంలో "చైతన్యం సంకల్పబలం" పత్రిక సర్వే జనా సుఖినోభవంతు, వసుధైక కుటుంబం లక్ష్యాలుగా మరింత వర్ధిల్లాలని హృదయ పూర్వకంగా కోరుకుంటున్నాను.

రావి సుబ్బారావు
సీనియర్ డిజిఎం (రిటైర్డ్)
బి హెచ్ఇఎల్

---

**మన "చైతన్యం సంకల్ప బలం" పత్రిక 15 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా కుటుంబ సభ్యులైన, అందరికీ శుభాకాంక్షలు, శుభాభివందనములు.**

శ్రీమతి శాంతి గారు యీ పత్రిక పుట్టుకకు పడ్డ పురిటి నొప్పులను మా మొదటి పరిచయలోనే సవివరంగా వివరించారు. ఈ పత్రికతో నాది కేవలం యేడు మాసాలా అతి చిన్న పరిచయం. నేను యింతకుముందు యెన్నడూ యెటువంటి రచనలూ చేసి యుండలేదు.
నేను December 2024 మొదటి వారంలో మా పిల్లల దగ్గరికి Manchester (UK) వెళ్లాను. అక్కడ నాకు హఠాత్తుగా యేమైందో తెలియదు. శ్రీ సిరివెన్నెల సీతా రామ శాస్త్రి గారు రచించిన "విధాత తలపున...." అనే పాట నా తలంపునకు వచ్చినది. అంతే.... ఆయనను స్మరించుకుంటూ ఒక చిన్న రచనా ప్రయత్నం చేసాను.
ఆ నా మొదటి రచన, నాకు అప్పటివరకూ అస్సలు పరిచయంలేని యీ పత్రికా సంపాదకురాలైన, అప్పుడు USA లో ఉంటున్న శాంతి గారికి, నాకు, నా మేనల్లుడి భార్య అయిన (యీమె పేరు కూడా) శాంతి ద్వారా చేరినది.
ఈ పత్రికా సంపాదకురాలైన శాంతి గారు నా యీ మొదటి ప్రయత్నాన్నే మెచ్చుకొని, మన పత్రిక లో ప్ర-చురించి, నాకు యెనలేని ఆత్మ విశ్వాసాన్ని, ప్రోత్సాహాన్నివడం ఒక విశేషం. నా మొదటి రచనకే యింత స్పందన కలగడం నాకు అమితానందాన్ని యిచ్చింది.
నేను ఆ రచనలో, శ్రీ శాస్త్రి గారిని, "మీరొక చైతన్య స్వరూపులు..." అని పొగిడాను.
అప్పటికి నాకు అస్సలు తెలియదు. ఈ నా రచన మన పత్రికకు స్వంతం అవుతుందని. పత్రిక పేరు "చైతన్య సంకల్ప బలం" అవడం కాకతాళీయం మరియూ నాకు ఆశ్చర్యాన్ని కల్గించింది. ఎందుకనగా, 'చైతన్యం' అనగా 'భగవంతుడు'. భగవంతుని యొక్క బలమైన సంకల్పమే యీ పత్రిక. అయితే, నా రచన కూడా ఆ భగవంతుని సంకల్పమే అయి వుంటుంది. కాకపోతే, ఆ మహానుభావుని గురించి నేను వ్రాయటం యేమిటి....!!??
శాంతి గారు, మళ్ళీ యేమైనా వ్రాయమన్నారు. నా బలహీనతలను ఆమెకు వివరించాను. ఐనా నన్ను ప్రోత్సహించారు.
అప్పుడు నాకు శ్రీ K.విశ్వనాధ్ గారి గురించి వ్రాయాలని వుంది అని చెప్పి, మొదలుపెట్టి, దాన్ని కూడా అతి కష్టం మీద పూర్తి చేసాను. శ్రీమతి శాంతి గారి ప్రోత్సాహం యెంతమాత్రం తగ్గకుండా, నన్ను "వ్రాసారా.... వ్రాసారా" అని తరచూ అడుగుతూనే వుండేవారు, అది కూడా, యెంతో సున్నితంగా.
అలా మొదలైన నా యీ రచనా ప్రయాణంలో గత యేడు మాసాలుగా నా సేవలు అందిస్తున్నాను. ఇది నాకు గర్వకారణం. "నా అంతరంగం" అంటూ నా మనోభావాలను మీ ముందు వుంచుతున్నాను.
నా రచనలను చదివి, నన్ను ప్రోత్సాహిస్తున్న పాఠక దేవుళ్ళైన మీకందరికీ ధన్యవాదాలు. అలాగే నాకీ అవకాసం యిచ్చి, నన్ను బాగా ప్రోత్సాహిస్తున్న సంపాదకురాలు శ్రీమతి శాంతి గారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఆమె యొక గృహిణిగా వుండి కూడా గృహస్తు కర్తవ్యాలను సక్రమంగా నిర్వహిస్తూ సమాజానికి కూడా తమ విలువైన సేవలు అందించాలనే దృకృధంతో దూసుకుంటూ ముందుకు వెళుతున్న సంగతి మీడియా ద్వారా ఒక Radio Jockey (RJ) కి ఇచ్చిన ఇంటర్వ్యూ ద్వారా తెలుసుకుని యెంతో గర్వించాను.
మంగళంపల్లి బాల మురళీ కృష్ణ గారు అందరికీ సుపరిచుతులే. వారు శాంతి గారికి దగ్గరి బంధువులు కావడం వల్ల, వారి అభిమానులమైన మనకూ వారి గురించి మరికాస్త యెక్కువ తెలుసుకుని, ఆనందించే అవకాసం దక్కిందని చెప్పవచ్చు.

(26 వ పేజీ చూడండి)

# దసరాలో దుర్గాదేవి అవతారాలు - అలంకారాలు

పార్వతీదేవిని వివిధ రూపాల్లో పూజించే ప్రధానమైన పండగ దసరా. మన దేశమంతా ఈ పండగను చేస్తారు. ఈ పండగ రోజుల్లో అష్టాదశ శక్తిపీఠాలు, శైవక్షేత్రాలు మహావైభవంగా విలసిల్లుతాయి. పూజలు, అర్చనలతో సందడిగా ఉంటాయి. కోల్ కతాలో కాళికాదేవికి విశేష పూజలు జరుగుతాయి. మైసూరు దసరా ఉత్సవాలు దేశంలోనే ప్రసిద్ధి. మన తెలుగు రాష్ట్రాల్లో విజయవాడ కనకదుర్గ, శ్రీశైలం భ్రమరాంబిక, శ్రీ కాళహస్తి జ్ఞానప్రసూనాంబ, అలంపూరు జోగులాంబ, వరంగల్ భద్రకాళి, హైదరాబాదులో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడతాయి.

## ఆశ్వీయుజం మొదటి రోజే దసరా ప్రారంభం

దసరా పండగ ఆశ్వీయుజ మాసం మొదటి రోజు శుద్ధ పాడ్యమితో ప్రారంభమవుతుంది. దసరా పండగ రోజుల్లో దుర్గాదేవిని అంటే పార్వతీదేవిని వివిధ రూపాల్లో అలంకరిస్తారు. విజయదశమి వరకూ పదిరోజులపాటు వైభవంగా పూజలు చేస్తారు. దుర్గ అంటే శక్తి స్వరూపిణి. కనకదుర్గను పూజించే ఈ పర్వదినాలు మహిళాశక్తికి సంబంధించి ఒక్కో కోణాన్ని ఆవిష్కరిస్తాయి.

తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో మహిషాసుర మర్దినిని పూజిస్తే దైవసన్నిధి చేరేందుకు ఆ విధానం ఒక్కొక్క సోపానమని భావిస్తారు. ఆధ్యాత్మిక జీవన పరిణామ క్రమానికి ఈ పూజలు బాటలు వేస్తాయి. మొదటిరోజు బాలాత్రిపుర సుందరిగానూ, విజయదశమి రోజున రాజరాజేశ్వరీదేవి అవతారంగానూ పూజిస్తారు. అలాగే ఒక్కో రోజు ఒక్కో రంగు చీరతో అలంకరిస్తారు. ఒక్కో రకం నైవేద్యం సమర్పిస్తారు.

రోజుకో అలంకారం, నైవేద్యం

దసరా మొదటిరోజు నవదుర్గ బాలాత్రిపుర సుందరి అవతారంగా దర్శనమిస్తుంది. బంగారు రంగు చీరతో దుర్గామాతను అలంకరిస్తారు. కట్టె పొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు. రెండో రోజు శ్రీ గాయత్రీదేవి అవతారం. లేత గులాబీ వర్ణం చీరలో అమ్మవారు దర్శనమిస్తుంది. పులిహోరను నైవేద్యం పెడతారు. మూడో రోజు అన్నపూర్ణాదేవి అవతారం. కాషాయరంగు చీరలో అమ్మ కనబడుతుంది. కొబ్బరి అన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. నాలుగోరోజు శ్రీలలితాదేవి అవతారం. అచ్చమైన బంగారు రంగు చీరను పెడతారు. మినప గారెలు నైవేద్యంగా నివేదన చేస్తారు. అయిదో రోజు శ్రీగౌరీదేవి అవతారం. పసుపు గంధం వర్ణం చీరతో అలంకరిస్తారు. దద్దోజనం నైవేద్యంగా సమర్పిస్తారు. ఆరో రోజు శ్రీ సరస్వతీదేవి అవతారం. తెలుపు చీరను కడతారు. కేసరిని నైవేద్యంగా సమర్పిస్తారు. ఏడవ రోజు లక్ష్మీదేవిగా అలంకరిస్తారు. బంగారు రంగు చీరను సమర్పించి, అల్లం గారెలు నైవేద్యమిస్తారు. ఎనిమిదవ రోజు దుర్గాదేవి అలంకారం. ఎరుపు రంగు చీర కట్టి శాఖాన్నం సమర్పిస్తారు. ఈ రోజును దుర్గాష్టమి అంటారు. తొమ్మిదవ రోజు అమ్మవారు మహిషాసుర మర్దనిగా కనబడుతుంది. గోధుమ రంగు చీర కడతారు. చక్కెర పొంగలిని నివేదిస్తారు. ఈ రోజును మహర్ణవమి అంటారు. పదవ రోజు విజయ దశమి. అమ్మవారికి రాజరాజేశ్వరీదేవి అలంకారం చేస్తారు. ఆకుపచ్చ చీరను ధరింప చేస్తారు. పరమాన్నం నైవేద్యంగా సమర్పిస్తారు.

దసరా పర్వదినాల్లో స్త్రీలు చాలా నిష్టగా అమ్మవారి పూజలు చేస్తారు. ఈ పండగ రోజుల్లో మహిళలు ప్రతి రోజూ లలితా సహస్ర నామాలు, ఖడ్గమాల, మహిషాసుర మర్దిని స్తోత్రం మొదలైనవి అత్యంత భక్తిప్రపత్తులతో పఠిస్తారు.

– వి. మధుసూదనరావు

# యూరియా కోసం యుద్ధాలు

ఎన్ ఎస్ ఆర్

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో యూరియా కోసం యుద్ధాలు జరుగతున్న నేపథ్యంలో యూరియా గురించి కొంత తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

( యూరియా ) చరిత్ర:

1828లో జర్మన్ శాస్త్రవేత్త ఫ్రెడ్రిక్ వోలర్ యూరియాను కృత్రిమంగా తయారు చేయడం రసాయన శాస్త్ర చరిత్రలో ఒక కీలకమైన మలుపు. అంతకుముందు సేంద్రీయ పదార్థాలు కేవలం జీవుల నుండి మాత్రమే వస్తాయని భావించేవారు. ఈ ఆవిష్కరణ ఆ నమ్మకాన్ని చెరిపేసింది. ప్రపంచ యుద్ధాల సమయంలో యూరియాను పేలుడు పదార్థాల తయారీలో ఉపయోగించారు. అయితే, 1950ల తర్వాత భారీ స్థాయిలో ఉత్పత్తి సాధ్యం కావడంతో ఇది వ్యవసాయ రంగంలో నైట్రోజన్ ఎరువుగా విస్తృతంగా వాడుకలోకి వచ్చింది.

మన దేశంలో 1960లలో హరిత విప్లవం సమయం నుండి యూరియా - రైతుల జీవితంలో అంతర్భాగమైంది. అప్పటివరకు ప్రధానంగా పశువుల ఎరువులపై ఆధారపడి, తక్కువ దిగుబడి ఉన్న వ్యవసాయానికి ఇది ఒక కొత్త ఊపునిచ్చింది. ప్రారంభంలో ఎక్కువగా అమెరికా, జర్మనీ నుండి దిగుమతి చేసుకున్నారు. స్వదేశీయంగా యూరియా ఉత్పత్తి సింద్రీ ఫర్టిలైజర్ ఫ్యాక్టరీ (జార్ఖండ్) వంటి ప్లాంట్లలో 1960-70లలో ప్రారంభించారు.

హరిత విప్లవంలో ఎరువుల వాడకం

హరిత విప్లవం వ్యవసాయ దిగుబడులను గణనీయంగా పెంచింది, దీనికి ముఖ్య కారణం రసాయన ఎరువుల వాడకం. ముఖ్యంగా:

* నైట్రోజన్ ఎరువులు: యూరియా, అమ్మోనియం సల్ఫేట్, CAN
* ఫాస్ఫరస్ ఎరువులు: సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ (SSP), డీ-అమ్మోనియం ఫాస్ఫేట్ (DAP)
* పొటాషియం ఎరువులు: మ్యురియేట్ ఆఫ్ పొటాష్ (MOP)

ఈ ఎరువులు పంట దిగుబడులను అసాధారణంగా పెంచాయి, కానీ అదే సమయంలో, పురుగుమందుల అధిక వినియోగంతో పtopfans

, ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి.

యూరియాలో మొక్కలకు అత్యంత ముఖ్యమైన పోషకమైన నైట్రోజన్ 46% ఉంటుంది. ఇది మొక్కల పెరుగుదలకు, ఆకుపచ్చని రంగుకు, కిరణజన్య సంయోగ క్రియకు అవసరం.

భారతదేశంలో యూరియా వినియోగం

భారతదేశం ప్రపంచంలోనే యూరియా అతిపెద్ద వినియోగదారుల్లో ఒకటి. ప్రతి సంవత్సరం సుమారు 3.5–3.6 కోట్ల టన్నుల యూరియాను రైతులు వాడుతున్నారు. ఇది దేశంలోని మొత్తం ఎరువుల వినియోగంలో 55% పైగా ఉంటుంది. ముఖ్యంగా వరి, గోధుమ, చెరకు వంటి పంటలకు దీని వాడకం చాలా ఎక్కువ.

ధర మరియు సబ్సిడీ: రైతుకు ఒక రక్షణ కవచం

ప్రభుత్వం యూరియాపై భారీగా సబ్సిడీ ఇస్తుంది. ఒక 45 కిలోల బస్తా అసలు ధర ₹2,000 పైగా ఉన్నప్పటికీ, రైతుకు అది కేవలం ₹266కి మాత్రమే లభిస్తుంది. ఈ సబ్సిడీని భరించడానికి ప్రభుత్వం ఏటా ₹1.5–2 లక్షల కోట్లు ఖర్చు చేస్తుంది. ఇది రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది, కానీ దీనివల్ల యూరియా అధిక వినియోగం కూడా జరుగుతోంది.

2024 ఏప్రిల్ నుండి 2025 సెప్టెంబర్ వరకు భారతదేశం ఒమాన్, రష్యా నుండి యూరియా దిగుమతులపై సుమారు ₹15,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

అధిక వినియోగం వల్ల సమస్యలు

అధిక యూరియా వాడకం వల్ల అనేక పర్యావరణ మరియు ఆర్థిక సమస్యలు తలెత్తుతున్నాయి:

* నేల సారం తగ్గిపోవడం: రసాయన ఎరువుల అధిక వాడకం నేలలోని సూక్ష్మజీవులను, సేంద్రీయ పదార్థాన్ని నాశనం చేస్తుంది.

* భూగర్భ జలాల కాలుష్యం: యూరియాలోని నైట్రేట్లు నీటిలో కరిగి భూగర్భ జలాలను కలుషితం చేస్తాయి, ముఖ్యంగా పిల్లలలో ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి.
* వాతావరణ మార్పులు: యూరియా నుండి వెలువడే నైట్రస్ ఆక్సైడ్ గ్లోబల్ వార్మింగ్‌కు కారణమయ్యే ఒక గ్రీన్ హౌస్ వాయువు.

యూరియాకు ప్రత్యామ్నాయాలు: పర్యావరణహిత పరిష్కారాలు

యూరియాపై ఆధారపడటాన్ని తగ్గించడానికి , నేల సారాన్ని కాపాడటానికి అనేక ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి:

1. నానో యూరియా: IFFCO అభివృద్ధి చేసిన ఈ ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా 500ml బాటిల్‌తో ఒక 45 కిలోల యూరియా బస్తాకు ప్రత్యామ్నాయం. దీన్ని పిచికారీ రూపంలో పంట ఆకులపై చల్లితే, మొక్కలు నేరుగా పోషకాలను గ్రహిస్తాయి, దీనివల్ల వృథా తగ్గుతుంది మరియు పర్యావరణానికి హాని తక్కువగా ఉంటుంది.
2. జీవ ఎరువులు (Organic Fertilizers): పశువుల ఎరువులు, కంపోస్ట్, వర్మీ కంపోస్ట్ వంటివి భూమిలో సూక్ష్మజీవుల క్రియాశీలతను పెంచి, సహజంగా నైట్రోజన్‌ను అందిస్తాయి.
3. బయోఫెర్టిలైజర్లు: అజోటోబాక్టర్, రైజోబియం, అజోస్పిరిల్లం వంటి సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని నేలలో స్థిరపరుస్తాయి, తద్వారా రసాయన ఎరువుల అవసరం తగ్గుతుంది.
4. పంటల మార్పిడి (Crop Rotation): పప్పు పంటలను (కంది, పెసర, మినుములు) ఇతర పంటలతో మార్చి వేయడం వల్ల వాటి వేళ్ళలో ఉండే రైజోబియం బ్యాక్టీరియా నేలలో నత్రజనిని పెంచుతుంది.
5. ఇంటిగ్రేటెడ్ న్యూట్రియెంట్ మేనేజ్‌మెంట్ (INM): రసాయన, జీవ , బయోఫెర్టిలైజర్లను సమతుల్యంగా వాడటం ద్వారా దీర్ఘకాలికంగా భూమి సారం నిలుస్తుంది.

రైతులు యూరియా వాడకాన్ని తగ్గిస్తే తక్కువ ఖర్చుతోనే మెరుగైన ఫలితాలు పొందవచ్చు:

* ఎరువు ఖర్చు తగ్గింపు: యూరియా బస్తాల సంఖ్య తగ్గుతుంది. ప్రస్తుతం వాడే యూరియాలో చాలా భాగం గాలిలోకి లేదా నీటిలోకి పోతుంది.ఇది వృథా ఖర్చు.
* సమతుల్య ఎరువుల వాడకం: నానో యూరియా వంటి ప్రత్యామ్నాయాలను వాడితే తక్కువ మొత్తంలోనే పంటకు అవసరమైన పోషకాలు లభిస్తాయి.
* భూమి సారం కాపాడడం: ప్రత్యామ్నాయాల వల్ల నేల సారం నిలిచి, భవిష్యత్తులో యూరియా కొనాల్సిన అవసరం తగ్గుతుంది.
* పురుగుమందుల ఖర్చు తగ్గింపు: అధిక యూరియా వాడకం వల్ల పంటలు బలహీనపడి, పురుగులకు ఎక్కువగా గురవుతాయి. సమతుల్య పోషణతో పంటలు ఆరోగ్యంగా ఉంటాయి, తద్వారా పురుగుమందుల ఖర్చు తగ్గుతుంది.
* పంట దిగుబడి పెరుగుదల: సరైన పోషకాలు అందడం వల్ల పంటలు ఆరోగ్యంగా పెరిగి, అధిక దిగుబడిని ఇస్తాయి, రైతుకు అదనపు ఆదాయం లభిస్తుంది.

భవిష్యత్ వ్యవసాయం వైపు అడుగులు

యూరియా భారతీయ వ్యవసాయానికి ఒక బలమైన మద్దతుగా ఉన్నప్పటికీ, దాని అధిక వినియోగం భూమి, నీరు , రైతు ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ సమస్యలను అధిగమించడానికి:

* నానో యూరియా, జీవ ఎరువులు, బయోఫెర్టిలైజర్ల వాడకాన్ని ప్రోత్సహించాలి.
* సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి.
* యూరియా లాంటి రసాయన ఎరువులు వాడకుండా పండించిన పంటలకు ప్రత్యేక మద్దతు ధర ఇచ్చి ప్రకృతి వ్యవసాయం చేసే వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలి.
* గో ఆధారిత వ్యవసాయం పై ప్రభుత్వం అవగాహన పెంచాలి

ఈ చర్యల ద్వారా రైతుల పెట్టుబడి ఖర్చు తగ్గి, పంట దిగుబడి పెరిగి, మన పర్యావరణం,ఆరోగ్యం కూడా రక్షించబడుతుంది.

# ప్రేమ పరిణయం

సుందరవల్లి శ్రీదేవి

ప్రేమ పరిణయం రెండిటికి అవినాభావ సంబంధం ఉందని చెప్పాలి. అలా లేకపోతే వివాహ వ్యవస్థ నిర్వీర్యం అవుతుంది. ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం అంటే నేటివరకు కూడా ప్రేమ వివాహాలు, ప్రేమ వైఫల్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఉషా పరిణయం, సుభద్రార్జునీయం, రుక్మిణి కళ్యాణం, ఉత్తరాభి మన్యుల వివాహం ఇవి పురాణాలలో ప్రేమ వివాహాలను సూచిస్తున్నాయి. స్వయంవరాలు గాంధర్వ వివాహాలు ఆకాలంలో కూడా జరుగుతూ ఉండేవి.

ఇక మధ్యకాలంలో పెద్దలు కుదిర్చిన వివాహాలు ప్రాముఖ్యత పొందాయి. కుల పట్టింపుల వలన పెద్దల ఆమోదము లభించక ఎందరో యువతీ యువకులు ప్రేమ పట్ల వైఫల్యాన్ని పొందారు. ఎన్నో జంటలు విడిపోవడం జరిగింది. లైలా మజ్ను ,దేవదాసు పార్వతి వంటి జంటలు ప్రేమించినా వివాహం చేసుకోలేక విఫలము అయ్యారని చరిత్ర సూచిస్తోంది.

నేటి ఆధునిక యుగంలో కుల పట్టింపులు సడలిపోయినందువల్ల ప్రేమ వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి కానీ కొన్ని విఫలమవుతున్నాయి కూడ. ప్రేమ వివాహం మంచిదా పెద్దలు కుదిర్చిన వివాహం మంచిదా అని ఆలోచిస్తే రెండు కూడా ప్రేమ అనే పునాది పై నిర్మించబడితేనే నిలబడతాయి. ప్రేమించి పరిణయం ఆడినా, పరిణయం ఆడి ప్రేమించుకున్న ఆ ఇద్దరి మధ్య ప్రేమబంధం లేకపోతే ఆ జంట వైవాహిక ప్రయాణంలో ముందుకు సాగలేరు. విడాకులకు దారి తీయడం జరుగుతుంది.



పెద్దలు కుదిర్చిన వివాహాలలో ఇరుకుటుంబాలు ఒకరినొకరు పరిచయం చేసుకుని ఆర్థికంగా సంప్రదాయంగా వారికి అనుకూలంగా ఉండి జాతకరీత్యా వధూవరుల మనోభావాలను పరిశీలించి వారి మధ్య సఖ్యత ఏర్పడుతుంది అని నమ్మిన తర్వాతనే వివాహం చేసేవారు. వధూవరులు ఇరువురి మధ్య స్నేహము ప్రేమగా మారి కొన్ని అభిప్రాయభేదాలు ఉన్నపటికి అర్థం చేసుకుంటూ, సరిపెట్టుకుంటూ వైవాహిక జీవితం సాగిపోయేది. కలకాలం ఆ జంట సుఖంగానే ఉండేవారు కారణం వారిమధ్య ప్రేమభావం ఒకరితప్పులుఒకరు మన్నించుకునేంత దృఢంగా ఉండేది.

ఇక ఇప్పటి ప్రేమ వివాహాలు

పరిశీలిస్తే తల్లిదండ్రులు సమాజము ఆమోదించినా సఫలం కావడంలేదు. అంటే అన్నీప్రేమవివాహాలు అని కాదు కానీ కొన్ని విఫలం చెందుతున్నాయి. ఏందువలన? ఏ జంటకయినా వారి మధ్య స్నేహం ఏర్పడి కొన్ని రోజులు కొనసాగిన తర్వాతనే ప్రేమగా పరిణతి చెందుతుంది. జాతక పొంతనాలు, కుటుంబాల సంప్ర దాయాల పరిశీలనకు ప్రాధాన్యత ఉండడం లేదు .అయినప్పటికీ కొన్ని ప్రేమ వివాహాలు చేసుకున్న జంటలు విడిపోతున్నారు. ఎందుకని అంటే వయసులో ఉన్న ఆకర్షకణను ప్రేమగా భ్రమించినందుకా లేక స్వార్థపూరిత మైన ఆలోచనలతో ప్రేమ నటించి వివాహాలు చేసుకుంటున్నందుకా? లేక ఒకరిపై ఒకరికి పూర్తి అవగాహన లేక భిన్నమైన అభిరుచులను అభిప్రాయాలను గౌరవించుకుని సర్దుకు పోవడంఅనే మనస్తత్వం లేనందువలన? ఏ కారణాల వలన అయినా ఈ తరం వారి కొన్ని ప్రేమవివాహాలు విఫలమయి విడాకులకు దారి తీస్తున్నాయి.

కానీ వారిమధ్య ప్రేమ నిజమయినదైతే నే ఇరువురు అభిప్రాయభేదాలు ఏర్పడినప్పుడు సహనంతో ప్రేమ అనే బంధమువలన సర్దుకుని జీవితం సాగిస్తారు .నిజానికి అదే అసలైన ప్రేమ. ఆ ప్రేమ పరిణయం తప్పకుండ సఫలమై వారి వైవాహిక జీవితం ఆదర్శవంతంగా సాగుతుంది. మరి పెద్దల కుదిర్చిన వివాహాలు అన్నీ సఫలమేనా అంటే కాదనే చెప్పాలి. వారి జీవితాలలో ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలు, గృహ హింసలు ఉన్నపటికీ సమాజానికి భయపడి మరియు స్త్రీకి ఆర్థిక స్వతంత్రము లేనందు వలన దుర్భరమైన జీవితం గడిపేవారు. ఇది ఒకవిధంగా చాలా బాధాకరం. అందు వలన పెద్దలు కుదిర్చిన వివాహాలు కూడా కొన్ని సఫలం కాలేదని చెప్పాలి. నేటి సమాజంలో యువతీ పురుషునితో సమానంగా విద్యను అభ్యసించి అన్నీ రంగాలలో ఉద్యోగం చేస్తూ ఆర్థికస్వతంత్రము పొంది ఉన్నం దున దుర్భర జీవితాల కు స్వస్తి పలికింది. ఇరువురి మధ్య సఖ్యత ఉంటేనే ఆ వైవాహిక జీవితం సవ్యంగా కొనసాగే పరిస్థితి ఏర్పడింది. ఇది శుభ పరిణామము అయినప్పటికీ చిన్న చిన్న విషయాలను ఇరువురు కూడా అవగాహన చేసుకోనందున విడాకులకు దారి తీయటం జరుగుతోంది. ప్రేమ స్వార్థపూరితమై యువతీ యువకులు సహజీవనం చేస్తూ సంప్రదాయ వైవాహిక జీవితం భ్రష్టు పట్టించడం శోచనీయం. ఎవరికి వారు కడు స్వతంత్రులుగా భావించడం వలన ఈ పరిణామం ఏర్పడింది.

ఆ విధంగా కాకుండా నిజమైన ప్రేమ బంధం యువతీయువకుల మధ్య ఏర్పడితే ఆ వివాహం ప్రేమ వివాహమైనా, పెద్దలు కుదిర్చిన వివాహమైనా సఫలమై సుఖవంతమైన వైవాహిక జీవితం కొనసాగించగలరు. యువతీ యువకులు ఇద్దరూ కూడా దీనికి బాధ్యులే. నేటి ఆధునిక యుగంలో ఆకర్షణను ప్రేమగా భ్రమపడి పరిణయం ఆడి మోసపోకుండా అసలయిన ప్రేమను గుర్తించి వివాహమాడమని నేటి యువతరానికి నా ఈ రచన ఒక సలహాగా స్వీకరించ వలసిందిగా కోరుతున్నాను.

ప్రేమ ఒక అద్భుతమైన పవిత్రభావన

-- Love is a divine quality”

# కాశీమజిలీ కథలు



డా. మాదిరాజు బ్రహ్మానంద రావు

కాశీమజిలీ కథలు -నాల్గవ భాగం

పండు కథ (మూడవభాగం తరువాయి)_

చాదస్తులైన వారు పన్నెండు గంటల దాకా పూజాదికాలతోనే సరిపుచ్చారు. ఇంతలో ఆ గృహిణి భర్త వచ్చి ఇంటి నాలుగు గదులను వెదకి ఒక గదిలో ధ్యానముద్రలో ఉన్న ఈ ఐదుగురుని చూచి భార్యను అనుమానించి వీరి గదితో పాటు బార్య ఉన్న గదికి తాళం వేసి రాజుకు ఫిర్యాదు చేయటానికై వెళ్లాడు. " నీ భార్య పతివ్రత యని నేను విన్నాను. ఆమెననుమానింప వద్ద"ని రాజెంత చెప్పినా ఆ గృహస్థు వినలేదు. రాజాతనితో గృహస్థునింటికి వచ్చాడు. రాజు గదిని తెరిపించి ధ్యానముద్రలోనున్న ఐదుగురిని చూచి 'మీరెవ్వ'రని అడగ్గా శుద్ధమతి తాను భార్యననుమానించి దేశాంతరానికి రావటం మొదలైన తన కథనంతా పూసగ్రుచ్చినట్లు రాజుకు చెప్పాడు. తన పురోహితుడు , శుద్ధమతులిద్దరు-వారి భార్యలందు దోషం లేకపోయినా భార్యలనను మానించిన మూర్ఖులని నిశ్చయించి రాజు వారికి గుణపాఠాన్ని చెప్పాలనుకున్నాడు.

రాజు గృహిణి గది తెరిపించి ఆమె పరమ పతివ్రతగా గుర్తించి ఆమె పాదాలపైబడి "అమ్మా! నీనుండి కొన్ని విషయాలు తెలుసుకోవాలను కుంటున్నాను. నీవాయ్యెదురిని పరదేశులు, మార్గస్థులు, బాటసారులు మూర్ఖులు కాదన్నావు. ఇంతకూ వారెవరని అడిగాడు. అపుడామె పరదేశులనగా భాషాభేదం గలవారికే చెల్లుతుంది కాని ఒకే భాష మాట్లాడే వారికి చెల్లదు. మార్గస్థులంటే మనకన్న ముందు మార్గంలో ఉన్నఅన్నోదకాలకే చెల్లుతుంది కాని వారికి కాదు. బాటసారులంటే ఎల్లప్పుడు నడిచే సూర్యచంద్రులకే చెల్లుతుంది కాని వారికి కాదు. వెఱ్ఱిమూఢులు విద్వాంసులైన వారు కాదు. నా భర్త, మీరు శుద్ధవెఱ్ఱి మూఢులు. ఎందుకంటే మధ్యాహ్నం ఐదుగురు విటులతో కల్సి ఉన్నదని చెప్పిన నాభర్త -దాన్ని నమ్మి ఇక్కడకు వచ్చిన మీరు పరమ మూర్ఖులని నిర్భయంగా చెప్పింది. రాజు నిజాన్ని గ్రహించి తన పౌరాణికుని మందలించాడు. శుద్ధమతి ఎందుకు దేశాలు పట్టి వచ్చాడో తెలుసుకున్న ఆతని శిష్యులు గురుపత్ని పాతివ్రత్యాన్ని గూర్చి చెప్పారు. శుద్ధమతిని కూడా రాజు మందలించాడు. అతడు మహా పండితుడని గుర్తించిన రాజు తన పట్టణంలోనే ఆతనికో యిల్లు కట్టించి -ఆతని భార్యను రప్పించి అందు కాపురముంచాడు.

కొంతకాలానికి శుద్ధమతి తనకు సంతానం కలుగనందుకు విచారించాడు. భార్యనొప్పించి శ్రీశైలానికి వెళ్లి అక్కడతడు ఆరు నెలలపాటు పాతాళగంగా తీరంలో నరసింహబిలంలో తపస్సు చేసాడు. ఒకరోజు శివుడు కలలో కనిపించి " ఓయీ బ్రాహ్మణుడా! నీవు సగం భక్తితో నన్నారాధించావు. నీవు రేపు రేవులో స్నానం చేసి వచ్చేటపుడు వచ్చే దారిలో ఒక మామిడిపండు లభిస్తుంది. దాన్ని నీవు తీసుకొని నేలపై పెట్టకుండా ఇంటికి తీసుకొని వెళ్లు. నీభార్యకిస్తే ఉత్తమ సంతానం కలుగుతుంది. మధ్యలో ఏ అంతరాయం కలగకుండా చూసుకో" అని చెప్పి అంతర్ధా-

(24 వ పేజీ చూడండి)

# క్రాంతివీరుడు
# (పండిత్ శ్యామ్ జీ కృష్ణవర్మ)



తుమ్మూరి రాంమోహన్ రావు

లండన్ వేల్స్ నగరాలలో
కోర్టులలో వాదనలకు
న్యాయవాదులను పిలుతురు
సత్రపు కమిటీ సభ్యులు

శ్యామకృష్ణవర్మ అచట
ఉండి వృత్తి సాగిస్తూ
తీరిక వేళల స్పెన్సర్
రచనలు చదువుట మొదలిడె

నాటి కాలమున హెర్బర్ట్
స్పెన్సరు యను మహాశయుడు
హేతువాదమును ప్రవేశ
పెట్టిన ఘన తార్కికుండు

ఆ రచనల ప్రేరణతో
ఆరంభించెను భారత
దేశ దాస్య విమోచనకు
కార్యాచరణమునాతడు

శ్యాముని ప్రతిపాదనలను
వివిధ దేశముల యందలి
మేధావులు, సంస్కరణ
వాదులు విని తలయొగ్గిరి

అచిరకాలముననె వర్మ
హైగేటుకు సమీపాన
సకల వసతులు కలిగిన
ఖరీదైన గృహము కొనెను

హెర్బర్ట్ స్పెన్సర్ నాడొక
సామాజిక తత్త్వవేత్త
సామాజిక డార్వినిజం
ఆతని మేధామథనం

స్పెన్సర్ రచనల కెంతో
ఉత్తేజితుడాయె వర్మ
ఆతనియెడ గురుభావము
పెంచుకొనెను శ్యామకృష్ణ

స్పెన్సర్ అంతిమ క్రియలకు
హాజరైన సమయమందు
 వేయి పౌండ్ల విరాళమును
ఆక్స్ ఫర్డ్ వారికిచ్చె

స్పెన్సర్ పేరిట గోష్ఠులు
జరిపించుటకనియు జెప్పె
స్పెన్సర్ పై యభిమానము
నా విధముగ తెలియ జెప్పె

మరుసటి సంవత్సరమే
భారతీయ విద్యార్థుల
కొరకై స్పెన్సరు పేరిట
ఫెల్లోషిప్ ప్రకటించెను

ఆక్స్ ఫర్డు నందు చదువు
భారతీయ విద్యార్థుల
ఖర్చులకై రెండు వేల
పౌండ్లు ఖర్చు చేయదలచె

అటులనే దయానందుని
అస్తమయానంతరమ్ము
అతని పేర ప్రకటించెను
అదనముగా మరి నాలుగు

ఏమి వితరణము అయ్యది
ఎంత దొడ్డ మనసయ్యది
తన సంపాదనయంతయు
పరుల కిచ్చు గుణమన్నది

అంతటితో ఆగిందా
శ్యామకృష్ణ సౌజన్యం
తన గృహమును విద్యార్థుల
విడిది చేయుటౌదార్యం

తాను కొన్న ఇంటిపేరు
భారతీయ గృహము
భారతీయ విద్యార్థుల
కది వసతి గృహము

పందొమ్మిది వందల ఐ
దవ సంవత్సరమునందు
శ్యామ్ జీ తనదృష్టిని
రాజకీయమందు నిలిపె

భారత స్వాతంత్ర్య సమర
శంఖమ్మును ఊదినాడు
బ్రిటను గడ్డమీదినుండి
బిగ్గరగా ఉరిమినాడు

విదేశాలలో నుండిన
వ్యాపారుల నుద్యోగుల
చదువు కొరకు ఏతెంచెడి
భారతీయ విద్యార్థుల

నొక్క తాటిపై తెచ్చే
యత్నములను మొదలు బెట్టి
ప్రతి వారిని సంప్రదించి
పట్టుదలను నూరిపోసె

భారతాన బ్రిటిష్ ప్రభుత
నెదిరించే స్ఫూర్తికొరకు
ఇండ్యన్ సోష్యాలజిస్టు
ఆంగ్ల పత్రికను దీసెను

మనదేశం మన సంస్కృతి
మన శాస్త్రం మన ధర్మం
రాజకీయ సామాజిక మత
ప్రయుక్త చైతన్యం

భారతీయ సామాజిక
శాస్త్రవేత్త యను పత్రిక
భారతీయ తత్త్వ చింత
నాత్మక భావపు చిత్రిక

లండను నుండే తీసెను
ఆ పత్రిక నతి ధృతితో
ప్రతి మాసము పత్రికలను
చదివించెను పలువురితో

ఆ పత్రిక ప్రజలలోన
చైతన్యము కలిగించెను
ఎందరినో స్వాతంత్ర్యపు
సమరముకై నడిపించెను

మేధావుల తలపులలో
సంచలనము మొదలయ్యెను

ఒకరొకరుగ కార్యరంగ
మందు దిగుట షురువయ్యెను

తానున్నది బ్రిటను గడ్డ
పురికొల్పెను పురిటి గడ్డ
అతడు గదా నిక్కమైన
భరతమాత ముద్దు బిడ్డ

ఎంత సాహసం కావలె
శత్రుసీమలో నిలబడి
మాతృదేశ స్వాతంత్ర్యపు
ఉద్యమానికై ఉరవడి

తనుధనమాన ప్రాణము
లన్నింటిని ధారవోయ
దీక్షాకంకణ ధారణ
దేశభక్తికుదాహరణ

పేరెన్నిక గన్నవారు
దేశమందు ఉన్నవారు
కలరెందరొ వినని వారు
శ్యామ కృష్ణవర్మ పేరు

అంతటితో ఆగలేదు
అకలంకుడు కృష్ణవర్మ
హోంరూలు సొసైటీని
స్థాపించుట విహితకర్మ

ఫిబ్రవరి పద్దెనిమిది
పందొమ్మిది వందలైదు
స్వపరిపాలనా సంఘము
ప్రారంభోత్సవ మాయెను

హై గేటున భారతీయ
సదనాన సమావేశము
స్వపరిపాలనాసంఘము
లక్ష్యాలను వెలయించెను

భరతావని స్వపరిపాల
నమును సాధ్యపరచుకొనుట
ఇంగ్లాండున దీని కొరకు
తగుయత్నములను జేయుట

స్వాతంత్ర్యపు లక్ష్యాలను
భారత ప్రజలందరిలో
వ్యాపింపగ జేసి జాతి
నేకత్రితముగ జేయుట

వర్మకు తోడుగ నుండిరి
అచట భికాజీ కామా
దాదాభాయి నౌరోజీ
మరియును ఎస్సార్ రాణా

భారతీయ విద్యార్థుల
ఆలన పాలనకొరకై
తన ఇంటిని భారతీయ
సదనముగా మార్చె నతడు

ఇంగ్లండుకు వచ్చిన ప్రతి
భారతీయ సోదరులకు
ఆ గృహమొక వసతి గృహము
అది ఒక ఉద్యమ శిబిరము

## అయిదవ కొమ్మ

బ్రిటనులోన ఉండి బ్రిటిషు
ప్రభుత్వమును ఎదిరించుట
ఏలినవారికి గిట్టక
నిర్బంధము తలపెట్టిరి

రానున్న ప్రమాదమ్మును
ముందుగ ఊహించి వర్మ
యకాయకిని రహస్యముగ
ప్యారిస్ నగరము చేరెను

ఫ్రెంచి ప్రభుత్వము శ్యాముకు
రక్షణమును కల్పించెను
అచటనుండి కొంత తడవు
పోరాటము సాగించెను

అటనుండియె సావర్కార్
మరణ శిక్ష కూడదనియె
తనవంతుగ ఎన్నో విధ
మలుగ జాతి నుద్ధరించె

ఫ్రెంచి దేశమున పలువురు
మిత్రులతనికుండు కతన
ఏ ఆటంకములులేక
ఏడేండ్లచ్చటనుండెను

ఇంతలోన ఏదో ఒక
రాజకీయ ఒప్పందము
నిమిత్తమై ఫ్రెంచివారు
ఐదవ జార్జును పిలచిరి

ఇది తెలిసిన వెనువెంటనె
మిత్రుల ఇబ్బందినెరిగి
స్విట్జర్లండ్దేశములో
జెనీవాకు తరలి వెళ్లె

తొలి ప్రపంచ సంగ్రామము
అపుడే మొదలగుట జేసి
అటునిటు ఎటు కదలలేక
స్తబ్ధతలో నుండిపోయె

అతనికి తోడుగ నుండెను
డాక్టర్ బ్రేస్ అనునాతడు
ప్రో ఇండియన్ జెనీవా
కమిటీకతడధ్యక్షుడు

కానీ చిత్రము అతడొక
గూఢచారి యని తెలిసెను
బ్రిటిషు వారు తెలియకుండ
నియమించారని తెలిసెను

తుదిశ్వాసను అచ్చోచటనె
విడచినాడు కృష్ణవర్మ
చివరి ఘడియ వచ్చు వరకు
పోరాడెను శ్యామ కృష్ణ
అతని ధర్మపత్ని భాను
మతి యతనితొ విదేశాన
ఏబదేండ్ల పాటు గడిపె
ఆతని తోడుగ నీడగ

ఆంగ్ల భాష నభ్యసించె
ఫ్రెంచ్ భాష నేర్చుకొనెను
శ్యామ్ కడకు వచ్చు వారి
తో చక్కగ మాటాడును

భర్తకు తోడుగ నామెయు
ఇల్లు విడచి బంధుగులను
అందరినీ వదలిపెట్టి
ఆతనితో సేవచేసె

ఏమి ధర్మదాంపత్యం
ఎంతటిదా అన్యోన్యం
ఇరువురు తమసంపదలను
ధారవోయుటెంత ఘనం

శ్యామకృష్ణ పొత్తములను
గ్రంథాలయములకు ఇచ్చె
వేలసొమ్ము విరాళాల
రూపమ్మున పంచి ఇచ్చె

అతని పిదప మూడేండ్లకు
భానుమతియు కన్ను మూసె

భర్తకు తగు ఇల్లాలను
పలువురిచే ప్రశంస గొనె

పందొమ్మిదివందల ము
ప్పయ్యవ సంవత్సరమున
మార్చి ముప్పయొకటి నాడు
శ్యామకృష్ణ కనులుమూయ

పందొమ్మిది వందల ము
ప్పైమూడు అగస్టు నెలలో
ఇరువదిరెండున ఆతని
సతీమణిసు కనులుమూసె

ఎంత గొప్పనైన దేశ
భక్తుడు పండిత్ శ్యాజీ
జనులెరుగని గుప్త దేశ
భక్తుడు మన వర్మాజీ

శ్యామ్ జీ కృష్ణవర్మ
మరణ వార్త కొందరికే
అతి సన్నిహితులగువారికి
తెలియవచ్చె తంతివార్త

వారిరువురి చితాభస్మ
కలశాలట జెనీవాలో
భద్ర పరచబడియున్నవి
ఏడు దశాబ్దాలపాటు

భారత దేశానికి స్వా
తంత్ర్యం రాకున్న యెడల
తన చితి బూడిద నీయగ
రాదని స్విస్ వారి కోరె

స్వాతంత్ర్యం సిద్ధించిన
ఏబదైదు వత్సరాల
పిదప దంపతుల చితి బూ

డిదకై విన్నపము వెడలె

మోదీ గుజరాతు రాష్ట్ర
ముఖ్యమంత్రి హోదాలో
ఆ పవిత్ర చితాభస్మ
కలశాలను కొనివచ్చెను

శ్యామ్ జీ కృష్ణవర్మ
స్మారకభవనము కచ్ లో
మాండ్వీ పట్టణమున
నెలకొల్పెను మోదీజీ

చరిత్రకెక్కని ఇలాంటి
చరితార్థులు ఎందరో
దేశమాత దాస్య విమో
చన కర్తలు ఎందరో

బడుగు జాతిలో పుట్టియు
సంస్కృత పండితుడాయెను
దేశములో లేకున్నను
దేశ స్వేచ్ఛకై పోరెను

తన తెలివిని ధారపోసె
తన ధనమును ఖర్చుచేసె
తన సుఖాలు మరచిపోయి
దేశమాతకై తపించె

ధన్యచరితుడైన క్రాంతి
వీరుడు మన శ్యాముడు
వలస భారతీయ దేశ
వాసులకాదర్శుడు

ఏదేశముకేగినా
ఎచ్చట కాలిడినా
భరతజాతి ఖ్యాతి పొగడ
మన్న రాయప్రోలు మాట

అక్షరాల పాటించిన
అకలంకుడు శ్యామ్ జీ
కృష్ణవర్మ చరిత స్ఫూర్తి
దాయకమగు ఎనర్జీ

శ్యామ్ జీ కృష్ణ వర్మ
కంకితముగ రక్తితో
గేయమాలికలను మెడను
వేయుచుంటి భక్తితో

~సమాప్తం~

# కాశీమజిలీ కథలు

(20 వ పేజీ తరువాయి)

నమయ్యాడు.
శుద్ధమతి శివుడు చెప్పిన ప్రకారం పండు తీసుకొని ఇంటికి బయలు దేరాడు. దారిలో జాము ప్రొద్దెక్కగా ఆపండునొక చెట్టు తొఱ్ఱలో నిరికించి స్నానం చేయసాగాడు. ఇంతలో ఆ చెట్టుపైనున్న గరుడ పక్షి ఆపండును తన ముక్కు, గోళ్ల సందున నిరికించు యెగిరి పోయింది. శుద్ధమతి తన దురదృష్టానికి చింతిస్తూ ఇల్లు చేరి జీవితాంతం సంతానం కోసం విచారిస్తూనే ఉన్నాడు.
గరుడపక్షి ఆపండును తీసుకొని వెళుతున్నపుడు ముక్కునుండి జారిపోయింది. దైవవశాన అది కాశ్మీర రాజు కూర్చున్న బల్లపై పడింది. ఆ పండునే రాజు-మంత్రి-పురోహితుడు-వర్తకుడు-కళాదులు పంచుకొని తమతమ భార్యలద్వారా పుత్ర సంతానాన్ని పొందారు. ఇందులో రాజపుత్రుని పేరు వసంతుడు. మంత్రికుమారుని పేరు రాముడు. పురోహితుని కుమారుని పేరు ప్రవరుడు. వర్తకుని కుమారుని పేరు సాంబుడు. కళాదుని కుమారుని పేరు దండుడు. వీరి పేర్ల లోని మొదటి అక్షరాలు కలుపగా వ-ర-ప్ర-సా-దులౌతారు. వీరి కథే వరప్రసాదుల కథ. ఓ గోపా! పండు కథ జాగ్రత్తగా విన్నావు కదా! తరువాతి మజిలీలో ఈ వ-ర-ప్ర-సా-దుల కథ చెపుతాను.

# షడ్దర్శనాలు

కీ. శే. వేమూరి నరసింహమూర్తి & వేమూరి వేంకటేశ్వరరావు



వేమూరి వేంకటేశ్వరరావు

గత సంచిక తరువాయి)

అనంతమైన భగవత్స్వరూపాన్ని వర్ణించి చెప్పడానికి పరిమితమైన కొలబద్దలు చాలవు. చెట్టు, పుట్ట, బల్ల, పుస్తకము, ..., ఇవేవీ దేవుడు కాదు. నశించే ఇలాంటి వస్తుజాలాన్ని తీసి పారెయ్యగా మిగిలేది బ్రహ్మము. అన్నీ తీసివేయగా మిగిలేది "లేకపోవుట" అనే స్థితి. అనగా "బ్రహ్మ పదార్థం" అనేది లేదన్నమాట? ఇది సరి అయిన వాదం కాదు. అన్నీ తీసివేయగా ఏమీ మిగలకపోలేదు; "ఏమీ లేదు" అన్న జ్ఞానం మిగిలింది!

ప్రమాణం అంటే జ్ఞానమును సంపాదించే సాధనము కాబట్టి అభావము కూడా ఒక ప్రమాణమే అన్నారు కుమారిలభట్టు. అనగా, అభావ ప్రమాణము చేత బ్రహ్మమును గ్రహించగలుగుతున్నాం అన్నమాట. కానీ ఈ తర్కంలో ఒక చిక్కు ఉంది. మతం గురించి ప్రవచనాలు చెప్పడం సామాన్య ప్రజలకోసం కనుక , స్పష్టంగా ఎదురుగా కనిపిస్తూన్న ప్రపంచం అబద్ధం అంటే ప్రజలు నమ్మలేరు కనుక, ప్రపంచాన్ని అబద్ధం అనకుండా, తననూ, ప్రపంచాన్నీ అధిగమించే నిత్య సత్యం, ఐహిక దుఃఖాలని అధిగమించే ఉన్నత స్థితి ఉన్నదని ఋజువు చెయ్యాలి. ఇలాంటి చిక్కు పరిస్థితులలో శంకరాచార్యులు రంగంలోకి దిగేరు.

## 7. అద్వైతం

శంకరాచార్యులు ( ~సా. శ. 800) అన్నది ఇది: ప్రపంచం లేకపోలేదు. స్పష్టంగా కనిపిస్తూంది. అద్వైతులు ప్రమాణంగా తీసుకుని చెప్పే "బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అన్న వాక్యానికి అర్థం జగత్తు లేదని కాదు. ఈ జగత్తు భగవానుడి నుండి వేరు కాదనే సత్యాన్ని తెలుసుకోలేని మాయలో మనమున్నామని. జీవాత్మ, పదార్థం, పరమాత్మ అని ఇన్ని లేవు. ఉన్నది ఒకే ఒక్కటి. అదే పరబ్రహ్మం. ఈ జగత్తు భగవానుడి నుండి వేరు కాదనే సత్యాన్ని తెలుసుకోలేని మాయలో మనమున్నామని అంటారు శంకరులు. ఇదివరకు చీకట్లో చూసిన పాము నశించిపోయి అక్కడ తాడు పుట్టలేదు. ఇదివరకు ఉన్నదీ, ఇప్పుడు ఉన్నదీ తాడే! అప్పుడు అజ్ఞానం చేత పాము అనుకున్నాము. ఇప్పుడు తాడు అనుకుంటున్నాము.

అనగా, నిజమైన బ్రహ్మపదార్థమందు మన అజ్ఞానము చేత ప్రపంచాన్ని ఆరోపిస్తున్నామన్నమాట. అయితే నిత్యమైన బ్రహ్మము అనిత్యమైన జగత్తుగా మనకి కనిపించడానికి కారకులు ఎవ్వరు? దీనికి నిమిత్త కారకులు ఎవ్వరూ లేరు. బ్రహ్మము ఉపాదాన కారణం మాత్రమే. అవిద్య అనే మాయ చేత ఈ ప్రపంచం పరిపరి విధాలుగా మనకి కనిపిస్తోంది.

అయితే అద్వైతాన్ని ఎలా నిరూపణ చెయ్యడం? జగత్తు లేని స్థితిలో మిగిలినది బ్రహ్మము అని చెప్పేరు కదా దార్శనికులు. ఏమీ మిగలలేదనే భావం నాకు స్ఫురిస్తూంది కదా! కనుక నేను మిగిలినట్లే కదా! ఈ రెండు వాక్యాలూ జోడిస్తే "నేనే బ్రహ్మము" అని ఋజువవటం లేదూ? ఈ బ్రహ్మమనే స్థితికీ, మిగిలిన దార్శనికుల ధ్యేయానికీ చాలా తేడా ఉంది. నైయాయకుల అపవర్గమూ, బౌద్ధుల నిర్యాణమూ బాధలు లేని అభావ స్థితులు మాత్రమే! అనగా అవి negative states. అద్వైత సిద్ధి పొందిన బ్రహ్మమే స్థితియో? అది జ్ఞాననాదమయమైన తురీయ స్థితి! అదే మోక్షం. ఇక రామానుజాచార్యులు విశిష్టాద్వైతం ప్రకారం ఆత్మ ఎప్పటికీ పరమాత్మలో ఐక్యమైపోదు. కాకపోతే విముక్తి పొందిన ఆత్మ భగవంతుని సాన్నిధ్యాన్ని మాత్రం పొందగలదు. మరలా మరలా

శరీరాన్ని ధరించవలసిన అవసరం దానికి లేదు. అదే మోక్షమంటే. ఇలాంటి ఆత్మలు అనేకంగా ఉంటాయి. అంటే ఈ సిద్ధాంతం ప్రకారం జీవాత్మ, పదార్థం అనేవి రెండూ, పరమాత్మ ఆధారంగా మనుగడ సాగించేవే కానీ, పరమాత్మలో కలసిపోయేవి మాత్రం కావు. ఇక్కడ పదార్థం అంటే జడమైనది, చైతన్యం లేనటువంటిది అని అర్థం చేసుకోవాలి. అలాగే పరమాత్మను చేరుకున్న ఆత్మలన్నీ సర్వవ్యాపకత్వం, సృజనశక్తి అనే రెండు లక్షణాలను తప్ప, భగవంతుని మిగిలిన లక్షణాలన్నింటినీ కలిగి ఉంటాయి. రామానుజాచార్యులు అద్వైతాన్ని పూర్తిగా కొట్టిపారెయ్యలేదు. కాకపోతే అద్వైతంలో అనేకత్వం ఉండడానికి వీలుందన్న విశేషాన్ని చేర్చారు. అందువల్లనే ఆ సిద్ధాంతానికి విశిష్టాద్వైతమనే పేరు వచ్చింది. ముక్తి పొందడానికి అద్వైతం జ్ఞానమార్గాన్ని ప్రధానంగా చెబితే, త్రికరణశుద్ధికలిగిన భక్తి మార్గాన్ని విశిష్టాద్వైతం చెబుతుంది.

ఇక మధ్వాచార్యులు ప్రబోధించిన ద్వైతంలోకి వద్దాం. ద్వైతం అన్న మాటను బట్టి చూస్తేనే, ఇది అద్వైతానికి పూర్తి వ్యతిరేకమయినదని తెలుస్తోంది. ద్వైతం ప్రకారం పంచ భేదాలున్నాయి: (క) జీవాత్మా, పరమాత్మ ఒకటి కాదు. (చ) ఒక జీవాత్మకు వేరొక జీవాత్మకూ మధ్య భేదం ఉంది. (ట) జీవాత్మ, పదార్థం కూడా వేరు వేరు. (త) పరమాత్మ, పదార్థం కూడా విభిన్నమైనవే. (ప) పదార్థంలో ఉన్న ఒక భాగం పదార్థంలోని వేరొక భాగంతో భిన్నంగానే ఉంటుంది. ఇదీ ద్వైత సిద్ధాంత భావన. కాకపోతే ఈ పదార్థం, ఆత్మ, పరమాత్మ ఇవన్నీ వేరువేరే అయినా సర్వాధికారైన విష్ణువుకు మాత్రం లోబడే ఉంటాయి. నియమబద్ధమైన జీవితం ద్వారా జ్ఞానాన్ని సంపాదించి, భగవంతుని తత్త్వాన్ని తెలుసుకోగలగడమే ముక్తికి మార్గం అని ద్వైతం ప్రబోధిస్తుంది.

శంకరాచార్యులు తన మాయావాదం, నిర్గుణ బ్రహ్మ భావనల కారణంగా "ప్రచ్ఛన్న బౌద్ధుడు" (Crypto-Buddhist) అని విమర్శించబడ్డాడు. ఈ విమర్శలు భాస్కరాచార్యులు, రామానుజాచార్యులు, మరియు మధ్వాచార్యులు చేశారు. వీరు శంకరుల సిద్ధాంతం బౌద్ధ దర్శనంలోని శూన్యవాదంతో సామ్యత కలిగి ఉందని వాదించారు.

సనాతన భారతీయ ధర్మం భగవంతుని చేరడానికి ఇది మాత్రమే మార్గం అని నిర్దేశించదు. భక్తి, జ్ఞాన, కర్మ, ధ్యాన మార్గాలు నాలుగింటిలో ఏదైనా అనుసరించ వచ్చు.

సమాప్తం

---

## శుభాకాంక్షలు

(14 వ పేజీ తరువాయి)

అలాగే, మన యీ పత్రిక web సంచికలో, భారతీయ వ్యోమగామి అయిన శ్రీ శుభాన్షు శుక్లా గారు మన "చైతన్య సంకల్ప బలం" పత్రికతో, ఆయన యొక్క అంతరిక్ష అనుభవాలను కూడా పంచుకోవడానికి మన ముందుకు రావడం మన పత్రికకు యెంతో వన్నె తెచ్చిన విషయంగా భావిస్తున్నాను.

సినీ ప్రపంచ ప్రముఖ గేయ రచయిత, శ్రీ భువన చంద్ర గారి భావ ప్రపంచం అతి విశాలమైనది. వారి సేవలను కూడా మన పత్రిక అందుకున్న విషయాన్ని కూడా శ్రీమతి శాంతి గారు నాతో పంచుకున్నారు. వంట యింటికే పరిమితమైపోయిన స్త్రీల సృజనాత్మకతను బయటకు తీసి వారి వునికిని సమాజానికి అందించడంలో యీ పత్రిక యెంతో వుపయోగబడుచున్నది అని కూడా శాంతి గారు నాతో చెప్పారు. దానికి నిదర్శనం నేనే అనిపించింది.

మనందరికీ యీ సదవకాశనిచ్చి ప్రోత్సహిస్తున్న శ్రీమతి శాంతి గారికీ, పదవీ విరమణానంతరం ఆమెకు పూర్తి చేయూతనిస్తోన్న ఆమె శ్రీవారికీ, మరియూ నవ యవ్వన "చైతన్య సంకల్ప బలం" పత్రికకూ నా నిండు మనస్సుతో ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ, అభినందిస్తూ, .... ~మీ వేంకట రమ సోమయాజుల.

# వ్యక్తిత్వ వికాసంలో మాతృభాష పాత్ర



మానవ జీవితానికి ఒక ప్రయోజనం ఉంది. ఆ ప్రయోజనాన్ని సాధించే క్రమంలో మన నడక Conceptual Understanding నుండి Existential Understanding వైపు సాగుతుంది.

ఈ ప్రపంచంలో ఏ ఒక్కరు కూడా ఒంటరిగా బ్రతకలేరు. మరొకరితో ఏదో ఒక సంబంధాన్ని కలిగి యుండాలి. ఆ క్రమంలో పరస్పరం భావాలను పంచుకోవడం వల్ల సంబంధాలు పటిష్టమవుతాయి. ఒక Presence ను మరొక Presence తో అనుసంధానించేది భాష. Learning starts from womb అంటారు. తల్లి గర్భంలో ఉన్నప్పుడు తల్లితో ఏ భాషలో తన భావాలను శిశువు పంచుకుంటాడో అదే తన మాతృభాషగా చెప్పుకుంటాము. అందుకే మాతృభాషను తల్లిగా చెపుతుంటారు. మాతృభాష అమృతం లాంటిది. అది క్లిష్ట సమయంలో మనకు ఓదార్పులాగా పనిచేస్తుంది. మనకు పరిచయం లేని భాష లేదా పరిసరాల వల్ల మనము ఎదుటివారిని అర్థం చేసుకునే అవకాశం ఉండదు అలాగే మనలను ఎదుటివారు అర్థం చేసుకోలేరు. ఆ వాతావరణం మనలో అలజడిని సృష్టిస్తుంది. భావనలు పంచుకునేందుకు, ఆలోచనలకు ఆకారం ఇచ్చేందుకు, ఆవేదనలను వ్యక్తీకరించేందుకు, నైపుణ్యాలను నేర్చుకునేందుకు, నైపుణ్యాలను ప్రదర్శించేందుకు మాతృభాషను మించిన ఉపకరణం మరొకటి లేదనేది ప్రపంచ వ్యాప్తంగా నిపుణులు చెపుతున్న మాట. నిజానికి మాతృభాష మనకు ఒక గుర్తింపుగా పనిచేస్తుంది. అందుకే 21 ఫిబ్రవరిని యునెస్కో వారు మాతృభాషా దినోత్సవంగా ప్రకటించారు.



ఇక Personality Development లేదా వ్యక్తిత్వ వికాసం అంటే ఏమిటి? ఇందులో నిజానికి వ్యక్తిత్వం వేరు వ్యక్తిత్వ వికసన వేరు. ఎదురైన సన్నివేశానికి మనం స్పందించే విధానం వ్యక్తిత్వం కాగా వ్యక్తి యొక్క అంతర్గత, బహిర్గత నడతలలో సకారాత్మక మార్పును తీసుకొచ్చేందుకు, ఆ వైఖరిని ఉద్దీపింప చేసుకునే విధానం వ్యక్తిత్వ వికాసం. ప్రతి వ్యక్తికీ తనదంటూ ప్రత్యేకమైన వ్యక్తిత్వం అంతర్గతంగా ఆవిష్కృతమై ఉంటుంది. ఆ వ్యక్తిత్వం వ్యక్తి పురోగతికి, సమాజ శ్రేయస్సుకు ఉపయుక్తమయ్యే విధంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంటుంది. దానిని మన భావవ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంపొందింప చేయడం, మనలో ఆత్మ విశ్వాసం పెరిగేలా శిక్షణ నివ్వడం, మనను మనం సమాజంలో ఆవిష్కరించు-

కునేందుకు సహకరించడం, నడతలో నడకలో పలుకు తీరులో, ఇతరులను అర్థం చేసు-కోవడంలో, సకారాత్మక వైఖరిని తనదిగా చేసుకోవడంలో సహ-కరించడం అవసరమౌతుంది. ఈ విధానాన్నే వ్యక్తిత్వ వికసన, విస్తరణ, వ్యాప్తి అనే విభాగాలు-గా లేదా స్థాయిలుగా చెప్పుకుం-టాము. దీనినే జాత్యంతరీకరణ అంటాము. జాతి అంటే స్థాయి, అంతరీకరణ అంటే ఉన్నతీకరిం-చుకోవడం. వ్యక్తి వ్యక్తిత్వం అవ-సరానికి తగిన రీతిలో మారడం వికసన, వ్యక్తిత్వం పరిణతి చెంది పరివర్తన చెందడం విస్తరణ కాగా జాగృత వ్యక్తిత్వ పరిణతి శా-శ్వతమయి అన్ని సమయ సం-దర్భాలలో సహజ స్వభావంగా నిలవడం వ్యాప్తంగా చెప్పుకుం-టాము. వికసన వల్ల పరిస్థితుల-కు ఎలా స్పందించాలో అవగా-హన చేసుకుంటాము. విస్తరణ వల్ల మన పరిమితులను చెరిపి వేసుకోగలుగుతాము. వ్యాప్తం చే-సుకోవడం వల్ల సమాజంతో అప-రిమితంగా మమేకం కాగలుగు-తాము.

వ్యక్తి ప్రవర్తన ఒంటరిగా ఒక విధంగా ఉంటుంది అతడే సమాజంలో మరొక విధంగా ప్రవ-ర్తిస్తాడు. తన ప్రవర్తన ఉన్నతంగా ఉన్నట్లుగా నటిస్తాడు... ఉదాహ-రణకు... తెనాలి రామకృష్ణ కథ... రాజుగారు ఆరోగ్యంగా, అభ్యు-దయపథంలో నిండునూరేండ్లు జీవించాలని అన్నాడనుకోండి... కాదని ఎవరైనా అనగలరా?

# NEP 2020 : PRIMARY EDUCATION IN MOTHER TONGUE

వ్యక్తిత్వ వికసన వల్ల ప్రయోజ-నం ఏమిటి? వ్యక్తిత్వ వికసన వల్ల జీవన విధానంలో పరిణతి కలిగి భౌతిక, మానసిక, సామాజిక, భావోద్వేగ జీవన పార్శ్వాలలో మనదంటూ ఒక ప్రత్యేకత పొం-దగలుగుతాము. ఆ ప్రత్యేకత వల్ల మన స్థాయి ఉన్నతీకరించ బడుతుంది. ఆ ఉన్నతి వల్ల గుర్తింపు వస్తుంది. ఆ గుర్తింపు వల్ల కలిగిన ఆత్మ విశ్వాసం వల్ల అసాధ్యాలనుకున్న లక్ష్యాలను ఛేదించే సన్నద్ధత మనలో ఆవి-ష్కృతమౌతుంది. దార్శనికత పె-రుగుతుంది. అంతర్గత దృష్టికో-ణం నుండి చూచే అలవాటు మన ప్రకృతిగా, నైజంగా మారుతుంది. దానితో మూలాలను అన్వేషిం-చగలుగుతాము.... సమస్యలకు భయపడి పారిపోకుండా ఎలాంటి సమస్యకైనా సకారాత్మక వైఖరితో పరిష్కారాన్ని కనుగొనడం జరు-గుతుంది. ఉన్నతీకరించబడిన వ్యక్తిత్వ వికసన సమస్యలను ఆహ్వానిస్తుంది.. పరిష్కార మార్గా-లను అన్వేషిస్తుంది.

హార్వర్డ్ యూనివర్సిటీలో జరిగిన ఒక స్టడీ ప్రకారం మానవ సంబంధాలకు అధిక ప్రాధా-న్యత ఇచ్చిన వ్యక్తులు జీవితంలో సమగ్రతను సాధించగలిగారు... జీవితంలో సంపూర్ణమైన ఆనం-దాన్ని అనుభవించారు. తోటివా-రికి ఆనందాన్ని పంచగలిగారు. ఇది ఎలా సాధ్యపడింది అంటే వ్యక్తిత్వ వికసన వల్ల సాధ్యపడిం-ది.

అయితే ఈ వ్యక్తిత్వ వికస-నకు ప్రేరణ ఏమిటి? అంటే ని-ర్ద్వంద్వంగా అది నేను సాధించ-గలననే ఆత్మ విశ్వాసం మరియు నేను సాధించాలనే అంతర్గత తపనయే... దానికి సాధనం? సాధనం మాతృభాష మాత్రమే అని ఎన్నో నివేదనా పత్రాలు చెపు-తున్నాయి.... ఎందుకు? అని ప్రశ్న వేసుకుంటే.....

శిశువుతో మొదటగా తల్లి తన భావోద్వేగాలను పం-చుకున్న భాషలో చెప్పడం వల్ల భావనలు, నైపుణ్యాలు నేర్చుకోవ-డం శిశువుకు అలవాటవుతుంది. తదుపరి అది సులువవుతుం-ది. సకారాత్మక ఆలోచనా స్థితిని పొందడం భావోద్వేగాలను సమ-న్వయం చేసుకోవడం, నియం-త్రణ చేసుకోవడానికి మాతృభాష సహకరిస్తుంది. తను గర్భంలో ఉండగా అందించబడిన భాషలో శిశువు ఆలోచనలు స్థిరత్వాన్ని

పొంది.... మానసిక అనుభూతిని పొందే స్థితిలో, భావ వ్యక్తీకరణ స్థాయిలో పరిణతి చెందడం సాధ్యమౌతుంది. అలా కాని నాడు తనలో కలవరపాటుతో కూడిన సంక్షుభితమైన మానసిక స్థితి కలుగుతుంది.

మాతృభాషలో వ్యక్తిత్వ పరిణతికి శిక్షణ నివ్వడం వల్ల భావ ప్రకటన నైపుణ్యం లేదా Communication Skills పెరుగుతాయి. Presentation Skillsలో పరిణతి వస్తుంది, Problem Solving Skills ఆవిష్కృత మౌతాయి, Decision Making Skills విస్తృతమౌతాయి, Management Skills వెలుగు చూస్తాయి, Leadership Qualities ప్రభావితమౌతాయి .

2008 లో యునెస్కో వెలువరించిన అభిప్రాయం ప్రకారం... 50 నుండి 75 మిలియన్ల పిల్లలు పాఠశాలలకు దూరంగా ఉండిపోయారట. దానికి కారణం వారి మాతృభాషలో వారికి బోధన అందకపోవడమేనని తెలిసింది.

కెనడియన్ల రీసెర్చ్ ప్రకారం... ఏ పరిస్థితిలో నైనా మాతృభాషను కాక మరొక భాషను నేర్వవలసి వచ్చినా ఎన్ని సంవత్సరాల తర్వాత అయినా మన మెదడు మాతృభాషకు స్పందిస్తుందని తెలుస్తుంది.

వ్యక్తిత్వ వికసనలో మాతృభాష పాత్ర నిర్మాణాత్మకమైనది మాత్రమే కాదు అప్పుడప్పుడు ఇది నష్టాన్ని కూడా చేస్తుంది. ఆ మాతృభాష కలిగిన వ్యక్తుల సమూహంలో మరొక భాషను నేర్చుకోనివ్వకపోవడం దీని వల్ల వచ్చే పెద్ద నష్టం. అలాగే అన్యభాషలో వెలుగు చూస్తున్న సాంకేతిక అభ్యున్నతిని అర్థం చేసుకోవడంలో కూడా ఆ భాషాభిమానులు వెనుకపడే ప్రమాదం ఉన్నది.

వ్యక్తిత్వ వికసన వ్యాప్తం కావాలి అంటే మనం చూచే దృష్టికోణం మారాలి. ఉదాహరణకు....

సీసాలో సగం నీళ్ళున్నాయని అంటాడు Optimist. సీసా సగం ఖాళీగా ఉందని బాధ పడతాడు Pessimist. కాగా visionary సగం నీటితో నిండి ఉన్నది సగం గాలితో ఉన్నదని భావిస్తాడు. అతడు Hidden opportunities ను చూస్తాడు. Impossible లో possibility చూస్తాడు.

నిజానికి Half filled with water represents the contributions made and work already done and half filled with air represents unutilised, unexplored opportunities and potential for more and higher success...

వ్యక్తిత్వ పరిణతిలో.... సమగ్రతను సాధించేందుకు జీవితాన్ని నాలుగు పార్శ్వాల నుండి అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఒకటి... వ్యక్తిలో తెలివితేటలు ఏ విధానంలో ఉన్నాయి. రెండవది... భావోద్వేగాల పరిణతి ఎలా ఉన్నది... మూడవది... ఆలోచనా విధానం ఎలాంటిది అలాగే నాలుగవది ఆధ్యాత్మిక భావన ఎలాంటిది... ఆధ్యాత్మికత అంటే దేవుడు పూజలు కావు. జీవిత ప్రయోజనం ఏమిటో అర్థం చేసుకొని సమగ్రమైన సంతృప్తికరమైన జీవితాన్ని ఆస్వాదించడం.

ఈ విధానంలో సన్నద్ధత కలిగిన జిజ్ఞాసువైన సాధకుడు కావాలి.. ఉన్నతమైన ఉత్ప్రేరకం కావాలి.... ఒక ఉద్దీపనా సాధనం కావాలి. వీటన్నిటికీ ఒక వేదిక కావాలి.

మహాభారతంలో కురుక్షేత్ర సంగ్రామ భూమి వేదికగా మారింది. కృష్ణుడు ఉత్ప్రేరకంగా అర్జునునిలో వ్యక్తిత్వ వ్యాప్తికి మార్గం చూపిన Path Maker గా కనిపిస్తాడు... సాధనంగా భగవద్గీత ఆవిష్కృతమయింది... ఆ మార్గంలో నడిచేందుకు అర్జునుడు Path Walker గా సన్నద్ధుడయిన విధం కనిపిస్తుంది...

Path Maker and Path Walker ఇరువురూ ముఖ్యమే...

Path Maker without Path Walker is Useless

Path Walker without Path Maker is Aimless

Path Maker and Path Walker together are useful and Focused

Togetherness always creates a change..... Be a creator of Change rather than being creatures in Change...

All the Best

# బ్రహ్మఖండం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలలో స్కాంద పురాణం ఒకటి. ఎనభైఎనిమిది వేల ఒక వంద శ్లోకములతో కూడిన ఈ పురాణం పురాణాలలోకెల్లా అతి పెద్దది.

ఈ పురాణం మహేశ్వర, వైష్ణవ, బ్రహ్మ, కాశీ, అవంత్య, నగర మరియు ప్రభాస అనే ఏడు (7) ఖండాలుగా విభజింపబడింది. అందులో మూడవ భాగమైన 'బ్రహ్మ ఖండం' మూడు ఉపఖండాలుగా విభజింపబడింది.

ఇదివరలో మన చైతన్యం సంకల్పబలం పత్రికా పాఠకులకు 'కాశీ ఖండం' అందించిన ప్రముఖ రచయిత శ్రీ పోచనపెద్ది వేంకట మురళీకృష్ణ గారు ఇప్పుడు 'బ్రహ్మఖండం' సమర్పిస్తున్నారు.

పాఠకులు ఈ పురాణ పఠన సదవకాశాన్ని వినియోగించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

24వ అధ్యాయం

శివ తీర్థం.

చక్రతీర్థాన్ని సేవించిన తరువాత శివతీర్థంలో స్నానం చేయాలి. ఇక్కడ స్నానం చేయడం వలన మహా పాతకాలు నశిస్తాయి.

పూర్వం బ్రహ్మకు, విష్ణువునకు వివాదం జరిగింది. నేనే జగత్తును సృష్టించాను అని బ్రహ్మ అంటే నేనే జగత్కర్త అని విష్ణువు వాదించుకుంటున్నారు. ఆ సమయంలో వేదాలు అక్కడకు వచ్చి, ఈ జగత్తు సృష్టిచబడడానికి మీరు ఇద్దరు కర్తలు కారు. ఈశ్వరుడు జగత్కర్త. ఈ స్థావర జంగమాలన్ని ఆయనే సృష్టించారు. దేవతలందరు శివుని ఆరాధించాలి. ఆయనే సృష్టి,స్థితి, లయ కారకుడు. సత్య లక్షణం కలవాడు" అని చెప్పాయి. "ఎప్పుడు పార్వతితో ఉండే పరమేశ్వరుడు సర్వసంగ వివర్జితుడైన పరబ్రహ్మ ఎలా

అవుతాడు?" అని బ్రహ్మ విష్ణువు అడిగారు. ఓంకారము రూపాన్ని పొంది అక్కడకు వచ్చింది. "పార్వతి, పరమేశ్వరులు ఒకప్పుడు విడిగా ఉండి లీలలు చూపిస్తారు. శివుడు స్వయం ప్రకాశకుడు, నిరంజనుడు, విశ్వాధికుడు, ఉమాదేవి శక్తి స్వరూపిణి. ఆమె పరమేశ్వరుని నుండి విడిగా ఉండదు. శంభునికి ఆనందాన్ని కలిగిస్తుంది. రుద్రునితో సమానమైన వారు లేరు. మీలో ఉన్న మోహాన్ని విడిచి పెట్టండి" అని ఓంకారం చెప్పింది.ఇంతలో వారికి ఆకాశం అంతా నిండిన కాంతి కనబడింది. ఆ కాంతిని చూడడానికి బ్రహ్మ ఐదవ ముఖాన్ని సృష్టిం చాడు. ఆ ముఖం బడబాగ్నిలా వెలిగి పోతోంది. "పరమేశ్వరా! నీవు నా కుమారుడివి. నా ముఖం నుండి నీవు ఆవిర్భవించావు" అని బ్రహ్మ గర్వంగా పలికాడు.




మహేశ్వరుడు కోపంతో కాలభైరవుని బ్రహ్మ గర్వాన్ని అణచడానికి పంపించాడు. కాలభైరవుడు బ్రహ్మతో యుద్ధానికి వచ్చాడు. ఆయన చేతిలో కత్తి, గదా ఉన్నాయి.,బ్రహ్మ తన ఐదవ ముఖంతో కాల భైరవుని చూసాడు. కాలభైరవుడు ఐదవ ముఖాన్ని ఖండించాడు.బ్రహ్మ మరణించాడు. శంకరుని కృపతో బ్రహ్మ తిరిగి బ్రతికాడు. పార్వతీ పరమేశ్వరులను చూసి," ఓ పరమేశ్వరా! నన్ను అనుగ్రహించు. నా అపకారాన్ని క్షమించు. నా గర్వాన్ని క్షమించు" అని ప్రార్థించాడు.

పరమేశ్వరుడు శాంతించాడు. కాలభైరవుని పిలిచి "బ్రహ్మ ఈ జగత్తుకు పూజ్యుడు.సనాతనుడు. బ్రహ్మ కపాలంతో బిక్షాటన చేస్తూ జీవించు. బ్రహ్మ హత్యా దోషం పోవడానికి అన్ని తీర్థాలలో స్నానంచేయి. ముందు వారణాశి వెళ్లు. అక్కడ మూడు వంతుల బ్రహ్మహత్యా పాపం పోతుంది. మిగిన ఒక వంతు పాపం పోవడానికి గంధమాదన పర్వతం మీద శివ తీర్థాన్ని ఏర్పాటు చేసాను. అక్కడ స్నానం చేయి" అని చెప్పి పరమేశ్వరుడు అంతర్ధానమయ్యాడు.

శివుని ఆజ్ఞను అనుసరించి కాలభైరవుడు బ్రహ్మ కపాలాన్ని చేత ధరించి యక్షాది లోకాలన్ని తిరిగి, వారణాశిలో స్నానం చేసాడు. మూడువంతులు బ్రహ్మ హత్యా దోషం పోయింది. తరువాత గంధమాదన పర్వతానికి వెళ్ళి శివతీర్థంలో స్నానం చేసాడు. బ్రహ్మహత్యా దోషం పోయింది. శివుడు ప్రత్యక్షమై "భైరవా! ఈ కపాలాన్ని కాశిలో ఎక్కడో అక్కడ ప్రతిష్ఠించు. ఆ ప్రదేశాన్ని కపాల తీర్థం అని పిలుస్తారు" అని చెప్పి అంతర్ధానమయ్యాడు. కాలభైరవుడు బ్రహ్మ కపాలాన్ని తీసుకొని కాశిలో ప్రతిష్ఠించాడు. ఆ ప్రదేశమే కపాల తీర్థము.

శివ తీర్థము పుణ్యప్రదమైనది, మహా పాతక నాశిని" అని సూతుడు చెప్పాడు.

స్కాంద పురాణంలోని బ్రహ్మ ఖండంలోని సేతు మహాత్మ్యంలో శివ తీర్థం అను ఇరవై నాలుగవ అధ్యాయం సమాప్తం.

# జ్ఞాపకాల దొంతరలో

ఎలక్ట్రాన్



(గత సంచిక తరువాయి)

1971 డిసెంబర్ ఒకటో తారీఖున మా ఆర్మీ స్నేహితులు అరుగురూ చెప్పాపెట్టకుండా వచ్చేశారు. అప్పటికప్పుడు ఉప్మాచేసి పెట్టగా తిని, "పరిస్థితులు బాగో లేవు. పాకిస్తాన్ కయ్యానికి కాలు దువ్వుతోంది. మీరు కుటుంబాలను పంపివేయడం మంచిది. యుద్ధం తప్పనిసరి అని తెలుస్తోంది. మళ్ళీ ఎప్పుడు కలుస్తామో అని మిమ్మల్ని చూసి పోదామని వచ్చాం," అని నమస్కారాలు చేసి వెళ్ళి పోయారు. డిసెంబర్ 2వ తారీఖు సాయంత్రం ఆ అరుగురులోనే ఒకరైన సత్యనారాయణ ల్యాండ్ మైన్ బాంబులను సరిహద్దు ప్రాంతంలో అమరిక చేస్తున్న సమయంలో, పొరపాటున ఒక ల్యాండ్ మైన్ మీద కాలు జారిపడి ప్రాణాలు విడిచాడు. అదే ఆరుగురిలో ఉన్న డాక్టర్ సుధాకర్ సత్యనారాయణకి తానే పోస్ట్ మార్టం చేయాల్సి వచ్చిందని వాపోయాడు

యింటి యజమాని తన విశాలమైన ప్రాంగణంలో తన కుటుంబ సభ్యులకోసము, మా యిద్దరి కుటుంబ సభ్యులకోసమూ రెండు ట్రెంచ్ లు త్రవ్వించాడు.

డిసెంబర్ 3వ తారీఖు ఉదయం ఏడు గంటలకి బాంబుల ప్రేలుళ్ళు వినబడ్డాయి. ఎయిర్ రైడ్ సైరన్లు హోరెత్తించాయి. పరుగున పోయి ట్రెంచ్ ల్లో కూర్చున్నాం. జమ్మూ ఆకాశంలో యుద్ధవిమానాల తరుములాట కనబడింది. పావు గంటలో మళ్ళీ నిశ్శబ్దం. అయితే బాంబుల ప్రేలుడు శబ్దాలు వినవస్తూనే ఉన్నాయి.

పాకిస్తాన్ లోని సియాల్కోట, భారత్ లోని జమ్మూ సరిహద్దుకు 22 కిలోమీటర్ల సమదూరంలో ఉన్నాయి. దేశవిభజన సమయంలో పాకిస్తానీయులు చేసిన కిరాతక చర్యల్ని గురించి యజమాని కుటుంబ సభ్యులు కబుర్లలో చెప్తూనే ఉండేవారు.

ఆ మధ్యాహ్నం రమణమూర్తి రిగ్ స్థావరానికి వెళ్లిపోయాడు. రిగ్ రష్యన్ సాంకేతిక సిబ్బందిలో ఇద్దరు ఇస్లామీయులు వెంటనే తమల్ని రష్యా పంపించేయమని గోలగోల పెట్టేశారు. మా సంస్థ యజమాన్యం రష్యన్ బృందాన్ని వారి కుటుంబాలనూ వెంటనే ఢిల్లీ టాక్సీలలో పంపించేయమని, తర్వాత వారిని తాము రష్యా పంపించేస్తామని ఉత్తర్వులు జారీ చేసింది. రష్యన్ సాంకేతిక బృందనాయకుడు మట్టుకు


ససేమిరా కదలనన్నాడు. ఆరు-వేలమీటర్ల బావిని త్రవ్వడం ఒక సవాలు. ఆ సవాలుని వదిలి వెళ్లిపోవడం తనకిష్టం లేదని మొరాయించాడు. కేంద్రానికి ఈ సంగతి చెప్పి మిగిలిన వారిని ఢిల్లీ పంపించేశాం.

మా రిగ్ 24 గంటలూ పని-చేస్తుంది. రాత్రి రిగ్ ప్రాంతా-న్ని బ్లాక్ అవుట్ చెయ్యాలా అని ఆర్మీని సలహా అడగడం జరిగింది. "మీ రిగ్ కొండలమ-ధ్య లోయలో ఉంది. దేశంలోంచి మన చండీగర్ విమాన స్థావరం-నుంచి పాకిస్తాన్ వైపు దాడుల-కోసం వెళ్ళే విమానాలకి మీ రిగ్ పగలూ, రాత్రీ కుడా ఒక ల్యాండ్ మార్కు. మీ ఆపరేషన్లు కొనసాగి-స్తోనే ఉండండి. లోయలో రిగ్ పై ఆకసంలోంచి బాంబ్ వెయ్యడం అంత సులువు కాదు. కానైతే కొండల మధ్యనుంచి తీవ్రవాదు-లు రిగ్ ని అటాక్ చేసే అవకాశం లేకపోలేదు. అందుచేత నిఘాపె-ట్టి జాగ్రత్తగా ఉండండి. అందుకు మా ఆర్మీకూడా సహాయంగా ఉంటుంది." అన్నారు.

అప్పటి వాయుసేనలో మిగ్-16, సుఖాయ్-7 విమాన స్థావరాలు జలందర్, చండీఘర్లలో ఉండేవి. ఆ విమానాలు అక్కణ్ణుంచి బయలుదేరి జమ్ము కాశ్మీర్ సరి-హద్దుల్ని పహారా చేస్తుండేవి. జమ్మూ మధ్యగా ప్రవహించే తావి నది ( చీనాబ్ నదికి ముఖ్య ఉపన ది) మీది బ్రిడ్జ్ మీద పాకిస్తాన్ బాంబులు వెయ్యడానికి ప్రయ-త్నించింది కానీ అవి వంతెనకు దూరంగా నదిలో పడ్డాయికాని వంతెన మీద పడలేదు. జమ్మూ కొండల్లో ఉన్న బాహు ఫోర్ట్ లోని బావేలి మాత దయ అని స్థాని-కుల నమ్మిక.

రెండు రోజుల్లోనే పాకిస్తాన్ సరి-హద్దులో ఉన్న ఒక్ సన్నపాటి ప్రాంతాన్ని మన ట్యాంక్ ఫోర్స్ ఆక్రమించేసింది. అలాగే రాజా-స్థాన్ వైపు, లాహోర్ వైపు సరిహ-ద్దుల్ని దాటి మన టాంక్ ఫోర్సే పా-కిస్తాన్లోకి బహు దూరం దూసుకు పోయింది. నాలుగో రోజున చికెన్ నెక్ ప్రాంతాన్ని స్వాధీనం చేసు-కొన్న టాంక్ ఫోర్స్ ని జమ్మూ ప్రాంతంలోని చాంబ్ జురియన్ సెక్టార్ వైపు మళ్లించింది. అవి జమ్మూ రహదారి మీదుగానే వె-ళ్లాల్సి ఉంది. మా ఆఫీసు నుంచి ముగ్గురం యాపిల్, కమలా, బు-ట్టల్ని పట్టుకొని రోడ్డు వార నిల్చు-న్నాం ఒక ట్యాంకు మా వద్ద ఆగి,





ఒక ఆర్మీ జవాను వాటిని అందుకొన్నాడు. పక్కనే ట్యాంక్ మీద నిల్చున్న ఓ ఆఫీసర్ 'ఇది పాకిస్తాన్ నుంచి తీసుకు వచ్చిన ఓ గిఫ్ట్' అంటూ మాకు ఒక పుస్తకం అందించాడు. నా సహోద్యోగి అయిన సేఠీ చాలా పొడుగు. అతను ఆ పుస్తకాన్ని అందుకొన్నాడు. ట్యాంక్ ముందుకు కదిలింది. సుమారు 20 ట్యాంకుల బెటాలియన్ ముందుకు కదిలిన తర్వాత ఆ పుస్తకాన్ని తెరిచి చూశాం. అది ఏడవ తరగతి ఇంగ్లీష్ బుక్. అట్టవెనక పాకిస్తానీ జాతీయ గీతం. సేఠీ పంజాబీ. అతనికి ఉర్దూ బాగా తెలుసు. అతను అది పాకిస్తానీ జాతీయగీతమని చెప్పాడు. రెండవ పేజీలో ఆంగ్లంలో "India is our eternal enemy" అని ఉంది. అందరం ముక్కుమీద వేలేసుకొన్నాం. ఆ పుస్తకం మా ఆఫీసులో చక్కర్లు కొట్టింది. పహల్గామ్ టూరిస్ట్ బస్ లో ఆ విద్యార్థి తన ఊరు పాకిస్తాన్లో ఉందని ఎందుకు చెప్పాడో సమాధానం తెలిసింది. చిన్నతనం నుంచి విద్యార్థులకి పాకిస్తాన్ ఉపదేశ మంత్రమది!

యుద్ధం 16 రోజుల్లో ముగిసింది, పాకిస్తాన్ లొంగి పోయింది, బంగ్లాదేశ్ విముక్తి చెందిందిది, 90వేల యుద్ధఖైదీలను భారత్ విడుదల చేసింది. పాకిస్తాన్ లో వేల చదరపు కిలోమీటర్లను స్వాధీనంలోకి తెచ్చుకొన్న ఆక్రమిత ప్రాంతాన్ని భారత్ తిరిగి ఇచ్చేసింది.

అయితే భారత్ కి ఒరిగిందేముంది? పాకిస్తాన్ మన దేశ ప్రగతిని చూసి ఓర్వలేక నాలుగు యుద్ధాలు చేసింది. ఓడింది. ఇప్పుడు పహెల్ గాంవ్ లో దారుణ హింసకాండ చేసి మళ్ళీ మనల్ని యుద్ధానికి కవ్వించింది. సిందూర్ ఆపరేషన్ విజయం ప్రపంచవ్యాప్తంగా తెలిసినా, పాశ్చాత్య దేశాలు అంటీ ముట్టనట్టుగా ఉన్నాయి.

అమెరికన్ జర్నలిస్ట్ ఒఫ్రా విన్ ఫ్రే తన స్పందన చెప్పింది. "మీరు సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన వ్యూహాలు పన్ని, మీ సరిహద్దుల్లోంచే దాడులు చేసి విజయం సాధించారు. సమస్య మీది. పరిష్కారం మీరే చూసుకొన్నారు. అయితే విదేశాలు మీ వెన్నుమీద చరిచి శభాష్ మంచిపని చేశారని అనిపించుకోవడం శుద్ధ అనవసరం!"

ఒక విధంగా నిజమే మరి.

# కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు

ముడుంబై వేంకటాచార్యులు



**కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుడు --11వ భాగం**

దేవాలయాలు సాధారణంగా పండుగ రోజు లలోనూ బ్రహ్మోత్సవాలు జరిపే ఆరోజుల్లో నూ మాత్రమే భక్తుల రద్దీ తో దేవాలయాలు కళ కళ లాడుతూ ఉంటాయి.కొన్ని దేవాలయాలలో భక్తుల రద్దీ ఎప్పుడూ ఉండవచ్చు కాని తిరుమల తిరుపతి తో పోటీ పడలేవు.అని చెప్పవచ్చు .

తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం సంవత్సరం లో అన్ని రోజులూ ఎప్పుడూ వేలాదిమంది భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది. అసలు ఈ స్వామి ఉన్న కొండ ను వైకుంఠం నుండి గరుడుడు తెచ్చి న కొండ గాన గరుడాద్రి అన్నారు .వైకుంఠం నుండి తెచ్చినిన కొండ గాన "వైకుంఠాద్రి" అని కూడా అంటారు.ఇలా అనడానికి మరొక కారణం కూడా ఉంది త్రేతాయుగంలో రామలక్ష్మణులు ఈ కొండ కు వానరులతో సహ కలిసి వచ్చిన ఆధారాలు ఉన్నాయి. శ్రీ రామచంద్రుడు తండ్రి దశరథుని మాట ప్రకారం 14 సంవత్సరాలు అడవి లో గడపడానికి సీతా ,లక్షణులతో కలిసి అడవికి వెళ్ళాడు. అక్కడ శూర్పణఖ , శ్రీ రాముని వివాహం చేసుకోమని కోరింది . నాకు వివాహం అయ్యింది నాభార్య సీతమ్మ అని రామచంద్రుడు అనడంతో. నీభార్య ను మింగేస్తానని శూర్పణఖ సీతా మీదకు రాగా లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసేశాడు.

శూర్పణఖ సీతా, రామచంద్రుల పై పగబట్టి తన అన్న స్త్రీలోలుడు కామంతో ఉండేవాడు గాన తన అన్న రావణుని తో రామచంద్రుని భార్య సీతమ్మ అందాలు వర్ణించి ఆమెను వివాహం చేసుకోమని చెప్పడం తో రావణుడు మారీచుని సహకారం తో సీతమ్మను లంక కు తెచ్చి అశోకవనంలో బంధించి తన కోర్కెను తీర్చమని బ్రతిమాలుతూ బలవంతం చేస్తూ న్నా లొంగని కారణంగా ఆమెను తరచూ భయపెట్టి బెదిరిస్తున్నాడు, నా కోర్కె తీర్చావా నిన్ను " పట్టపు రాణి"నిని చేస్తా లేదా నా చేతిలో చేస్తావు అన్నాడు.

సాధారణంగా ఏ స్త్రీ ఐనా తనకు తానుగా రావణుని అంగీకరించి అతని కోర్కె ఆనందంగా. నెరవేర్చితే తప్పుకాదు. తనపట్ల ఇష్టం లేని స్త్రీ ని బలవంతంగా అనుభవిస్తే రావణుని తల వేయి ముక్కలు అవుతుందని బ్రహ్మ గారి శాపం .అందుకే బ్రతిమాలు తున్నాడు, నెల రోజుల సమయం గడువు ఇచ్చి కాదంటే మరణం ఖాయం అని భయపెడు తున్నాడు.

రాముడు కబంధుని సలహా తో సుగ్రీవుని తో మైత్రీ ఏర్పాటు చేసుకుని వాలిని చంపి .వాలి రాజ్యం సుగ్రీవునకు అప్పగించగా సుగ్రీవుడు సీతమ్మను వెదకుటకు నాలుగు దిక్కుల లా వానరులను పంపారు.అందు దక్షిణ దిక్కుకు హనుమంతుడు వెళ్ళి రావణుని లంక చేరి సీతమ్మ జాడ తెలుసుకుని రామునికి తెలియజేయగా రావణునితో యుద్ధానికి ముందు రాముడు హనుమదాది వానరులతో కలిసి. తిరుమల తిరుపతి కొండకు వచ్చి వానరులను స్వామి పుష్కరిణీ ప్రాంతం లో

ఉంచి రామలక్ష్మణులు హనుమ తో కలిసి ఆకాశగంగ ప్రాంతం లో ఉండే అంజనాదేవి ఆశ్రమం దర్శించి ఆ తల్లి ఆశీస్సులు పొంది తిరిగి స్వామి పుష్కరిణి చెంత నున్న అందరు వానరులను కలిసి స్వామి పుష్కరిణిలో స్నానాదులు ముగించుకుని వరాహ నరసింహ స్వామి వారిని, శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించు కొని, స్వామి పుష్కరిణి చెంత విశ్రాంతి తీసుకున్నారు.

ఆసమయంలో కొందరు వానరులు అటూఇటూ తిరుగుతూ స్వామి పుష్కరిణీ కి ఈశాన్యం వైపు ఒక గుహ కనిపిస్తే అందులో ఏముందో చూడాలని ఒకరితోక ఒకరు పట్టుకుని ఆ చీకటిలో కొంత దూరం నడువగా గొప్ప వెలుగు తో ఒక నగరం కనిపించింది అక్కడ అనేక మంది కనిపించారు.వారంతా తెల్లని వస్త్రాలు ధరించి చతుర్భుజాలతో.

ఊర్ధ్వపుండ్రములు ( నామం) ధరించి ఉన్నారు.వారు అంతా హడావిడిగా నడిచి వెళుతుంటే వారి వెనుక మెల్లగా వానరులు నడుస్తూ పెద్ద గోపురం దాటి లోపలికి వెళ్ళారు . అక్కడ ఆదిశేషుని పడగల నీడలో ఎత్తుగా శంఖ చక్రగదాది ఆయుధములను ధరించి చతుర్భుజాలతో కుడికాలు క్రిందకు ఉంచి అభయ హస్తం ప్రదర్శిస్తూ కుడివైపు లక్ష్మీదేవి ఎడమవైపున భూ, నీలాదేవులు ఉన్నారు.

స్వామికి కొంత మంది చావరములు వీస్తున్నారు.స్వామికి ఎదురుగా ఒకవైపు వేద పారాయణ మరొకవైపు ద్రావిడ వేద పారాయణ మరికొంత మంది స్తోత్ర పారాయణలు చాలా చక్కగా అధ్యయనం చేస్తూ ఉంటే రెండు చేతులు కట్టుకుని మేము చూస్తూ ఉండగా అందులో ఒకరు ( విష్వక్సేనుల వారు)" పేకబెత్తం" చూపి బటకు పొమ్మని బెదిరించారు.

దాంతో తిరిగి స్వామి పుష్కరిణీ ప్రాంతానికి వచ్చి అక్కడి విషయాలు మిగిలిన వానరులతో చెప్పగా వారు మాకూ చూపమని కోరగా అందరూ కలిసి స్వామి పుష్కరిణి కి ఈశాన్యం వైపుకు మరల వెళ్ళి చూడగా వారు గతంలో వెళ్ళిన చీకటి గుహ ఎంత వెదకినా కనిపించ లేదు.

వారంతా చాలా సేపు గుహ కోసం వెదకి కనిపించక పోవడం వెనక్కి తిరిగి వచ్చి శ్రీ రామచంద్రుని కలిసి వారితో తాము స్వామి పుష్కరిణీ ఈశాన్య ప్రాంత మందు ఒక గుహలో మేము శ్రీ మన్నా రాయణుని చతుర్భుజాలతో, శంఖ,చక్ర,గదాది ఆయుధములు , ధరించి శ్రీ దేవి,భూ,నీలాదేవులతో ఆదిశేషుడు పై దర్శించాము .

వారి చుట్టూ చతుర్భుజాలు గలవారు ఎందరో ఉన్నారు .అక్కడ ఒకరు మమ్ములను బెదిరిస్తే భయపడి వచ్చే శాము. అక్కడి విషయం మా మిత్రులకు చెప్పగా వారు మాకూ చూపించమని కోరారు.

దాంతో వారితో కలిసి స్వామి పుష్కరిణి ప్రాంతము లో గతములో కనిపించిన గుహ కోసం ఇప్పుడు ఎంత వెదకినా కనిపించ లేదు.

అసలు ఆయన శ్రీ మన్నారాయణుడేనా ఆయన ఇక్కడ ఎందుకు ఉన్నా రో తెలియజేయమని కోరారు దానికి శ్రీ రామచంద్రుడు వానరులతో మీరు దర్శించినది సాక్షాత్తు శ్రీ వైకుంఠ నారాయణుని నే మీరు శ్రీ,భూ,నీలాదేవులతో స్వామి వారిని దర్శించారు.

అక్కడ చతుర్భుజాలతో తిరిగే వారిని నిత్యసూరులు గా పిలుస్తారు. మనం ఏదైనా వస్తువు ను చూస్తే కనురెప్ప లు టప టపా పడిపోతాయి .

వారికి అలా జరగదు . పరమాత్మను ఎప్పుడూ అలా దర్శించు కుంటూ నే ఉంటారు. మిమ్ములను "పేకబెత్తం"చూపి బెదిరించి నవారు "విష్వక్సేనులవారు" ఇక్కడ మనం సేవించు కున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారు శ్రీ ,భూ, నీ లాసమేత శ్రీ మన్నారాయణుని యొక్క అవతార స్వ రూపమే గాన మనం దర్శించు కున్నాం . ఈ స్వామి వారిని మానవులే కాదు దేవతలు కూడా అనేక రూపాలలో వచ్చి స్వామివారి ని సేవించు కుంటూ ఉంటారు.కలియుగంలో ఈ క్షేత్రాన్ని "కలియుగ వైకుంఠం" గా పేర్కొంటారు. (ఇంకా ఉంది)

(ఇంకా ఉంది)

# సింహాచలం



డా॥కె.రామానందం

తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లావాసులు తమ సంతానానికి సింహాద్రి, అప్పారావు, అప్పన్న, అప్పలస్వామి, వరహాలు, నరసింహం, లక్ష్మీనరసింహం అనే పేర్లు స్వామి వారిపై ఉన్న భక్తితో పేర్లు పెట్టుకుంటారు. సింహాచలంలో వేంచేసిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి యావత్తు భారతదేశంలోని అన్ని ప్రాంతాల నుండి భక్తులు ప్రతిరోజు వేలాది సంఖ్యలో దర్శించుకుని, అర్చించుకొని, ఆనందోత్సవాలతో తన్మయులవుతుంటారు. విశాఖ వాసులకు సింహాచలం అంటే అప్పన్న కొండ అప్పడంటే తండ్రి. తమిళ భాషాపదమైన అప్పా నుంచి అప్పన్న పుట్టింది. సింహాచలం కొండపై వరాహ లక్ష్మీనరసింహస్వామివారు వేంచేసి పూజలు అందుకొంటూ భక్తుల అభీష్టాలను నెరవేర్చుతున్న చల్లని స్వామి.

"గంగధార సమం తీర్థ
క్షేత్రం సింహాద్రి నాసమం
నారసింహ సమోదేవో
త్రైలోక్యే నాస్తి నిశ్చయః"



` మూడు లోకాలలోనూ నృసింహునికి సాటి దైవం లేదు. సింహాచలం వంటి క్షేత్రం లేదు. సింహాద్రి అప్పన్న సేవ కోసం జన్మించిన గంగధార వంటి తీర్థం లేదు.

` ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆంధ్ర కోస్తా, రాయలసీమ, తెలంగాణా రాష్ట్రముల మూడిరటిలోనూ నృసింహాలయాలు మెండుగా ఉన్నాయి. ఏ ఆలయం ప్రత్యేకత ఆ ఆలయానిదే. సింహాచల నరసింహస్వామి, వరాహ లక్ష్మి నరసింహ స్వామి అనే పేరు పొందడానికి ఒక కారణం చెబుతారు.

శ్రీమన్నారాయణుల వారు వరాహావతారం నుంచి నృసింహావతారానికి మారే క్రమంలో ఆ మూర్తిని పొందారు. హిరణ్యకశిపుడు తన కుమారుడు హరి భక్తుడైన ప్రహ్లాదుని సముద్రంలోకి తోయించి, ఆ బాలుడుపైన పర్వతాన్ని నిలిపాడు. ప్రహ్లాదుడు ఆ పర్వతం క్రింద నుంచి "త్రాహి త్రాహి నారాయణా"! అని పి-

లువగానే వైకుంఠ నారాయణుడు పరుగు పరుగున బయలుదేరాడు. నారాయణుని ఆ వేగానికి గరుత్మంతుడు చెమటలు కక్కుతున్నాడు. భక్తున్ని రక్షించుటే పరమావిధిగా ఎంచి పీతాంబరం జారిపోతున్నా ముడి వేసుకోవడం మాని, పరమాత్మ గరుత్మంతుని పైనుంచి ఒక్క ఉదుటున క్రిందకు దూకాడు. వేగంగా దూకుట వల్ల ఆయన పాదాలు పాతాళం వరకు విస్తరించాయి. అది వరాహరూపంలో భూమండలాన్ని ఎత్తి ప్రహ్లాదుని రక్షించాడని స్థల పురాణం చెబుతుంది.

అవతరించిన నృసింహ స్వామి కొంతకాలం పుట్టలో ఉన్నాడు. షడ్చక్రవర్తులలో ఒకరైన చంద్రవంశ సామ్రాట్ పురూరవ చక్రవర్తి తన భార్య ఊర్వశితో సహా విహారయాత్రలో భాగంగా ఈ క్షేత్రానికి వచ్చాడు. ఆ రాత్రి చక్రవర్తికి స్వప్నంలో స్వామి సాక్షాత్కరించి "నేను ఇక్కడే ఉన్నాను నన్ను ఆరాధించు" అని సందేశమిచ్చాడు. రాజుగారు స్వామి ఆచోకీ కోసం వెతకాడు. ఎంత వెదికినా స్వామి దర్శనం లభించలేదు. ఆ రాత్రి మరల నిద్రకు ఉపక్రమించిన తరువాత తిరిగి స్వామి స్వప్నంలో సాక్షాత్కరించాడు. 'గంగధార పడే చోట మాలతి లత క్రింద ఉన్న పుట్టలో ఉన్నాను. గుర్తుపట్టమ'ని తెలిపాడు. స్వామి తెలిపిన గుర్తులు ప్రకారం వైశాఖ శుద్ధ తృతీయ నాడు అనగా అక్షయ తృతీయ నాడు పుట్టను తొలగించగా అందు స్వామిని కనుగొన్నాడు. ఆనంద భరితుడైనాడు. స్వామిని భక్తితో గంగజలాలతో, పంచామృతాలతో అభిషేకించగా, స్వామివారి సంతృప్తులై, పురూరవ చక్రవర్తితో మాట్లాడుతూ "నేను ఇన్నాళ్ళూ పుట్టలో ఉన్నాను కనుక చల్లగా ఉన్నాను. ఇప్పుడు బయటకు వచ్చాను. చల్లదనం కోసం పుట్టకు బదులు గంధపు పుట్టను కల్పించు అని ఆనతినిచ్చాడు. స్వామి వారి ఆనతిని భక్తి శ్రద్ధాలతో నేరవేర్చాడు. అప్పటి నుంచి సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవం అక్షయ తృతీయ నాడే జరుగుతుంది. ఆ ఒక్క రోజే స్వామి నిజరూప దర్శనం ఉంటుంది. చాలా పవిత్రమైన రోజు. ఈ రోజునే బదరీ పుణ్యక్షేత్ర బదరీ నారాయణ ఆలయాన్ని తెరుస్తారు. ఈ రోజు చాలా పవిత్రమైన రోజు ` సృష్టి ఆరంభమైన రోజు. కృతయుగం ఆరంభమైందని పురాణాలు చెబుతున్నాయి.

` భగీరథుడు తన పితురులకు మోక్ష ప్రాప్తి కలగాలని పరమేశ్వరుని సహకారంతో దివిజ గంగను ఈ ధరిత్రి పైకి తీసుకువచ్చిన శుభతిథి ` ఈ అక్షయ తృతీయనే.

` క్షత్రీయ రాజులను రూపుమాపుటకు శ్రీమన్నారాయణుడు ఆరవ అవతారమైన పరశురాముడు జన్మించిన పావన దినం.

` ఈ శుభదినాన సూర్యచంద్రులు అత్యంత ప్రకాశమానంగా విరాజిల్లుతారు. ఈ రోజున ఏ కార్యక్రమం తలపెట్టిన శుభకరంగా ఉంటుందంటారు. దానధర్మాలు, ఉదక భాండదానం చెయ్యాలి. ఈ రోజున విష్ణువుకు చందనం సమర్పిస్తే విష్ణు సాలోక్యం కలుగుతుంది.

` అక్షయ తృతీయ నాడే అమృతం కోసం దేవదానవులు క్షీరసాగర మథనం చేయగా లక్ష్మీదేవి ఆవిర్భవించింది. శ్రీమహావిష్ణువు ఆమెను అర్ధాంగిగా స్వీకరించాడు. ఈ రోజున భక్తులు లక్ష్మీ స్వరూపమైన బంగారం, వెండి, ఇతర వస్తువులను కొనుగోలు చేసి సాక్షాత్తు లక్ష్మీదేవే తమ ఇంటికి వచ్చినంత ఆనందిస్తారు.

` అక్షయ తృతీయ నాడు తొలి తీర్థంకరుడైన ఆధినాథుడు తన తపస్సు ముగించాడని జైనులు నమ్మకం.

` ఈ పర్వదినాన బ్రహ్మ ముహూర్తంలోనే నిద్రలేచి, స్నానా-

ధులు ముగించుకొని శాంత చిత్తంతో లక్ష్మీనారాయణుని విధి పూర్వకంగా అర్చించి, గోదానం. భూదానం, పూలను, వస్త్రాలను, పాత సామగ్రిని దానం చేయాలి. శక్తి లేని వారు నీటితో నిండి ఉన్న కుండలు, గొడుగులు, తెల్ల పూలు, విసనకర్రలు, బియ్యం, ఉప్పు, చక్కెర, చింతపండు వాటిని అర్థులకు దానం చేయాలి. దేవతలకు చేసే పూజలు క్షయం కాకుండా అక్షయంగా ఉంటాయని కృష్ణ పరమాత్ముడు ధర్మరాజుకు బోధించాడు. మానవుడి చేసే ఏ కొద్ది పుణ్యమైనా అక్షయమైపోతుందని శాస్త్ర వచనం.

` పుణ్య దినాన మహాభారత రచన ఆరంభమైంది మరియు అమ్మవారి అమేయ కృపకు పాత్రమయ్యే శ్రీవిద్యను లోకానికి ప్రబోధించడానికి శ్రీమహావిష్ణువు సకల విద్యా స్వరూపుడైన హయగ్రీవుడుగా ఆవిర్భావము జరిగింది.

సింహాచలం పై వేంచేసిన స్వామి వరాహ ముఖంతో, మానవ దేహంతో, సింహపు తోకతో, జూలుతో ఉంటారు. కుడి చేతి వ్రేలుతో గరుత్మంతునికి అమృతం తాగిస్తూ, మరో చేతితో వస్త్రం సరి చేసుకుంటూ కనిపిస్తారు. వీరి పాదాలు భూమిలో కప్పబడి ఉన్నట్టు కనిపిస్తాయి. సింహాచలం కొండపై నిరంతరం పన్నెండు జలధారలు ప్రవహిస్తున్నాయి. వాటి మూలం ఎక్కడో తెలియదంటారు. గంగధార నుంచి వచ్చే జలం స్వామివారి సేవలకు వినియోగిస్తారు. వంటశాలలో అనంతామృతధార ప్రవహిస్తుంది. ఆలయంలోని లోపలి భాగం శిల్పకళా శోభితంగా అత్యంత సుందరంగా తిలకించవచ్చును. ఆలయ గోడలపై ద్రవిడ భాషలో అనేక శిలాశాసనములు కనపడతాయి. హిరణ్యకశిపుని వధిస్తున్న ఉగ్ర నరసింహమూర్తి, ఆదివరాహమూర్తి, బలిని పాతాళానికి అణగ తొక్కుతున్న త్రివిక్రమమూర్తి శిల్పాలు నేటికీ సుందరంగా, శోభాయమానంగా కానవస్తాయి. సింహాచలం అంటే కప్పస్తంభం గుర్తుకొస్తుంది. సంతానం కోరే దంపతులు ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుంటే సంతానం కలుగుతుందని విశ్వాసం. సింహాచల చందన సేవలో పాల్గొనటకు లక్షల సంఖ్యలో విచ్చేస్తారు.

చందనోత్సవ క్రమం:

సింహాచల వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారి ఉత్సవాలలో చందనోత్సవం కీలకమైనది. ముందుగా అక్షయ తృతీయకు ముందు రోజు రాత్రి స్వామి వారి దేహం నుంచి చందనాన్ని ఒలిచే కార్యక్రమం ప్రారంభమవుతుంది. అదే చందనం ఒలుపు. దానికోసం బంగారు, వెండి బొరిగెలను ఉపయోగిస్తారు. స్వామి దేహం మీద పేరుకొన్న చందనం ఏకంగా 120 కిలోలు ఉంటుంది. చందనం ఒలిచే సమయంలో ఎవరూ అటురాకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తారు. చందనాన్ని పూర్తిగా తొలగించిన తరువాత స్వామి విగ్రహం గచ్చకాయ రంగులో ధగధగలాడుతుంటుంది. పక్కనుంచి చూస్తే కోరలు, పళ్ళు, చెవులు స్పష్టంగా కనిపిస్తాయి. నిరంతరం పై పూతగా శ్రీ చందనాన్ని ధరించే సింహాద్రి అప్పన్న నిజానికి పరమ శాంతమూర్తి. చంద్రబింబమంత అందమైన ముఖ లక్షణాలు కలవాడు. త్రినేత్రంతో అలరారుతుంటాడు. లలిత సుందరంగా త్రిభంగిలో వయ్యారంగా నిలిచి ఉంటాడు. వరాహ ముఖంతో నృసింహ శరీరంతో ఉంటాడు. పాతాళం వరకు చొచ్చుకపోయినా పాదాలు చూడవచ్చును. పీతాంబరాన్ని ముడి వేసుకోకుండా ఒక చేత పటుకొన్నాడు. ఆయన వామనమూర్తిలా కనిపిస్తాడు. స్థూల రూపంలో ఉంటాడు. అక్షయ తృతీయనాడు మాత్రమే కని-

పిస్తాడు. నిజరూప దర్శన భాగ్యం కలిగిస్తాడు. చందనం తొలగించి తిరిగి చందనం అలదే వరకు స్వామివారికి ఫలాలు, పానకమే నివేదనం.

నిజరూపంలోకి వచ్చిన వెంటనే స్వామి శిరస్సున, ఛాతి పైన మాత్రం చలువ చందనాన్ని ముద్దలుగా ఉంచుతారు. చందనాన్ని తొలగించిన తరువాత సహస్రఘటాభిషేకం, ఆరాధన జరుగుతాయి. శిఖతో, ఊర్ధ్వపుండాలతో మూడు వందలమంది అర్చకులు విష్ణు సహస్రనామ పారాయణ, పంచ సూక్తాలను సంధానం చేస్తూ 1008 కలశాలతో శ్రీ గంగధార నుంచి తీర్థాన్ని తెచ్చి పంచామృత సహితంగా స్వామివారికి భక్తిశ్రద్ధలతో చేస్తున్న అభిషేకం నయనమనోహరంగా ఉంటుంది. ఈ అభిషేక కార్యక్రమం సుమారు మూడు, నాలుగు గంటల పాటు సాగుతుంది.

మొదటగా స్వామివారి నిజరూప దర్శనం అనువంశిక ధర్మకర్తలకు కలుగజేస్తారు. ఆ తరువాత భక్తులు సేవిస్తారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోతుంది. వాలంటీర్లు, భక్తులందరిని కూలైన్లు లో తొడతొక్కిడి లేకుండా క్రమపద్ధతిలో దైవదర్శనానికి పంపిస్తారు. దర్శనం చేసుకున్న ప్రతి భక్తునికి ప్రసాద వితరణ చేస్తారు. రాత్రి 9 గంటల వరకూ నిజరూప సౌకర్యం భక్తులకు ఉంటుంది.

శీతలోపచారాలు ప్రారంభమవుతాయి. ఏకాంతముగా అర్చకులు తలుపులు మూసి పెరుమాళ్ళకు శుద్ధోదక స్నానం చేయించి మొదటి విడతగా స్వామివారికి ముప్పై కిలోల చందనం అద్దుతారు. చందనం ఉన్న స్వామి రూపాన్ని నిత్య రూపం అంటారు. చందనం లేని రూపాన్ని నిజరూపం అంటారు.

తమిళనాడు రాష్ట్రమందలి తిరుపత్తూరు నుంచి తెచ్చిన గంధపు చెక్కలకు దేవస్థానంలోని బేడ మండపంలో మంత్రోపచ్ఛారణల మధ్య స్వామివారి పరివారం అరగదీసి శ్రీగంధాన్ని సిద్ధం చేస్తారు. శ్రీగంధంలో ఔషధీద్రవ్యాలను, సుగంధ ద్రవ్యాలను కలుపుతారు. అక్షయ తృతీయనాడు తీసిన గంధాన్ని ప్రసాదంగా భక్తులకు విక్రయిస్తారు.

రెండువైపులా శ్రీదేవి భూదేవిలతో కుడివైపున శ్రీయోగానంద నరసింహస్వామితో కొలువై ఉంది. దర్శనమిచ్చే సింహాచల శ్రీవరాహలక్ష్మీనరసింహస్వామి చందన చర్చతో చల్లదనం నింపుకొని భక్తులను అనుగ్రహిస్తుంటారు. చందనం ఒలుపుకు ముందు వచ్చే అమావాస్యను గంధం అమావాస్య అంటారు. ఆ రోజున కూడా వేలాది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

మొదట విడత అక్షయతృతీయ నాడు చందన సేవ పిమ్మట ఈ లేపన కార్యక్రమం జ్యేష్ఠ, ఆషాడమాసములలో పౌర్ణమి తిథులలో జరుగుతుంది. చందన లేపనం తర్వాత అనేక గంగాళాలతో పానకం, వడపప్పు స్వామికి నివేదించి హారతి ఇస్తారు. ఆషాడ మాసంలో చివరి విడుత చందన సేవ అనంతరం భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. ఈ మధ్యకాలంలో సింహాచల గిరి ప్రదక్షిణ బహుళ ప్రచారంలోకి వచ్చింది. దేవస్థానం అధికారులు గిరి ప్రదక్షిణ సమయంలో భక్తులకు ఆహార పానీయాలు అందజేస్తున్నారు. సింహాచలం కొండ సాక్షాత్తు నృశింహస్వామి రూపం. కూర్చున్న సింహంలా కనిపించడం ఒక విశేషం.

విశాఖపట్టణానికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఆర్.టి.సి వారు ఏర్పాటు చేసిన బస్సులలో పైనుంచి దేవాలయం వరకు జేరవచ్చును. దేవస్థానం వారు యాత్రికులకు భోజన సౌకర్యం కలుగజేస్తున్నారు.

# భాషకు పెరుగుదల ఒక ఆరోగ్య లక్షణం

మనకు భాష ప్రాణం వంటిది . భాషను పోగొట్టుకుంటే మనం మన ఉనికిని కోల్పోయినట్లే. ప్రతి వారికి కనీసం, తమ మాత, మాతృభూమి, మాతృభాషలపట్ల ఎనలేని గౌరవం ఉండాలి. మాతృభాషను కించపరిస్తే తల్లిని అవమానించినట్లే అంటారు మన జాతిపిత మహాత్మా గాంధి . ఆయన మాటల్లోనే తెలుసుకుందాం. जो मातृभाषा को अवगणना कर्ता है , वह अपनी माता की कर्ता है **(Belittling one's mother Tongue is like disparaging one's own mother )**

తెలుగుభాష మాట్లాడేవారు తెలుగు రాష్ట్రాల్లో సుమారు తొమ్మిది కోట్ల మంది ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లోను, విదేశాల్లోను కూడ ఇంచుమించు అంత మందే ఉన్నారు. ఇంతమంది ఉన్నా కాలగతిలో మనభాష నిలుస్తుందా? నిలవదా? అనే సందేహం మనకు లేకపోలేదు. దానికి కారణం ఒక భాష పదికాలాల పాటు మనుగడ సాగించాలంటే ఆ భాష మాట్లాడాలి, కేవలం మాట్లాడితేనే సరిపోదు, ఆ భాషలో వ్రాయ గలగాలి, వ్రాస్తేనే సరిపోదు, ఆ భాషలో సాహిత్య సృష్టి జరగాలి, సాహిత్య సృష్టి జరిగినంత మాత్రాన సరిపోదు, ఆ సాహిత్యం జనసామాన్యానికి అందుబాటులో ఉండాలి. అప్పుడే ఏ భాషైనా కాలగతిలో నిలుస్తుంది. లేకపోతే నిలిచే ప్రసక్తే లేదు. కొంతమంది ఛాందసవాదులు ఇతర భాషా పదాలను తమభాషలో కలుపుకోడానికి అభ్యంతరం చూపిస్తున్నారు . ఒక విధంగా ఇది భాషకు ద్రోహం చెయ్యడమే అవుతుంది . ఎందుకంటే పెరుగుదల ఆరోగ్య హేతువు . భాష ఎంత పెరిగితే, అది అంత గొప్పదౌతుంది. ఇంట్లో ఒక చిన్న పిల్ల ఉందనుకుందాం . ఆమె ఎదుగుతూ పెరిగి పెద్దదైతే మళ్ళా పరికిణీలు కుట్టించాలి, క్రొత్త బట్టలు కొనాలి, దానికి చాల డబ్బు ఖర్చు చెయ్యాలి అని ఎవరైనా అనుకుంటారా ! ఎవరూ అనుకోరు . అంతేగాక ఆమె ఎదుగుతున్నకొద్ది సంతోషిస్తారు. . భాష విషయంలో కూడ ఇదే నియమం వర్తిస్తుంది . మన భాషలోకి అనేక ఇతర భాషా పదాలు నిరంతరం వచ్చి చేరుతూ ఉంటాయి . ఇది అనివార్యం, ఆమోదయోగ్యం కూడ . మనం తదనుగుణంగా వ్యాకరణ గ్రంథాలు వ్రాసుకుంటూ పోవాలి . అన్యదేశ్య పదాలుగా ఆయా పదాలను నిఘంటువుల్లో చెర్చుకుంటూ పోవాలి . అంతే గాని భాష పెరుగుదలను అరికట్ట కూడదు. భాషను సంకుచితం చేసే ఛాందసవాదుల అభిప్రాయాన్ని నిరసిస్తూ తమ శంభోశతకంలో శ్రీ మల్లాది శివరాం గారు చెప్పిన ఈ పద్యం చూడండి .

పాపమని, యన్యపదముల దాపును మాపెదరు పండితమ్మన్యులు, ము న్నేపదములు చేరకయే యీ పలుకీరీతి పరిణమించెనె శంభో !

ఇక మరికొంత మంది టైము , టిక్కెట్టు , రోడ్డు మొ|| పదాలు వాడుతున్నాం . మనం మాట్లాడేది తెలుగే కాదు అని వాదిస్తున్నారు.`ఇది చాల తప్పుడు అభిప్రాయం ఎందుకంటే Time అనేది ఆంగ్లపదం, గాని 'టైము' తెలుగుపదమే అవుతుంది. . అలాగే Ticket ఆంగ్ల పదం, టిక్కెట్టు మాత్రం తెనుగు పదమే. అలాగే Road ఆంగ్లపదం 'రోడ్డు' మాత్రం తెలుగుపదమే. భాషలో తత్సమం, తద్భవం, దేశ్యం, గ్రామ్యం అనే నాలుగు రకాల పదాలుంటాయి. 'రామ' అనే సంస్కృతపదం తీసుకుని మనం 'రాముడు' చేసుకున్నాం . అది తత్సమం . 'అగ్ని' అనే పదం , 'అగ్గి' అయింది అది తద్భవం . 'అక్క' 'అన్న' మొదలైన పదాలు దేశ్యాలు అవి మన స్వంత పదాలు. అవి కాకుండ వస్తాడు , లెగుస్తాడు, కూకుంటాడు మొదలైనవి గ్రామ్యపదాలు . ఇక టైము , రైలు మొ || అన్యదేశ్యాలు. ఇవన్ని

తెలుగు పదాలే కాబట్టి వాటిని తెలుగుపదాలు కావనడం సాహసం . తొలగించాలను కోవడం అవివేకం . అంగ్లభాష చూడండి ప్రపంచంలో ఉండే అన్ని భాషాపదాల్ని తనలో కలుపుకుంటూ ఎంత విస్తృతంగా పెరిగిపోతోందో! . 'జనన్నాథ' అనే పదాన్ని **Juggernaut** గా మార్చుకుని తనలో ఇముడ్చుకుంది . **oxford** నిఘంటువు చూస్తే ఈ పదానికి **an idol of Lord Vishnu at Puri** అని ఉంటుంది. అలాగే, పండిత అనే పదం, **pandit** అయింది . అలాగే **gaddi** గద్ది (సింహాసనం) **an Indian throne** మొదలైన కొన్ని వందల, పదాలకు తన నిఘంటువులో స్థానం కల్పించింది . ప్రతి సంవత్సరం నిఘంటువుల్ని, వ్యాకరణాన్ని మార్చుకుంటూ పోతోంది . అందుకే ఆ భాష అలా పెరిగిపోతోంది . మన భాషలు తరిగి పోతున్నాయి. వారి లాగే మనం ఆ పనే చెయ్యాలి.

ఇక కొంతమంది మిత్రులు తమకు తెలిసో, లేక తెలియకో తెలుగును సులభం చెయ్యాలంటే కొన్ని వర్ణాలు తొలగించాలనే వాదన చేస్తూ ఉన్నారు. ఇది మరీ విడ్డూరంగా ఉంది. ఒక విద్యాశాఖాధికారి (D.E.O) గారు నా దగ్గరకు వచ్చి శకటరేఫ అంటే బండి 'ఱ', మరియు అరసున్న మొదలైన వర్ణాలు తొలగించాలని వాదించారు.నేనన్నాను,ఏమండీ! **enough, committee** మొ|| పదాలకు అన్ని అక్షరాలు అవసరమా? కొన్ని తీసేయ్యొచ్చు కదా! తీసిచూడండి, ఏం జరుగుతుందో చూద్దాం అన్నాను. ఆయన ముఖంలో నెత్తురు చుక్క లేదు. అందువల్ల తెసేయడం పరిష్కారం కాదు. వాటిని నేర్పడమే ప రి ష్కా ర ం .

ఇకశకటరేఫ(ఱ)విషయానికొద్దాం . బండి ర ఉపయోగించకుండ నీరు అంటే water, ఉపయోగించివ్రాస్తే నీఱు అంటే ashes (బూడిద). అలాగే పాఱు అని బండి 'ర' వ్రాస్తే ప్రవహించడం . అలా కాకుండా పారు అంటే పారడం. ఒక అవధానంలో ఒకాయన అడిగారు . మనం, బయలుదేరేటప్పుడు నక్క, కుడి ప్రక్కనుండి పారితే మంచిదా ఎడమ ప్రక్క నుండి పారితే మంచిదా అని . దానికి సమాధానంగా అవధాని గారు ఎటు పారినా పరవా లేదు, మన మీద చిందకుండా ఉంటే చాలు అ న్నా రు .

ఇక అరసున్న విషయానికొద్దాం. వెలుగులో అరసున్న ఉంటే ప్రకాశం అని అర్థం. (వెలు(గు). ఒకవేళ అరసున్న లేకపోతే వెలుగు అనే పదానికి 'ముళ్లకంచె' అని అర్థం .చీకు అనే పదంలో అరసున్న ఉంటే గ్రుడ్డి అని అర్థం . నన్నయ గారు ధృతరాష్ట్రుని 'చీ(కు రాజు' అనడం మనం గమనించవచ్చు. అరసున్న లేక పోతె ఆ పదానికి చీకి పోవడం అనే అర్థం వస్తుంది. అందువల్ల వాటిని మనం పిల్లలకు నేర్పగలగాలి. నేర్పడానికి సులభమైన పద్ధతులు ఆలోచించాలి , తీసెయ్యడానికి కాదు. ఇప్పటికే విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా వ్యాకరణాన్ని కొంత తొలగించారు . ఇది చాల శోచనీయం . ఇక నేర్పినా, నేర్పక పోయినా పరవా లేదు గాని తీసెయ్యడం మాత్రం చాల తప్పు .

ఈ మధ్య కొంతమంది మహా ప్రాణ వర్ణాలు (ఖ, ఘ మొదలైనవి ) తొలగించమని అంటున్నారు. ఇప్పుడు తెలుగు భాషామతల్లి కనీసం కొన ఊపిరితోనైనా ఉంది. ఆ మహా ప్రాణ వర్ణాలు తొలగిస్తే, ప్రాణమే కోల్పోతుంది .

ఇక ఇంగ్లీషు భాష రాకపోతే ప్రగతి ఆగిపోతుందని వాదించేవాళ్ళు కొంతమంది లేక పోలేదు. భాష నేర్చుకుందాం తప్పు లేదు . కాని మన భాషను పోగొట్టుకుని మాత్రం కాదు .

కొంత కాలం క్రితం మా గురువులైన ఆచార్య పోచంచర్ల శ్రీరామమూర్తి గారు జర్మనీదేశం వెళ్ళారు . వాళ్లకు ఇంగ్లీషు రాదు, వీరికి జర్మన్ భాష రాదు. ఇంగ్లీషులోనే అన్ని చెప్పేవారు, వారికి ఏదో కొంత మాత్రమె తెలిసేది. కాలం ఎలాగో గడిచి పోయింది, ఎవరికీ ఏమి రాకపోయినా కాలం ఆగదు కదా! .ఆయన, తిరిగి స్వదేశానికి వస్తున్నప్పుడు వారితో " మీకు ఆంగ్లం రాదు . నేర్చుకోవాలని ఎప్పుడు అని పించలేదా! ఆంగ్లం రాకపోతే అభివృద్ధి సాధ్యమా ? అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా వారు మాకేమవసరం? ప్రపంచంలో ఎవరు ఏ పుస్తకం

వ్రాసినా అనతికాలంలోనే మాకు, దాని జర్మన్ అనువాదం మా చేతిలో ఉంటుంది . ఆంగ్లం నేర్చు కోవడం మాకేమీ అవసరం లేదు పొమ్మన్నారు .

దురదృష్టవశాత్తు అటువంటి అవకాశం మనకు లేదు . అందువల్ల మనం ఇంగ్లీషు నేర్చుకుంటే గాని డాక్టర్స్ కాలేం, ఇంజనీర్సు కాలేం . ఇదే ఆంగ్లభాషా వ్యామోహానికి ఒక ప్రధాన కారణం. అందువల్ల మనం జర్మన్ దేశీయుల మార్గాన్ననుసరించాలి. ఇక ఫ్రాన్సు దేశం, బ్రిటన్ కు చాల చేరువలో ఉంది . అందువల్ల ఆంగ్లం, తమ మాతృభాషను ఎక్కడ కబళించి వేస్తుందో అన్న భయంతో ఎన్నో ఆంక్షలు విధించారు . ఉదాహరణకి నేను విన్న, ఒక విషయం చెపుతాను . ఫ్రాన్సులో, కార్యాలయాల్లో ఎవరైనా ఇంగ్లీషులో ఉత్తరం వ్రాస్తే అది చింపి పారేస్తారు. లేకపోతే వాళ్ళ భాష అంతరించి ఇప్పటికి ఎన్నో శతాబ్దాలు అయ్యుండేది. ఇక మన దేశంలోనో, తెలుగులో వ్రాస్తే ఆక్షేపిస్తున్నారు . మరికొంతమంది 'ఉరుముఉరిమి మంగలం మీద పడింది' అన్నట్లుగా సంస్కృత భాష మీద విరుచుకు పడుతున్నారు. పాపం! అదేం చేసింది! తెలుగును పెంచి పోషించడం, అభివృద్ధి చేయడం తప్ప . గాంధీమహాత్ముడు అన్నారు Sanskrit is like river Ganges to our country, if it is dried up all regional languages will lose their vitality and power. అందువల్ల సంస్కృతాన్ని ద్వేషించడం జాతిని, జాతిపితను అవమానించడమే అవుతుంది. కాబట్టి ప్రభుత్వ విధానాలు స్పష్టంగా ఉండాలి. ఎక్కడ లోపం ఉందో అక్కడ సవరించాలి . రోగం ఒకచోట , వైద్యం మరొక చోట కాకూడదు. ఒక ప్రక్క మాతృభాషను ఉద్ధరించాలి అంటూనే ఇంగ్లీషు చదివేవారి పట్ల మక్కువ చూపిస్తున్నాం. ఇది సబబు కాదు. తెలుగును ప్రోత్సహించాలి వారికి ప్రభుత్వ సంస్థల్లో గౌరవప్రదమైన స్థానం కల్పించాలి . కాబట్టి సమస్యకు ఏది మూల కారణమో తెలుసుకుని దాన్ని గమనించి నివారించ కలిగితే, భాషారక్షణ , అభివృద్ధి పెద్ద పనేం కాదు. భాష రక్షణకు , అభివృద్ధికి అవిశ్రాంతంగా శ్రమిద్దాం . ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా ! నిజం మరచి నిదురపోకుమా! అన్నట్లుగా అన్ని ప్రభుత్వానికే వదిలెయ్యా కూడదు . మనం కొంత చెయ్యాలి. ఉదాహరణకు శతక సాహిత్య సంపద మనకు చాల ఉంది . ఒక్కొక్క శతకం తీసుకుని ఆ శతకంలో పద్యం అప్పగించిన విద్యార్థికి ఒక్కొక్క పద్యానికి ఐదు రూపాయలు , ఇక చూడకుండా వ్రాసిన వారికి పద్యానికి పది రూపాయల చొప్పున బహుమతిగా ఇస్తే అందరు వ్రాయడం కూడా నేర్చుకుంటారు. చదవడం వ్రాయడం నేర్పితే భాషను బ్రతికించినట్లే . భాష చిన్నప్పుడే నేర్పాలి పెద్దవారైతే నేర్చుకోలేరు, నేర్చుకోరు కూడా . అంత ఓపిక వారికి ఉండదు . వారికిది అవసరం అనే భావన అసలే ఉండదు .

ఇక అసలే అక్షరాలు ఎక్కువ . హ్రస్వాలు , దీర్ఘాలు, పొల్లులు, ఒత్తులు . అవన్నీ ఒకేలా ఉండవు. ఉదాహరణకు 'క' ఒకలా ఉంటుంది , క ఒత్తు మరో లాగా ఉంటుంది . అలాగే 'మ' , 'న', 'త', 'ప' 'య' 'ర' 'ల' 'వ' మొదలైన అక్షరాలూ ఒక లాగ, ఒత్తులు మరో లాగా , ఉంటాయి . ఇవి కాకుండా గుణింతాలు . అలాగే ఉచ్చారణ , ఆపై సంధులు , సమాసాలు . ఈ అక్షర యజ్ఞంలో మనం చేరదాం. అందరికి చేదోడు వాదోడుగా నిలుద్దాం . నేను కూడా ఈ కార్యక్రమానికి నా వంతు కృషి చేస్తానని మాట ఇస్తూ, ఈ సందర్భంగా

తెలుగులెంక, శ్రీ తుమ్మల సీతారామ మూర్తి గారి ఆవేదనా పూరితమైన పద్యంతో ముగిస్తాను

బెంగాలీ కృతికర్త పాదములకర్పించున్నమస్కారము ప్రొంగున్ పారశీలేఖినీ విలసనంబుల్వ్రాచి రావయ్య నాబంగారంబ యటంచు నాంగ్లకవి నాహ్వానించు నేపాపమో! రంగా మెచ్చుడు తెల్గుబిడ్డ కవి సమ్రాట్టున్ స్వదేశీయునిన్ .

మాతృభాషను రక్షించుకుందాం, ఆత్మ గౌరవాన్ని కాపాడు కుందాం. నమస్కారం.

# మధుర స్వప్నం

ఉషారాం



(గత సంచిక తరువాయి)

వసుధకు పెళ్లయిన కొత్తలో అత్తయ్య గారికి ఒంట్లో బావుండ లేదు. అబ్బాయి పెళ్లి హడావిడిలో పనులన్నీ చేసుకోవడంతో బీపీ ఎక్కువైంది. డాక్టర్ గారు ఒక నెల రోజులు విశ్రాంతి తీసుకోమన్నారు. కొత్త కోడలు రాగానే తనకు విశ్రాంతి అంటే ఆవిడకీ చాలా బాధనిపించింది. అమ్మాయి ఏమనుకుంటుందో అని శ్యామ్ తోటి, వాళ్ళ మామయ్య గారి తోటి చెప్పి బాధపడ్డారు. కానీ వసుధ మాత్రం మీరు విశ్రాంతిగా ఉండండి. నాకు చేత అయినట్టుగా వంట చేస్తానండి. ఉప్పులూ కారాలు కాస్త అటు ఇటు అవచ్చు. మా అమ్మకు ఒంట్లో బాగుండకపోతే నే చేయనా ఏమిటి మీరే చెప్పండి. అంటూ ఆవిడని వంటింట్లోకి రాకుండా ఐదు గంటలకే లేచి అన్ని పనులు చేసింది. పనిపిల్ల గంగ మంచిదే. కొద్దిగా కూరలవి తరిగిపెట్టి పొద్దున్నే టిఫిన్కి లంచ్ కి పిల్లలకు శ్యామ్కి ఇబ్బంది లేకుండా సాయం చేసి పెట్టింది. దాంతో ఆవిడెంతో ఆనందపడి నా కూతురు అత్తారింటికి వెళ్లినా, కోడలు రూపంగా ఇంట్లోనే ఉంది అంటూ ఆమెను చూడడానికి వచ్చిన వాళ్ళందరితో చెప్పి మురిసిపోతూ ఉండేది. దాంతో వసుధా వాళ్లకు బెంగ తీరింది. శ్యామ్ మటుకు హనీమూన్ కి వెళ్ళలేకపోయామని రెండు నెలల తర్వాత ఊటీ వెళదామని ప్లాన్ వేసాడు. తన ఆడపడుచును అత్తయ్య గారి దగ్గర ఉంచి వారం రోజులు ఊటీ వెళ్లారు. అక్కడ సాయంత్రం అయ్యేటప్పటికీ చల్లని గాలులు వీస్తూ సైనికుల్లాగా పెద్ద పెద్ద చెట్లు వరుసగా నిలబడి వచ్చే పోయే వాళ్లందర్నీ కాపలా కాస్తున్నట్టు అనిపించింది. తెల్లవారుజామున మంచి దుప్పటి కప్పుకుని నిజాయితీపరులైన వాచ్మేన్ లాగా కనపడ్డాయి. పూలన్నీ విరగపూసి, తమ అందాలతో, మకరంద పరిమళాలతో చూపరులను ఆకర్షిస్తూ స్వాగతాలు పలుకుతున్నట్లుగా ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఆకాశం,జలపాతాలు దేవుని సృష్టిలోని విచిత్రాలను గుర్తుతెస్తున్నాయి. శ్యామ్ చేసే చిలిపి పనులతో తాము వేరే ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా కొత్త ఆనందాలు మనసును, తనువును మరిపింప చేశాయి.

టీ తోటలు, గులాబీ తోటలు ఎంతో శ్రద్ధగా, కన్న బిడ్డల్లాగా పోషిస్తున్నారు. భగవంతుడి రసిఖత్వానికి తాము వారసులం అన్నట్టు కనపడుతున్నాయి. లేళ్ళ, దుప్పుల , నెమళ్ళ గుంపులు, ఏనుగులు వగైరా అడవిజంతువులు చాలానే కనిపించాయి. సాయంత్రాల్లో క్యాంటీన్ బయట కూర్చుని వేడి టీ తాగడం, ఒకరికి కోసం ఒకరం అంటూ కళ్ళల్లోకి చూసుకుంటూ కాలాన్ని గడపడం, ఎన్నో మధురానుభూతులను మది నింపిన విహారయాత్రగా తన మనసులో నిలిచిపోయింది.

తిరిగి వచ్చాక, ఆరు నెలలు మామూలుగాగడిచాయి.తరువాత మావయ్య గారికి ఒంట్లో బా గు ం డ క పో వ డ ం , ఆసుపత్రిలో ఉంచడం, ఆసుపత్రికి తిరగాల్సి రావడంతో, అత్తయ్య గారు ఎంతో కంగారు పడడంతో వసుధ ఆవిడకు ధైర్యం చెప్పి, ఉదయమే లేచి, విసుక్కోకుండా పనులన్నీ చేస్తూ, ఇంటికి వచ్చాక జాగ్రత్తగా మందులవి ఇస్తూ, కంటికి రెప్పలా చూసుకుంది. పెద్దలకు సేవ చేస్తే, కాశి పుణ్యక్షేత్రం దర్శించినట్లే భగవంతుడికి చేసే సేవలాగేనని తను భావించేది. ఆమె సహకారంతో, సేవలతో ఆయన తొందరగా కోలుకున్నారు. వాళ్లు ఆమెకు చాలా చేరువయ్యారు. అందరూ కలిసి తిరుపతి, కాళహస్తి వెళ్లి వచ్చారు.

(సశేషం)

# గజేంద్ర మోక్షము

ఆచార్య డా. శనగవరపు కృష్ణ మూర్తి శాస్త్రి



దుష్టులకు శిక్షవేయుచు శిష్టు లయెడ
రక్ష కల్పించు వారెవ్వ రగును దేవ?
. ఆది మధ్యాంత రహితు డెవ్వారు యగును?
నాయెడ దయ లేదా ప్రభూ నమ్మలేను—74

నిన్ను దప్పించి యన్యుల న్నెఱుగ స్వామి
శక్తి సడలెను ధైర్యము సడలి పోయె
మూర్ఛ వచ్చె, డస్సెశరీరము ,నను కాయ
రమ్ము భద్రాత్మకా జగద్రక్షక? దయ ---75

చూపు మయ్య, పరంధామ, సుగుణ శీల.
నిన్ను శఱణన్న యార్తుల నెంజిలి విని
సత్వరంబున వారి రక్షణము గొఱకు
పరుగు లెత్తుద వటగద స్వామి యెచట --=76

కైన, ఎప్పుడైనను; నీవు కరుణ జూపి
దీనుడనగు నన్నాదుము దీన బంధు .
యీా మకరి పెట్టు పీడ సహించ లేను
నీ యునికికె ప్రశ్న మిగిలె నీర జాక్ష --77

సందియము తీర్చరావయ్య సత్వరముగ
విశ్వ మంతయు వ్యాపించి విస్తృతముగ
విశ్వ పోషకుండగుచు తా వెలుగు చుండి
విశ్వ కరుడౌచు నిలబడు విశ్వ మూర్తి ---78

వేగముగ వచ్చి రక్షించ వేడు చుంటి
ననుచు దీనాతి దీనుడై హస్తి రాజు
పిలవ కమలాసనాదులు వినియు వినక
యుండిరది విష్ణువే తగు యుక్తు డనుచు--79

విశ్వ మంతయు నిండిన విష్ణుమూర్తి
మూల పురుషు డా వైకుంఠ పురము లోని
కల్పవృక్షముల్, కమలముల్, కాంతు లీను
మణులు మాణిక్యములతో రమ సహితంబు --80

నున్న నిన్ పాహి పాహి యనుచు పిలచిన
కరిని వెంటనే కాపాడు కార్యమందు
మగ్నుడి వగుచు నీవు శ్రీ మాత సిరికి
చెప్పకన్, శంఖ చక్రముల్ చేత లేక, ---81


సేవకులకు మాటైనను చెప్ప కుండ,
గరుడుని పిలవకుండను, కర్ణములకు
జారు కేశములను కూడ సర్దు కొనక,
ప్రణయ కలహము నున్నట్టి పైట కొంగు—82

నైన వీడక గజరాజు నాదు కొనగ
వడివడిగ రక్షణనిడగ వచ్చు నీదు
వెనక రమయు, నంతఃపుర వనితలున్ను ,
వైన తేయు, కౌమొదిక , పాంచ జన్య --83

ముల్ ,సుదర్శన, నందకము సహ శాంగ
మాయుధంబులు, నారద మౌని, నీదు
భక్త జనులు, విష్వక్సేన ప్రభువు శక్తి
మంతు డైన సేనాపతి, మంది మార్బ --84

లములు వెంట వచ్చిరి వేగి రంబు నంత
మాత శ్రీలక్ష్మి ముఖము పై మడగు స్వేద
బిందువుల గ్రోలి తుమ్మెదల్ ప్రీతి చెందె
మధుర మరవింద మకరంద మత్తు లగుచు--85

# శ్రీకారం 2050....?



ఆచార్య కందాళం బదరీ కృష్ణకుమార్

(గత సంచిక తరువాయి)

”సార్ చూడండి" డ్రైవర్ మాటలకి నిద్ర నుండి ఉలిక్కిపడి లేచాడు. ఒక ఐదు కిలోమీటర్ల దూరంలో కొన్ని లారీలు ఆగి ఉన్నాయి. లారీలో ఉన్న బియ్యం మూటలు తమ బండిలో ఎక్కించుకుంటూ చాలామంది మనుషులు కనిపించారు. వాళ్ళందరూ ముఖం కనిపించకుండా ముసుగులు వేసుకున్నారు. డ్రైవర్ వెంటనే టాక్సీ వెనక్కి తిప్పి వేరే దారికి మళ్ళించాడు.

"ఏం జరుగుతోంది?"

"దోపిడీ సార్. ప్రజలకి తిండి గింజలు కూడా దొరకటం లేదు. ఎందుకంటే అన్ని వస్తువులు ఇంపోర్ట్ అవుతున్నాయి తప్ప ఎక్స్పోర్ట్ అవటం లేదు. ఈ బియ్యం కూడా ఇంపోర్ట్ చేసుకున్నవే. ఈ లారీలు ఎయిర్ పోర్ట్ నుంచి వస్తున్నాయి. దారిలో కాపు కాసి కొల్లగొడుతున్నారు. చెప్పాను కదా సార్, పనిచేయటానికి సోమరితనం, డబ్బు కావాలి, అందుకే చాలామంది ఈ దారి పట్టారు"

”మరీ డ్రైవర్ ప్రతిఘటిస్తున్నట్టు కనిపించలేదు. వాళ్లతో లాలూచీ పడ్డాడా"

"కాదు సార్ లారీ నడుపుతున్నది, మనిషి కాదు రోబో. ఇందాక ముఖ్యమంత్రి మీటింగ్ లో చెప్పినట్టు ప్రభుత్వం డ్రైవర్లను తీసివేసి ఈ రోబోలను పెట్టుకుంది"

"రోబోలకు వాటికి ఇచ్చిన పని చేయటం తప్ప మరో పని రాదు. అందుకే ప్రతిఘటించడం లేదు కాబోలు”

“ఆర్థికంగా స్థిరపడాలని రోబోలను పెట్టుకున్నారు, కానీ ఇదిగో ఈ విధంగా నష్టపోతున్నారు"

"ఇలా దోపిడీ చేస్తుంటే పోలీసులు పట్టించుకోరా?”

" జీతాలు ఇవ్వలేక పోలీసు బలగాన్ని కూడా సగానికి సగం తగ్గించేసారు. వారికి బదులుగా పోలీస్ శాఖలో కూడా రోబోలను పెట్టుకున్నారు. వాటికి మీరన్నట్లు వేరే పని చాతకాదు. అవి ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా తయారయ్యాయి. నేరస్తులను విచక్షణా జ్ఞానం లేకుండా చితక కొడుతున్నాయి. దానివల్ల చాలా మంది నేరస్తులు జైలులోనే చనిపోవటం జరుగుతోంది. ప్రభుత్వం ప్రతిపక్షాలకు, ప్రజలకు సమాధానం చెప్పుకోలేక సతమతమవుతూ ఉంది. రోబోలను పెట్టుకోవడం వల్ల వారికి నష్టమే జరుగుతోంది కానీ లాభం కాదు. మల్టీ టాస్క్ చేయగల రోబోలు విదేశాలలో ఉండవచ్చుగాని, ఇక్కడ ఇప్పుడు, మన వాళ్ళు వాడుతున్న రోబోల వల్ల పెద్ద ప్రయోజనం లేదు. ఇప్పుడున్న పోలీసులకి నాయకులకి కాపలా కాయటానికే సమయం సరిపోవడం లేదు. ఇంక, దొంగలని ఏం పట్టుకుంటారు. బలమున్నవాడిదే రాజ్యం అన్నట్లు ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోవటం లేదు"

"మరి సామాన్య ప్రజలకు తిండి ఎలా వస్తోంది ?"

"అది ప్రభుత్వమే భరిస్తోంది సార్. వారానికి ఒకసారి ఇంట్లో ఉన్న మనుషులకి, ఒక్కొక్కరికి ఇన్ని గ్రాములు చొప్పున లెక్క కట్టి, వారానికి సరిపడా బియ్యం, రెండు రకాల కూరగాయలు మాత్రం, రేషన్ గా ఇస్తున్నారు. ప్రజలు వాటితోనే సరిపెట్టుకుంటున్నారు"

"ఇంకా మనం ఎంత దూరం వెళ్ళాలి."

“ఒక అరగంటలో వెళ్తాము సార్. ఇంతకీ మీరు వెళ్ళవలసిన చోటుకి వెళ్లి, ఎక్కడ ఉంటారు, ఏం చేస్తారు? ఆ ప్రదేశమంతా నిర్మానుష్యంగా ఉంది కదా. మీ స్నేహితులు ఎవరూ మీకు చెప్పలేదా?" అడిగాడు డ్రైవర్.

"నేను వస్తున్నట్లు ఎవరికీ తెలియదు. సర్ప్రైజ్ చేద్దామని ఇలా వచ్చాను. నాకు తెలిసిన ప్రదేశమే కనుక ధైర్యం చేసి, నా మిత్రుని కలవటానికి వెళ్తున్నాను. ఇంతకీ నిర్మానుష్యంగా ఉంది అంటావేమిటి? అక్కడ ఒక పెద్ద ఎలక్ట్రానిక్ ఫ్యాక్టరీ, ఫుడ్ ఫ్యాక్టరీ, బొమ్మల ఫ్యాక్టరీ ఉండేవి కదా.
పదివేల మంది వరకు కార్మికులు, పని చేసేవారు. ఇప్పుడు ఫ్యాక్టరీలు ఏమైనాయి, వాళ్ళంతా ఏమయ్యారు?"
"అది ఒకప్పటి మాట సార్. ప్రజలంతా ఎప్పుడో విదేశీ వస్తువుల వ్యామోహం లో పడిపోయారు. ముఖ్యంగా చైనా నుండి వస్తున్న ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆట బొమ్మలు అంటే విపరీతమైన క్రేజ్. అవే కాదు, ఇతర దేశాల నుండి వస్తున్న ఆహార పదార్థాలను పై కూడా మోహం పెంచుకున్నారు. స్వదేశీ వస్తువులని ఎవరూ కొనక పోవటం వల్ల రాబడి లేక ఫ్యాక్టరీలన్ని మూతపడ్డాయి. అందులో పనిచేసే కార్మికులు రోడ్డున పడ్డారు"
"మరి ఇప్పుడు వారికి జీవనోపాధి"
"ఏమీ లేదు. ఫ్యాక్టరీ మూత పడటం వల్ల క్వార్టర్స్ కూడా ఖాళీ చేయ వలసి వచ్చింది"
"మరి వారంతా ఏమయ్యారు ?"
"కుటుంబాలని పోషించు కోలేక, కొంతమంది కుటుంబాలతో సహా ఆత్మహత్య చేసుకున్నారు. మరికొంతమంది, వారి వారి గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి రేషన్ తో కాలం గడుపుతున్నారు. మగవాళ్ళు దోపిడీలు చేస్తున్నారు. ఆడవాళ్ళు వ్యభిచారం చేస్తున్నారు . నాయకులకు, కొంతమంది ధనవంతులకు ఉంపుడుకత్తెలుగా ఉంటున్నారు. ఇది ఈనాటి దౌర్భాగ్య పరిస్థితి" బాధగా చెప్పాడు డ్రైవర్. "అంతే కాదు సార్ " అని మళ్ళీ చెప్పసాగాడు డ్రైవర్. "మనవాళ్ళకి కేవలం విదేశీ వస్తువుల మీదే కాదు , వాళ్ల సంస్కృతి సాంప్రదాయాలు అన్నా మోజే . పబ్ కల్చర్ కి అలవాటు పడి మన సంస్కృతి సంప్రదాయాలు మరచిపోయి విచ్చలవిడిగా ఆడా మగా తేడా లేకుండా తిరుగుతున్నారు . వీళ్ళని ఎవరు బాగు చేయలేరు సార్."
"ఇంత చక్కగా విశ్లేషిస్తున్నావు, ఏం చదువుకున్నావేమిటి? ఎప్పటి నుంచో అడగాలనుకున్న ప్రశ్నను అడిగాడు రామ్.
"ఎకనామిక్స్ లో పి హెచ్ డి సార్."
ఉలిక్కిపడ్డాడు రామ్. "ఇంత చదువుకొని ఈ పని ఏమిటి?"
"చదువుకున్న వాళ్ళ కర్మ అంతే సార్. అటు దోపిడి దొంగతనాలు చేయలేము, ఇటు పస్తులు ఉండలేము. ఉద్యోగాలు లేక, ఇలా ఏదో ఒక పని చేసి కుటుంబాలను పోషించుకోవలసి వస్తోంది. అయినా నాకేమీ బాధ గా లేదు సార్. ఎవరి సొమ్ము నేను అన్యాయంగా తీసుకోవటం లేదు, పని చేస్తున్నాను, దానికి తగ్గ డబ్బులు తీసుకుంటున్నాను. ఈ పనిలో నాకెంతో తృప్తి ఉంది సార్"

..........

బస్సు ఒకటి షిప్ యార్డ్ దగ్గర ఆగి ఉంది. వందలాది ఆడవారిని, మగవారిని షిప్ ఎక్కిస్తున్నారు. అక్కడ చాలామంది విదేశీయులు కూడా ఉన్నారు. ప్రశ్నార్థకంగా డ్రైవర్ ని చూసిన రామ్ చూపులు అర్థమైనట్లు డ్రైవర్ చెప్పాసాగాడు.
"విదేశీయులు మన వారిని వాళ్ల వాళ్ల దేశాలకు తీసుకు వెళ్తున్నారు"
"ఎందుకు ఉద్యోగం ఇవ్వటానికా ? " ఉత్సాహంగా ప్రశ్నించాడు రామ్.
"కాదు ఊడిగం చేయటానికి. బానిసలుగా తీసుకొని వెళ్తున్నారు"
"అదేమిటి"
"అవును సార్. ఇందాకటి నుంచి నేను చెప్పిన విషయాలు కేవలం మన రాష్ట్రంలోనే కాదు దేశమంతా అదే పరిస్థితి. దేశమంతా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. మన కేంద్ర ప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, వరల్డ్ బ్యాంక్ నుంచి లక్షలక్షల కోట్లు అప్పులు చేశారు. ప్రజా సంక్షేమమే మా భాద్యత, వ్యాపారం కాదు అని ప్రభుత్వ పరిశ్రమలన్నంటినీ ప్రవేటుపరం చేసి కంట్రోలు కోల్పోయారు. ఇరవై సంవత్సరాలుగా ఒక్క పైసా కూడా కట్టలేకపోయారు. పది సంవత్సరాల క్రితం మన ప్రధానమంత్రిని ఆర్థిక మంత్రిని అరెస్టు చేయాలని విదేశీ ప్రభుత్వాలు నిర్ణయించాయి, కానీ కొన్ని దేశాల జోక్యంతో అది జరగలేదు. మన ప్రభుత్వాలు పూర్తిగా చేతులెత్తేయడం వల్ల,

అమెరికా, రష్యా, జపాన్, చైనా ప్రభుత్వాలు వాళ్ల వాళ్ల కోర్టులను ఆశ్రయించాయి. ప్రభుత్వాలు వాళ్ళ అప్పులను ఏ రూపంలో అయినా వసూలు చేసుకోవచ్చని, కోర్టు పర్మిషన్ ఇచ్చింది. మనుషుల్ని కూడా తెచ్చుకో వచ్చని సలహా ఇచ్చింది. మన జనాభా భరించటం కష్టం అవటంవల్ల, కేంద్ర ప్రభుత్వం కూడా అందుకు అంగీకరించింది. అందుకే విదేశీ ప్రతినిధులు మన దేశానికి వచ్చారు. ఈ దేశంలో, ఈ దౌర్భాగ్య పరిస్థితిలో ఉండేకన్నా విదేశాల్లో బానిసలుగా ఉండటం మేలని ప్రజలు కూడా వెళ్ళటానికి సిద్ధమయ్యారు. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో బానిసలుగా బ్రతికిన మనం ఇప్పుడు మన నాయకుల పుణ్యమా అని తిరిగి బానిసలు అవుతున్నాం. ఇలాగే మరి కొన్ని సంవత్సరాలు ఉంటే, మన భారతదేశం ప్రపంచ పుటలలోనే లేకుండా పోవచ్చు" ఆవేదనతో ఇంకా ఏదో చెప్పబోతున్న డ్రైవర్ని, ఇక వినలేనట్లు వారించాడు రామ్.

ఏమిటీ దుస్థితి. ఒకప్పుడు వేదభూమి, దేవభూమి, దివ్యభూమిగా కీర్తించబడి, సిరిసంపదలతో తులతూగి, రత్నాలు, వజ్రాలు అంగడిలో అమ్మిన దేశం, అన్నపూర్ణగా విశ్వఖ్యాతి గడించిన భారతదేశం, ఈనాడు ఈ స్థితిలో ఉండటానికి కారణం ఎవరు... ఇంకెవరు .... స్వార్థంతో, ఆశతో, పదవీ వ్యామోహంతో, రాజకీయ లబ్ధి కోసం, ప్రజలను మాయ చేసి, మత్తులో ముంచి, రాజకీయ పావులుగా మార్చిన రాజకీయ నాయకులే. విచక్షణాజ్ఞానం లేకుండా, అమ్ముడుపోయిన ప్రజలు కూడా ఇందుకు కారణం. సోమరితనం కారణంగా పనిచేయటానికి ఇష్టపడక, ఒకరినొకరు దోచుకునే పరిస్థితికి వచ్చారు" ప్రతి మనిషి మరి ఒకరిని దోచుకునే వారే, తన సౌఖ్యం తన లాభం చూసుకునేవారే " అన్న ఘంటసాల పాట జ్ఞప్తికి వచ్చింది. ఈ పరిస్థితి ఇలాగే సాగితే, భారతదేశ బలహీనతను ఆసరాగా చేసుకుని మళ్ళీ విదేశీయులు భారతదేశాన్ని స్వాధీనం చేసుకోవచ్చు.

మళ్ళీ భారతదేశం విదేశీ పాలనతో బానిస దేశంగా మారవచ్చు. డ్రైవర్ చెప్పినట్టు ప్రపంచ పుటలలో భారతదేశం కనిపించకపోవచ్చు. భగవాన్ ఆ పరిస్థితి నా దేశానికి రాకూడదు. అలా జరగకుండా ఉండాలంటే ప్రజలలో మార్పు రావాలి. వాళ్ల ఆలోచన శైలిలో, వాళ్ల దృక్పదంలో, వాళ్ల చేతలలో, మార్పు రావాలి . తన గురించి కాక దేశం గురించి, దేశ సంక్షేమం గురించి ఆలోచించాలి. ప్రభుత్వాలకి చేయూతనివ్వాలి. కలిసికట్టుగా పని చేయాలి. సమిష్టి వ్యవసాయం, కుటీర పరిశ్రమలు మొదలు పెట్టాలి.

ఎవరో వస్తారని ఏదో చేస్తారని, ఎదురుచూడక ప్రతి ఒక్కరు తమ వంతు సాయం అందిస్తే తప్పక దేశం మళ్లీ అభ్యుదయం వైపు నడుస్తుంది. ధనవంతులు డబ్బులు దాచుకోక సమాజం అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి. మానవతా విలువలు పెంచుకుని, మమతానుబంధాలతో, మన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించి నడుచుకోవాలి. అందుకు విదేశాలలో ఉన్న ఎన్నారైలు కూడా ఇక్కడ దేశ పరిస్థితి తెలుసుకుని తమ తమ రాష్ట్రాలలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలి. అందుకు నేనే ముందుగా శ్రీకారం చుట్టాలి. అప్పుడే దేశం పురోగమిస్తుంది. ఇదంతా ఏదో మొక్కుబడిగా కాకుండా అందరూ తమ ధర్మంగా భావించి, మనస్ఫూర్తిగా, ప్రేమతో హింస ద్వేషాలకు తావివ్వకుండా ఒక్కటిగా నడుచుకోవాలి. ఎందుకంటే ప్రేమ ఒక్కటే మనిషికి బలం.

సృష్టికి మూలం ప్రేమ, సృష్టిని నడిపేది ప్రేమ, ప్రేమ ఉన్నచోట మానవత్వం ఉంటుంది. మనుగడ ఉంటుంది, పురోగభివృద్ధి ఉంటుంది.

తన కళ్ళు తెరిపించిన డ్రైవర్ని, రెండు చేతుల్లో పట్టుకుని మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పి, ఏదైనా మంచి హోటల్ కి తీసుకు వెళ్ళమన్నాడు రామ్. అతని హృదయాల్లో ఎంతో ప్రశాంతత, తన దేశానికి మళ్లీ పూర్వపు వైభవం తప్పక వస్తుందన్న నమ్మకంతో ఆ భగవంతుడికి నమస్కరించాడు రామ్.

*******

# దసరా-విజయదశమి




ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు. ఈ తొమ్మిది రోజులతో పాటు పదవ రోజు విజయదశమిని కూడా కలుపుకొని 'దసరా' అంటాము. అందుకే పదిరోజులు అని అర్థాన్నిచ్చే 'దశహరా' యే దసరా అయింది. ఇది శరత్కాలంలో వచ్చే నవరాత్రులు కాబట్టి శరన్నవరాత్రులంటాము. తెలంగాణంలో బతుకమ్మ ఆరాధన ఈ నవరాత్రుల ప్రత్యేకత. ఇతర ప్రాంతాల్లో శక్తి ఆరాధనల్లో లక్ష్మి-సరస్వతి-దుర్గామాతల పూజలు చేస్తారు. బొమ్మల కొలువు ఈ ఆరాధనలో మరో ప్రత్యేకత.

"అయ్యవారికి చాలు ఐదు వరహాలు- పిల్లవాండ్రకు పప్పు బెల్లాలు" అని దసరా పద్యాలు పాడుతూ గురు శిష్యులు ఊరిలో విల్లంబులు, కోతి బొమ్మలు పట్టుకొని బుక్కాగులాలు చల్లుకుంటూ తిరుగుతూ విద్యాప్రాముఖ్యాన్ని తెలియజేస్తుంటారు.

విజయదశమి రోజున శమీపూజ "శమీ శమయతే పాపం శమీ శత్రువినాశినీ/ అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శనమ్" ఈ మంత్రశ్లోకం తో చేస్తారు. శమీవృక్షం పాపాలను శమింపజేస్తున్నది. శత్రువులను నాశనం చేస్తున్నది. అర్జునుని ధనువును దాచుకొని రక్షిస్తున్నది. శ్రీరామచంద్రునకు ప్రియాన్ని చేకూరుస్తున్నది. ఈ అర్థాన్నిచ్చే శ్లోకాన్ని కాగితంపై వ్రాసి జమ్మి చెట్టుకు కట్టి రావటం ఆనవాయితీ. జమ్మి ఆకులను తెచ్చి బంధువులకు, ఇరుగుపొరుగువారలకు ఇచ్చి ఆశీస్సులను అభిమానాన్నిపొందుతుంటారు. గ్రామ పొలిమేరలు దాటి పోయి పాలపిట్టను దర్శించుకుంటారు. బొమ్మల కొలువు తీరుస్తారు. తెలంగాణంలో బతుకమ్మలాడటం ప్రాచీనకాలం నుండి వస్తున్న సంప్రదాయం

భారతీయుల పండుగలలో విజయదశమికి ఒక ప్రత్యేకత ఉంది. ఇది పదిరోజుల పండుగ. విజయదశమి అనే పేరు ఎట్లా వచ్చిందని చెప్పటానికి మూడు, నాలుగు కారణాలను మనం చెప్పవచ్చు. ఇందులో అర్జుననకు సంబంధించినది ఒకటి. అర్జునునకున్న దశనామాల్లో విజయుడనే పేరు కూడా ఒకటి. "నాజిత్వా వినివర్తామి తేన మాం విజయం విదుః"అని-యుద్ధంలో యుద్ధోన్మత్తులైన వారిని ఎదిరించటానికి వెళ్లి జయించకుండా తిరిగిరాడు. అందుకే విజయుడు- అని వ్యాసభారతం-విరాటపర్వంలో(44 అ. -14శ్లో.) లో చెప్పబడింది. అర్జునుడు విరాటమహారాజు కొలువులో ఉన్నపుడు - ఉత్తర గో-

గ్రహణ సందర్భంలో –కౌరవులను జయించటానికి జమ్మి చెట్టుపై ఉన్న ఆయుధాలను దించమని ఉత్తరుని కోరుతాడు. ఆ ఆయుధాలచే కౌరవులను జయిస్తాడు. ఈ విజయం ఆశ్వీయుజ శుద్ధదశమి నాడు వచ్చింది కాబట్టి– అర్జునుని విజయానికి గుర్తుగా ఆనాడు విజయదశమి యైంది. ఇది భారత కథ.

ఇక రెండవది శ్రీరామచంద్రునకు సంబంధించిన రామాయణ గాథ. హనుమ సీతమ్మ జాడను తెలుసుకొని వచ్చాడు. సుగ్రీవుడు, వానరులు మధుపానంలో మునిగి పోయి ఉన్నారు. శరత్కాలం ప్రవేశించింది. లక్ష్మణుని ద్వారా శ్రీరాముడు సుగ్రీవునకు కబురు పంపాడు. ఆశ్వీయుజ మాసారంభంలో వానర సేనలన్నీ దండయాత్రకు సిద్ధమయ్యాయి. శ్రీరాముడు రావణునితో యుద్ధం చేస్తున్నపుడు రావణుని తలలు తెగిపడుతున్నాయి అయినా అవి తిరిగి మొలుస్తున్నాయి. అపుడు శ్రీరాముడు దేవిని (శక్తిని) పూజించాడు. దేవి మేల్కొంది. ఆనాడు ఆశ్వీయుజ శుద్ధపాడ్యమి. నేటికి పదో రోజు విజయం లభిస్తుందని చెప్పింది. శ్రీరాముడు పదో రోజున రావణుని సంహరించి విజయాన్ని పొందాడు. ఆరోజునే అరణ్యావాసం ముగించుకొని అయోధ్య చేరుకున్నాడు. శ్రీరాముని ఈ విజయానికి గుర్తుగా విజయదశమి అయింది.

"శమీ శమయతే పాపం" అనే




శ్లోకం తో పాటు మరో శ్లోకాన్ని కూడా విజయదశమి రోజున చదువుతారు."కరిష్యమాణ యాత్రాయాం/ యథాకాలం సుఖం మయా/ తత్ర నిర్విఘ్న కర్త్రీత్వం భవ శ్రీరామపూజితే " యాత్ర చేస్తున్నపుడు శ్రీరామపూజ వలన యాత్ర నిర్విఘ్నం సాగలని రాజులు కోరుకొంటారు. ఇది రాజుల దండయాత్రను ఉద్దేశించి చెప్పబడింది. రాజులు దండయాత్ర చేయటానికి వర్షాకాలం కంటే శరత్కాలం అనువైనది. శరత్కాలారంభంలో రాజులు తమ ఊరు లేదా దేశాన్ని విడిచి దండయాత్ర చేయటం చేయటం పరిపాటి. దీన్నే సీమోల్లంఘన అంటారు. ఈ సీమోల్లంఘనే తెలంగాణలో 'సిలంఘన్' గా వ్యవహరిస్తున్నారు. ఇది ఇప్పుడు విజయదశమి నాడు గ్రామ పొలిమేరలు దాటిరావాలనే ఆచారంగా మారింది.

వ్రత విధాన గ్రంథాల్లో విజయ సమయాన్ని గురించి చెప్పబడింది. ఆశ్వీయుజ శుద్ధ దశమి చుక్కలుపొడిచే వేళ విజయకాలమని " ఆశ్వినస్య సితే పక్షే / దశమ్యాం తారకోదయే /సకాలో విజయో నామ సర్వకామార్థ సాధకః " అది అన్ని రకాల కోరికలను తీర్చగలదని చెప్పబడింది. ఈ విధంగా ఆశ్వీయుజ శుద్ధ దశమి విజయ దశమి అవుతున్నది.

విజయదశమిని పండుగగా ఆచరించటం ఆర్యులకాలం నుండే వస్తున్నది. ప్రాచీన
కాలంలో ఆర్యులు 'అపరాజితాదేవి' ని ఆరాధించే వారు. అపరాజిత అంటే పరాజయమంటే తెలియని విజయ దేవత. నవమీ శేషయుక్తమైన దశమి రోజున అపరాజితను పూజిస్తే విజయాన్ని ఇస్తుందని స్కాంద పురాణంలో చెప్పబడింది.("దశమ్యాంచ నరైః సమ్యక్/ పూజనీయా పరాజితా/ మోక్షార్థం విజయార్థం చ పూర్వోక్త విధినా నరైః/నవమీ శేషయుక్తాయాం దశమ్యామపరాజితా/ దదాతి విజయం దేవీ పూజితా జయ వర్ధనీ " ) అపరాజితను చాణక్యుడు పూజించినట్టు ఆతని అర్ధశాస్త్రంలో కనిపిస్తుంది. అపరాజిత అంటే శమీవృక్షబేదంగా మనకు వైద్యశాస్త్రగ్రంథాల్లో చెప్పబడింది. ఈ విధంగా అపరాజితకు-శమీ వృక్షానికి సంబంధమేర్పడుతున్నది.

- మాదిరాజు వాణి


ఆసియా కప్ ఫైనల్ లో
భారత్ ను గెలిపించిన
తిలక్ వర్మ


దాదా సాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత
మోహస్ లాల్

RNI No. TELTEL/2011/39497 OCTOBER 2025 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st October Date of Posting:8th October

# బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు




Published, Edited and Printed by T Shanti at Flat No. 504, Tower A06, Rajiv Sahabhavana
Nagole-Bandlaguda, Hyderabad-500068. Phone 9490571297 email: teega51@gmail.com ,
www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.
www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-50000